# TSA కథ 2012

**(కథా సంపుటి)**

**టి. ఎస్. ఎ. కృష్ణమూర్తి**

**కళా ప్రచురణలు**

మదనపల్లె - 517 325, చిత్తూరు జిల్లా (ఎ.పి.)

TSA కథ 2012
ప్రథమ ముద్రణ : ఏప్రిల్ 2013
ప్రతులు : 1000
హక్కులు : © రచయితవి

ముఖ చిత్రం :
44 సం॥ల క్రితం జీవన సంగ్రామం
మధ్యన నా సాహితీ ప్రస్థానం ప్రారంభమైన
ప్రదేశం – నేడు! (రేపు ఈ చెట్లు కూడా
తొలగింపబడ్తాయని తెలుస్తున్నది)

కళా ప్రచురణలు – 3
మదనపల్లె – 517 325
వెల : ₹ 72

ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రములు
లేదా
**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
3–169–16 రామారావు కాలనీ
బాపూజీ మునిసిపల్ స్కూల్ రోడ్
**మదనపల్లె – 517 325**
చిత్తూరు జిల్లా (ఆం.ప్ర.)
ఫోన్ : 08571 – 221963
సెల్ : 93472 98942
email : todimella krishnamurthy @ g mail.com

ముద్రణ : **విజయవాణి ప్రింటర్స్**
గోసులకురప్పల్లి రోడ్డు,
చౌడేపల్లి – 517 257
చిత్తూరు జిల్లా
ఆంధ్రప్రదేశ్.

# అంకితం



**శ్రీ దయ్యాల శ్రీనివాసులు రెడ్డి,** M.Tech (Ph.D)
అసోసియేట్ ప్రొఫెసర్
& హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు
(మెకానికల్)
S.V.I.S.T, **అంగల్లు, మదనపల్లె - 517 325**
చిత్తూరు జిల్లా

**ఓ**పికకు, నిలువెత్తు మనిషితనానికీ నిదర్శనంగా అక్కడక్కడ ఒక్కోమనిషి నిండైన వ్యక్తిత్వంతో కన్పిస్తూ మనమీ సమాజాన్ని జీవింపజేసుకోవచ్చుననే నమ్మకాన్ని, ఆశలను కలిగిస్తుంటారు. అలాంటి వ్యక్తులలో ఒకరైన ఒక మంచి మనిషి శ్రీ దయ్యాల శ్రీనివాసులు రెడ్డిగారు.

ఇంటిపేరులో 'దయ్యాల' శబ్దంవున్నా వీరిలో దైవత్వం నిండుగా కన్పిస్తుంది. అందుకే వీరికీ చిన్న గ్రంథాన్ని చిరుకానుకగా సమర్పిస్తున్నాను.

**– *టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి***
01-04-2013

# కృతజ్ఞతలు

ఈ సంపుటిలోని కథలను 2012వ సంవత్సరంలో ప్రచురించిన....

1. కదలిక మనలో (మాసపత్రిక)
2. స్వప్న (మాసపత్రిక)
3. ప్రజాశక్తి (ఆదివారం అనుబంధం)
4. శ్రీలక్ష్మి (మాసపత్రిక ప్రారంభ సంచిక)
5. ఉపాధ్యాయ (మాసపత్రిక)
6. రచన (మాసపత్రిక)
7. జాగృతి (వార పత్రిక)
8. విపుల (మాసపత్రిక)
9. ఆశ (మాసపత్రిక)
10. ఆలోచించండి (మాసపత్రిక)

పై పత్రికల వారికి మరియు నా చిన్న సాహిత్య ప్రపంచంలో నాకున్న సాహితీ ఆప్తులు.... సర్వశ్రీ

1. డా॥ మల్లెల గురవయ్య
2. డా॥ జోలె పాళెం మంగమ్మ
3. ఆర్. వసుంధరాదేవి
4. సి. వేణు
5. శ్రావణి మునిసుందరం
6. సి. శ్రీకాంత్ కుమార్
7. వియోగి (కోపల్లె విజయప్రసాద్)
8. నాయుని కృష్ణమూర్తి
9. రాచపూటి రమేష్
10. ఎ.వి. సోమయాజులు
11. సనగరం పార్థసారథి
12. ఎ. మల్లేశ్వరరావు
13. కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై
14. ఎ. పుష్పాంజలి
15. డి. రామచంద్రరాజు
16. కలువకుంట్ల గురునాథపిళ్ళై
17. సి.హెచ్. వెంకటరత్నం (ద్వారకా)
18. వి. రాజారామమోహనరావు
19. జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి
20. ఆముదాల మురళి

మొదలైన వారికి మరియు ఈ పుస్తకమును ఇంత అందముగా ముద్రించి ఇచ్చిన విజయవాణి ప్రింటర్స్ (చౌదేపల్లి) వారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతాభి వందనములు తెలియజేయుచున్నాను.

**– టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
01-04-2013

## ఇందులో........

నా మాట.... మరియు కృతజ్ఞతలు

1. మనుషులు మరణిస్తారు 9

*– కదలిక మనలో మాసపత్రిక, నవంబరు 2012*

2. పనిమనిషి 23

*– స్వప్న మాస పత్రిక, డిసెంబరు 2012*

3. అన్నదాత 31

*– ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 20-5-2012*

4. గుండెమంట 47

*– శ్రీలక్ష్మి మాసపత్రిక ప్రారంభ సంచిక మార్చి 2012*

5. ఎదుగుదల ఎక్కడాగిపోతున్నది? 56

*– ఉపాధ్యాయ మాసపత్రిక మే 2012*

6. ఆత్మబంధువు 70

*– రచన మాసపత్రిక మే 2012*

7. చద్దిపెట్టె 79

*– జాగృతి వారపత్రిక 21-5-2012*

8. విలువ 83

*– విపుల మాసపత్రిక జూలై 2012*

9. వెన్నెల వానలో 89

*– ఆశ మాసపత్రిక ఆగస్టు 2012*

10. అణాకార్డు 99

*– ఆలోచించండి మాసపత్రిక డిసెంబరు 2012*

# నా మాట...

**చ**ల్లని పుణ్యభూమి మదనపల్లె (చిత్తూరు జిల్లా)లో పుట్టి 64 సంవత్సరాలయింది. వచన సాహిత్యం చదవడం మొదలుపెట్టి 50 సం॥రాలయింది. నలభై అయిదేళ్ళుగా వ్రాస్తున్నా నా కథల్ని అచ్చులో చూసుకుంటున్నది నలభై రెండేళ్ళుగానే! కొద్దో, గొప్పో వైవిధ్యభరితమైన కథల్ని వ్రాయగలుగుతున్నది ముప్పై ఎనిమిదేళ్ళుగానే!!

గత ఏడాది... 2012 జనవరి ఒకటి నుండి డిసెంబరు ముప్పై ఒకటి లోపు ప్రచురితమైన నా కథలు సరిగ్గా చేతి వేళ్ళమీద లెక్కపట్టగలిగేలా పది తేలాయి. ప్రచురణకు అంగీకరింపబడికూడా గత రెండు మూడేండ్లుగా ముద్రణకు నోచుకోకుండా పత్రికలలో నలుగుతున్న శక్తివంతమైన కథలూ మూడు నాలుగున్నాయి. అవికూడా 2012లో వెలుగు చూస్తాయని అనుకున్నాను కానీ ఉత్తరాలు వ్రాసినా ఆయా పత్రికాధి పతులకు కరుణ కలిగినట్లు లేదు.

ఏది యేమయినా ఈ పది కథలలో శక్తివంతమైన, వైవిధ్యభరిత కథలు ఎక్కువే వున్నాయి! అందువల్ల ఈ పది కథలతోటే TSA కథ 2012 (కథాసంపుటి)ని నా తొమ్మిదవ గ్రంథంగా తీసుకురావడానికి సాహసిస్తున్నాను.

ఎవరి బిడ్డలు వారికి ముద్దు అన్నట్లు నా కథలు నాకు అపురూపంగానే అన్పించవచ్చు. కానీ పాఠక ప్రపంచంలో మేధావులెందరో ఉన్నారు. ఆపై సమీక్షకులు, విమర్శకులూ ఉన్నారు. కాబట్టి వారి ద్వారానే తెలియాలి నా ఈ ప్రయత్నం ఎంతవరకూ సఫలీకృతం అవుతుందో?

**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**
01-04-2013

3-169-16 రామారావు కాలనీ
బాపూజీ మునిసిపల్ స్కూల్ రోడ్
**మదనపల్లె - 517 325**
చిత్తూరు జిల్లా (ఆం.ప్ర.)
ఫోన్ : 08571 - 221963
సెల్ : 93472 98942

# మనుషులు మరణిస్తారు

రెండు గంటలయినా అవందే?!

మళ్ళీ ఫోను...ప్రొడక్షన్ ఇంఛార్జి నుండి...

"ఏం చేస్తున్నారు?" అంటూ ఒళ్ళు మండించే ప్రశ్న...

"వేస్టు దారాలు లాగి కట్టలు కడ్తున్నాము!" అని అరచి చెప్పాలనిపించింది.

కష్టం మీద సంబాలించుకుని ఓపికగా ఓ అపద్దం చెప్పాను...

"బువ్వ తింటున్నాను సార్!" అని

"సరేసరే... దాదాపు పది మాసాలపాటు జరిపిన సంప్రదింపులను, సేకరించిన ప్రజాభిప్రాయాలనూ నిర్దిష్టంగా క్రోడీకరించడం పూర్తిగా జరిగిపోయిందట! ఇప్పటికే బాగా ఆలస్యం జరిగిందనీ, ఇంకా సాగదీయరాదనీ ప్రజా ప్రతినిధుల నుండి, ప్రజల నుండి కూడా వొత్తిడి వస్తున్న నేపథ్యంలో ఈనెల ముప్పై ఒకటవ తేదీ నాటికి నివేదిక ఇవ్వబడ్తుందని కమిటీ ఛైర్మెన్ ఘంటాపదంగా చెప్పేశారట. ఇది లేటెస్ట్ న్యూస్!" ఎక్సయిటెడ్‌గా చెప్పాడు ప్రొడక్షన్ ఇంచార్జి.

"అలాగా సార్!" అన్నాను నీరసంగా.

"అంత నిరుత్సాహంగా "అలాగా?" అంటే కాదు... మీరు ముప్పయవ తేదీలోగా ప్రోగ్రాం ఫుల్‌ఫిల్ చెయ్యాలి!"

"కష్టం కద సార్. ఇంకా ఎనిమిది ప్రదేశాలు తిరగాలి, ఇంకో యాభై మందినయినా ఇంటర్వ్యూ చెయ్యాలి... ఎనభయిగంటలలోగా మీకు అంతా అందిపోయేలా చేయాలి కద!" అన్నాను అసహనంగా.

"యాష్టపడితే లాభం లేదు రాజారావ్! చప్పున తినడం ముగించి బయల్దేరండి! దొరికిన వార్ని దొరికినట్లు పట్టుకుంటూ వెళ్ళండి. అది నల్లపిల్లా, తెల్లపిల్లా అని చూడకండి. మనక్కావల్సింది ఎలుకను పట్టడం. రెండ్రోజుల్లో మీ వర్కు పూర్తయి పోవాలి... మూడోరోజు మధ్యాహ్నానికంతా మొత్తం డేటా మాకందిపోవాలి!"

"సరే సర్!" అన్నాను చేసేది లేక.

ఎప్పటికప్పుడు రిపోర్ట్ డేటాస్ పంపిస్తోంటే ఆపై బాధ్యత పైవాళ్ళది కదా అనే ఉద్దేశ్యంతో శనగలు తిని చెయ్యి తుడుచుకున్నట్లుంటుందని ఈ వృత్తిని ఎన్నుకున్నాను. తీరా దిగిన తరువాత గానీ లోతు తెలిసిరావడం లేదు.

కేమరామెన్ నెంబర్ సెర్చ్ చేసి కాంటాక్టు చేశాను.

"ఏమయ్యా మహానుభావా, ఎంతట్లో వున్నావు? ఇక్కడ... ఇవతల కొంపలంటుకుంటున్నాయి!"

"ఉదయం రైలు మిస్సయింది సార్... బస్‌లో వున్నాను. అరగంటలో మీ ముందు వాల్తాను!" అన్నాడు కెమెరామెన్ శంకర్.

అతనికి కొత్తగా పెళ్ళయింది. సందు దొరికితే రాజధాని రైలెక్కేస్తానంటాడు... ఇక్కడేమో టైట్ షెడ్యూలు... పైవాళ్ళూ ఊపిరి సలుపుకోనివ్వరు.

నిజానికి సాటిలైట్ ట్రాన్స్‌మీటర్ కలిగివున్న వ్యాన్‌లో, టెక్నికల్ క్రూతో కలసి వరుసగా చేసుకుంటూ వెళ్ళాల్సిన వర్కు ఇది.

కానీ ఈ సమస్యంతా అంచెలంచెలుగా, అయోమయంగా వెరీలాంగ్ ప్రాసెస్‌లో నడుస్తున్నందున క్రొత్తగా ప్రారంభింపబడిన మా న్యూస్‌ఛానెల్ వారు కెమెరామెన్‌ను మాత్రం తోడిచ్చి ఆంధ్రదేశం మీదికి తోలేశారు.

ఆ కమిటీ నివేదిక ఇప్పుడిప్పట్లో రాదని అనుకుంటూ మేమూ కాస్త నెమ్మదిగానే కదుల్తున్నాము. అయినా ఆ కమిటి ఇంత ఫాస్టుగా తమ నివేదికను ప్రభుత్వానికి అందివ్వగలదని ఎవరనుకోగలరు?

అన్నట్లుగా అరగంటలో కాక గంటన్నర తరువాత ప్రత్యక్ష్యం అయ్యాడు శంకర్.

బెల్‌కొట్టి లాడ్జ్‌బోయ్‌ని పిలిచి గది ఖాళీ చేస్తున్నట్లు చెప్పాను.

"ఎందుకూ? ఈ రోజు ఈ ఊర్లోనే ఉండాలనుకుంటున్నాము కదా?" అన్నాడు శంకర్.

"అనుకున్నాము... కానీ... ఇందాక మీ మేనమామగారు ఫోన్‌చేసి మర్నాటికి టోటల్ రిపోర్ట్స్ సబ్‌మిట్ చెయ్యమని చెప్పారు!" అన్నాను.

"అమ్మో... కష్టం కద!" అన్నాడు శంకర్ కాస్త భయపడి.

"ముప్పయి ఒకటి మధ్యాహ్నానికి కమిటీ రిపోర్ట్ చేసేస్తుందట. కనీసం అందుకు ఇరవయినాలుగు గంటల ముందయినా మన ప్రోగ్రాం టెలికాస్ట్ చేసెయ్యాలనే ఉద్దేశంలో ఉన్నట్లున్నారు మనవాళ్ళు!"

"అయ్యోరామా!" అన్నాడు శంకర్.

"అయ్యోరామా! అన్నా ఆ రాముడేం పరిగెట్టుకురాడు కదా? మనపాటికి మనం పరిగెత్తాల్సిందే... పద! పద...!!" అన్నాను కాస్త అసహనంగా.

లిఫ్టు దిగి రిసెప్షన్ కౌంటర్‌లో అడ్వాన్సు వాపసు తీసుకుంటూండగా లాడ్జి ముంగిట టాక్సీ ఆగింది.

అలనాటి హిందీ హీరో అశోక్‌కుమార్‌లా అందంగా, టక్కుటైతో వున్న ఓ వ్యక్తి టాక్సీ దిగడం కన్పించింది.

"దొరికాడురా దొర!" అని అనుకుంటూ శంకర్‌కు సైగ చేశాను.

క్షణాలమీద బ్యాగ్ ఓపెన్ చేసి కెమెరా తీసుకుని సిద్ధమయ్యాడు శంకర్. నేను మైకు అందుకున్నాను.

"ఎక్స్‌క్యూజ్‌మి సార్!" అన్నాను సగౌరవంగా.

"ఎస్... చెప్పండి!" అన్నాడాయన సౌమ్యంగానే... కాస్త హుందాగా.

"సర్, ఉయ్ ఆర్ ఫ్రం మహామూన్ టీ.వీ. ఉయ్ ఆర్ టేకింగ్ ఒపినీయన్స్ ఆన్ అవర్ స్టేట్ ప్రజంట్ క్రిటికల్ ఇష్యూ ఫ్రం అవర్ ఆనరబుల్ పీపుల్... లెట్‌మి హ్యావ్ పర్మిషన్..."

"ఇట్సాల్‌రైట్... అడగండి!" అన్నారాయన.

"మీ పేరు, వృత్తి బాధ్యతలు చెప్పండి!" అంటూ మైక్‌ను అతని ముందుకు చాపాను.

"నా పేరు శరత్‌కుమార్. స్వంత వూరు తిరుపతి. వృత్తిరీత్యా వ్యాపారస్తుడ్ని!" అన్నాడు.

"చాలా సంతోషమండీ! ప్రస్తుతం ఆంధ్రరాష్ట్రాన్ని అట్టుడికిస్తున్న ఈ విభజన సమస్య మీద మీ అమూల్య అభిప్రాయం తెలపండి!"

"కలసి కట్టుగా వుండి ఇంతమంది పార్లమెంటు సభ్యులను సంఘటితంగా అందజేస్తుంటేనే మనకు రావాల్సిన నిధులు, కావాల్సిన సౌకర్యాలు... అన్నీ అంతంత మాత్రం కద? ఉదాహరణకు రైల్వే బడ్జెట్ చూడండి! ఇహ మనం విడిపోయి ముక్క చెక్కలయిపోతే, ఉనికిని కోల్పోతే ఆ పై ఏం సాధించుకోగలం? రాష్ట్ర అవసరాలు, అవకాశాల దృష్ట్యా మనం అందరం సంఘటితంగానే అన్నింటిని సాధించుకోవడం బావుంటుంది!"

"విడిపోవడం లాభదాయకం కాదంటారు?"

"కలిసివుంటే కలదు సుఖం అన్నారు కదండీ పెద్దలు!"

"ఇంకా ఈ విషయంగా మీరిచ్చే సలహాలు, సూచనలూ ఏమిటండీ?"

"కలసిమెలసి ఉంటూనే రాష్ట్రానికి కావలసినవన్నీ సాధించుకోవాలి! వనరులు, నదీ జలాలు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన సబ్సిడీలు... ఇలా అన్నింటిలో అగ్రతాంబూలం అందుకోవడానికి ప్రయత్నించాలి. ఇహ అప్పుడు ప్రజలందరూ ఏ అసంతృప్తీ లేకుండా కలసిమెలసి జీవించగలరు తప్పక!"

"వెయ్యి కృతజ్ఞతలండి... మీ భావాలను మహామూన్ టీ.వి. ద్వారా ప్రజలందరితో పంచుకుంటున్నందులకు ధన్యవాదాలు!" అంటూ మైక్ మౌత్‌పీస్ వెనక్కి తీసుకున్నాను.

"ఈ కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రసారం చేస్తారు?" అతను ఆసక్తిగా అడిగాడు.

ముప్పయవ తేదీ సాయంకాలం లేదా ముప్పయి ఒకటవ తేదీ ఉదయం తప్పక ప్రసారం అవుతుందండీ! అన్నాను.

"వీలయితే ప్రసార సమయాన్ని నాకు తెలపండి!" అంటూ తన విజిటింగ్ కార్డు అందించాడాయన.

"అంత విరామమా?" అని మనసులో అనుకుంటూనే... "తప్పకుండా సర్!" అని చెప్పి ఆ కార్డు అందుకున్నాను.

✶ ✶ ✶

గబగబా టికెట్లు తీసుకుని పరుగు పెట్టుకువెళ్ళి నెమ్మదిగా కదులుతున్న ఎక్స్‌ప్రెస్ ట్రయిన్‌లో పడ్డాము. అదృష్టవశాత్తు రద్దీగా లేదు. వెళ్ళి ఖాళీగా వున్న ఫోర్‌సీటర్ సోఫాలో ఇద్దరం ఆరాంగా సూట్‌కేస్, ఎయిర్‌బ్యాగ్, కెమెరాకిట్ సర్దుకుని కూర్చున్నాము.

ఘటోత్కచపురం వదిలాక ఆ ట్రయిన్ చాలా తక్కువ హాల్టులతో గుడివాడ వరకూ నడుస్తుంది. ఆ ట్రయిన్ అందుకోగలగడం అదృష్టమే!

ట్రయిన్ ఇంకా పూర్తివేగం అందుకోకమునుపే నా వీపు గోకాడు శంకర్.

అప్పుడు చూశాను నేను. ఎదుటి బెంచ్‌లో వంటరిగా, విశ్రాంతిగా ఏదో పుస్తకం చదువుకుంటున్న ఆసామిని.

నా బుర్ర సక్రమంగా పనిచెయ్యడం మొదలుపెట్టింది. అభినందన పూర్వకంగా శంకర్‌వైపు చూసి ఆపై ఆయన మీద దృష్టి సారించాను ఓ చిన్న పొడి దగ్గుతో.

నా పొడిదగ్గు ఆయన దృష్టిని పుస్తకం మీదనుండీ నా మీదకు మరల్చగలిగింది

"అయ్యగారూ, తమరి నామధేయం తెలుసుకోవచ్చా?" అని వినయంగా ప్రశ్నించాను.

"నన్ను ప్రకాశం పంతులంటారు!" అన్నాడాయన ప్రశాంతంగా.

"చిన్న అభ్యర్థన" అన్నాను.

"చెప్పండి"

"నా పేరు రాజారావు. ఈయన పేరు శంకర్... ఇద్దరం మహామూన్ టీవీ తరపున ఆంధ్రదేశమంతటా పర్యటిస్తున్నాం!"

"ఎందుకు?"

"ప్రస్తుతం ఆంధ్రదేశాన్ని అట్టుడికిస్తున్న విభజన సమస్యమీద ప్రకాశకులయిన ప్రజల మనోభావాల తాలూకు అభిప్రాయాల సేకరణ నిమిత్తం మా పర్యటన జరుగుతోంది!" అన్నాను.

"ఎటొచ్చి నాలుగైదురోజుల్లో కమిటీ నివేదిక రిలీజ్ అవబోతోంది కద?" అన్నాడాయన ఒకింత ఆశ్చర్యంగా.

"ఆలోపే మహామూన్ టీవీ ప్రజాభిప్రాయాలను ఒక చిన్న కార్యక్రమం ద్వారా ప్రసారం చెయ్యబోతున్నది"

"మంచిదే!"

"తమరు కూడా తమ అమూల్య అభిప్రాయాన్ని వెలువరించ గలిగితే స్వీకరించగలం!" అన్నాను అభ్యర్థనగా.

అప్పటికే శంకర్ కెమెరా వెలుపలికి తీసి సిద్ధం చేసుకుంటున్నాడు.

“నా అభిప్రాయానికి విలువ ఇస్తున్నందుకు కృతజ్ఞతలండీ! అడగండి చెబుతాను!” అన్నాడాయన.

“మొదట మీ పేరు, వృత్తి బాధ్యతలు సెలవివ్వండి!” అంటూ మైక్‌మౌత్‌పీస్‌ను ఆయన ముందుకు చాపాను.

“నా పేరు ప్రకాశం పంతులు. నేను ఖమ్మం జిల్లా ఇల్లందు పాల్వంచల మధ్య ప్రాంతంలో అంకిపాడు మిట్టకు చెందిన రిటైర్డు గెజిటెడ్ హెడ్మాష్టరునండీ!”

“చాలా సంతోషం ప్రకాశం పంతులుగారూ! చెప్పండి. జఠిలమైన ఈ సమస్య మీద మీ అమూల్యమైన అభిప్రాయం ఏమిటి?”

“నా అభిప్రాయం అయితే... ఆ విభజనయెదో సలక్షణంగా, సక్రమంగా, సత్వరమే జరిగిపోతే మంచిదని!” అన్నాడాయన కాస్త ఖచ్చితమైన స్వరంతో!

“మీరింత ఖచ్చితంగా చెప్పడానికి కారణాలేమైనా తెలుపగలరా?”

“కారణాలయితే అసంఖ్యాకంగానే ఉన్నాయి. మచ్చుకి నా వ్యక్తిగత అనుభవం ఒకటి చెబుతాను. అన్నం మెతుకు ఒక్కటి పట్టి చూసినా చాలు కద?”

“నిజమేనండీ... చెప్పండి... మీ అనుభవాన్ని.”

దాదాపు ముప్పయి అయిదేళ్ళ క్రితం ఆంధ్రప్రాంతం నుండి ఓ కుటుంబం మా ప్రాంతానికి వచ్చేసి మా వూర్లో స్థిరపడడం జరిగిందండి. అదృష్టవశాత్తో, దురదృష్టవశాత్తో ఆ కుటుంబ యజమానితో నాకు స్నేహం కలసి బాగా పెరిగి పెద్దదయిందండీ.

అతడేమో మా వూరి ప్రక్కనే ఓ చిన్న మెటల్ ప్రాసెస్ ప్రారంభించాడు ఆ రోజుల్లో. తన అదృష్టం బావుంది. అతని ఉత్పత్తులకు బాగా గిరాకీ ఏర్పడి అంచెలంచలుగా ఎదిగిపోయాడండీ... స్థాయీపరంగా లక్షలు పెరిగి పెద్దవయి అతన్ని కోటీశ్వరున్ని చేసేశాయి.

ఇంజనీరింగ్ చేసిన మా అబ్బాయిని అతని ఫ్యాక్టరీలో మేనేజరుగా చేర్చుకున్నాడండీ. రెండేండ్ల తరువాత మా అబ్బాయికీ ఆయనకూ మధ్యన ఏవో అభిప్రాయబేధాలు ఉత్పన్నమయి మావాడ్ని ఉద్యోగంలోంచి తీసేసి ఇంటికి పంపేశారు.

మావాడు అటుతిరిగీ, ఇటు తిరగీ బంధువుల, స్నేహితుల ఋణ సహాయాలతో స్వంతంగా చిన్నమెటల్ ప్రాసెస్ పెట్టుకోవడానికి లైసెన్సుకు అప్లయి చేశాడు.

అప్పుడు తెలిసింది... మనిషితనం, మంచితనం నిండివున్న మహెూన్నత వ్యక్తిలా కన్పించే ఆయన నిజస్వరూపం!

నన్ను పిలిపించాడు...

"ఏమిటీ, మీవాడు మెటల్ ప్రాసస్ ప్రారంభిస్తాడట... నా మీద పోటీకే!?" అని ప్రశ్నించాడు.

"మీతో పోటీ ఏమిటండి? వాడి బ్రతుక్కు వాడో బాట వేసుకుంటున్నాడు!" అన్నాను.

"నేను వేయనివ్వను కద!"

"అదేమిటి?"

"ఇప్పుడే ఎక్కువ పోటీని ఎదుర్కొంటున్నాను. ఇంకా ప్రక్కలో మీ వాడిపోటీ ఒకటా? అవసరం అయితే రాత్రికిరాత్రే మీ వాడ్నీ అయిపులేకండా చేసేయించగలను!" అనేశాడు.

నేను దూరం ఆలోచించాను.

అతడు బలవంతుడు, ధనవంతుడు, పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్, నెట్‌వర్కు ఏర్పరచుకున్నవాడు... అన్నంతపనీ చెయ్యగలడేమో?

నేను మా అబ్బాయి ఆశలమీద నీళ్ళు చల్లి ఇంట్లో కూర్చోబెట్టాను. తరువాత మహారాష్ట్రలో, కర్నాటకలో, హైదరాబాదులో వున్న నా మిత్రులను పట్టుకుని ప్రయత్నాలు మొదలుపెట్టాను.

లక్కీగా బెంగుళూరులోని ఓ పెద్ద ఫర్మ్‌లో మా అబ్బాయికి మంచి ఉద్యోగమే లభ్యమైంది. ఇక వాడ్ని మా వూరి నుండీ పంపేశాను. మా వాడు స్వంతగడ్డమీద పెట్టుకోదలచిన చిన్న ఫ్యాక్టరీ కోట్లకు పడగలెత్తిన ఆ మహానుభావుడికి ఏ విధంగానూ అడ్డుకాదు నిజానికి.

కానీ...

ఇప్పుడు చెప్పండి... ఎక్కడ్నుండినో వచ్చిన వాడి దెబ్బకు పుట్టిపెరిగిన నేలనొదిలి మావాడు పరాయి పంచన బ్రతకాల్సి వస్తోంది. ఇది కేవలం నా వ్యక్తిగతానుభవమే కావచ్చు. కానీ ఎందరి అనుభవాలకో ప్రతీక కావచ్చు బహుశా!

తెలంగాణ ప్రజలు తెలివితక్కువవారు, రాయలసీమ ప్రజలు క్రూరులు, కళింగాంధ్ర ప్రజలు మొరటు వారు అని ఎక్కువ మంది కోస్తాంధ్ర ప్రాంతపు మనుషులు భావిస్తుంటారని నేను విని వున్నాను. అయితే మంచి చెడ్డలనేవి ఏ ప్రాంతంలో అయినా సరి సమాన నిష్పత్తులలోనే ఉంటాయన్నది నా విశ్వాసం.

తెలంగాణ ప్రజలలో తమకు అన్యాయం జరిగింది, జరుగుతోంది, జరగబోతోంది అన్న భావన బలపడిపోతున్నది కాబట్టి వీలయినంత త్వరగా విభజన జరిగిపోయి ఎవరి బ్రతుకులు వారు బ్రతికితే బావుంటుందన్నది నా అభిప్రాయం!" అంటూ ఊపిరి తీసుకోవడానికి ఆగాడు.

ప్రకాశం పంతులు గారితో చేసిన ఈ ఇంటర్వ్యూలో ఆవేదన వుంది, హృదయ స్పర్శ వుంది. కానయితే నేను దాన్ని ఇంకా పొడిగించదలచుకోలేదు. వృత్తిరీత్యా నాకూ కొన్ని పరిమితులుంటాయి కద? అందువల్ల క్లుప్తంగా రెండు మాటలు చెప్పి ముగించాను.

శంకర్ కెమెరాను కిట్‌లోకి సర్దేశిన తరువాత మాత్రం ఆయనతో చాలా విషయాల మీద చర్చ సాగించగలిగాను.

* * *

నిజానికి చదువువేరు – జ్ఞానం వేరు. లోక విజ్ఞాన సంపదను సముపార్జించు కోవడానికి గొప్పగా చదువుకోవాల్సిన అత్యవసరం అయితే లేదనిపిస్తూ భీమవరంలో ఒక మోటరు షెడ్డు యజమాని నుండీ మంచి అభిప్రాయాన్ని సేకరించగలిగాను.

ఆయన పేరు శ్రీమన్నారాయణ.

"చెప్పండి శ్రీమన్నారాయణగారూ, ఈ విభజన తాలూకు సమస్య మీద మీ అభిప్రాయం అయితే ఏమిటి?"

"ముక్క చెక్కలయిపోయివుండిన మన నేల పరాయివాడి పాలనలో ఎలాగో ఒక్కటయిందండీ!"

"అవును!" అంటూ ఏకీభవించాను.

"వాళ్ళ మోచేతి క్రింది నీళ్ళు త్రాగుతూ దాస్యంతో బానిస బ్రతుకులు బ్రతుకుతుండిన మనకు మన పూర్వీకులు నానా బాధలుపడి, రకరకాలుగా పోరాడి, చచ్చిచెడీ స్వాతంత్ర్యం తెచ్చి పెట్టారండీ!"

"అవును!"

"ఇల్లయినా పూర్తికాకమునుపే ఎలుకల రావిడి అన్నట్లుగా ఆ వెంటనే మత, భాషా ప్రాతిపదికన మళ్ళీ ముక్కచెక్కలవడం మొదలయిందండీ!"

"అవును! వాస్తవం!!"

"ఎంతవరకూ వెళ్ళాలండీ... విడిపోతూను? ప్రాంతాలవారీగా, జిల్లాలవారీగా, తాలూకాల వారీగా, ఊర్లవారీగా, వీధులవారీగా... చివరకు రవీంద్రులవారు కలతచెందిన విధంగా సంకుచితపు గోడలు కట్టుకుని ఊపిరి పీల్చడానికి కూడా గాలి దొరకనంతగా కుటుంబాలవారీగా కూడా విడిపోవాలండీ? ఎక్కడికి మన ప్రయాణం? ఏం సాధించాలనుకుంటున్నాం మనం??" ఆయన స్వరంలో ఒకింత ఆవేదన.

"చాలా చక్కటి ప్రశ్నండీ శ్రీమన్నారాయణగారూ! ఇంతకూ మీరు చిట్టచివరగా చెప్పదలచేదేమిటి?"

"చెపితే చాలా వుంది! వింటే ఎంతో వుంది!! అన్నట్లుగా చెప్పుకుంటూపోతే ఎంతో ఉందండీ... అదంతా నిజానికి అప్రస్తుతం! ప్రస్తుత సమస్యకు విభజన పరిష్కారం కాదు, ముగింపు అంతకాన్నకాదు. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి, కలసి మెలసి జీవిస్తూనే అందరూ ఆనందంగా ఉండేందుకు తగిన మార్గాలను అన్వేషించాలి! అంతే!!" అనేశాడు శ్రీమన్నారాయణ.

* * *

మరో పావుగంటలో రాజమండ్రి బస్ పట్టుకున్నాము. క్షణం తీరిక తీసుకోలేదు, నిముషం విశ్రాంతి కోరుకోలేదు, ఘడియపాటయినా సరయిన కునుకుతీయలేదు.

చకచకా ఊర్లు తిరుగుతూ అనువుగా దొరికిన మనిషిని దొరికినట్లు కాంటాక్టు చేస్తూ, అభిప్రాయాలు తీసుకుంటూ చివరికి పలాస స్టేషనులో తేలాము.

* * *

చిట్టచివరి ఇంటర్వ్యూ పార్వతీపురం ప్రాంతంలో చేశాను. ఆయన పేరు నజీరుద్దీన్... రిటైర్డు జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్.

"వృత్తిరీత్యా వివిధ హోదాలలో అన్ని ప్రాంతాలలో పనిచేశాను. అప్పటి పరిస్థితులు వేరు, అప్పటి మనుషులు వేరు. ముఖ్యంగా అప్పటి మనస్తత్వాలే వేరు. నేటి మనుష్యుల మధ్య ప్రేమాభిమానాలు బాగా తగ్గిపోయాయి. విలువలు అంతరించి పోతున్నాయి. నలుగురు కలసి ఉండాలన్నా మరో నలుగురు ఉండనివ్వని సామాజిక, రాజకీయ పరిస్థితులు ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. ఈ దుస్థితిలో ఈ రాష్ట్రం ఇంకా కలసి కొనసాగుతుందని నాకనిపించడం లేదు. బహుశా విడిపోతుందనే అనుకుంటున్నాను. అనుమానాలతో, భయాలతో, అభద్రతాభావాలతో, కుళ్ళు రాజకీయాలతో కలసి కొనసాగడం కన్నా విడిపోవడమే మంచిదని నా కన్పిస్తున్నది!"

ఆయన స్వరంలో అంతర్లీనంగా ఒక విషాద జీర...

ఆ ఇంటర్వ్యూతో మా వాళ్ళు చెప్పిన వంద అభిప్రాయాల సేకరణ పూర్తయింది.

ఎడిటింగ్‌కూ, పిక్చరైజేషన్‌కూ, టైం ప్లానింగ్‌కూ వీలుగా ఎప్పటికప్పుడు మా స్టుడియోకు అన్నీ పంపివేస్తూ రావడం వల్ల చిట్టచివరి అభిప్రాయాన్ని కూడా అరగంటలోపే మా డాట్‌కాంలోకి నెట్టేసి విశ్రాంతిగా నిట్టూర్చాను.

"శంకర్ నీసెల్ ఆఫ్ చెయ్యి. నా సెల్ కూడా ఆఫ్ చేసేస్తున్నాను. దొరికిన బస్‌లు పట్టుకొని విశాఖ చేరుకోవడమే మేలనిపిస్తున్నది. రిజర్వేషన్ దొరికినా దొరకక పోయినా ఏదో ఒక ఎక్స్‌ప్రెస్ రైలు పట్టుకోవచ్చు. ముందు ఇండ్లు చేరుకుని, ఇంటి తిండి తిని తరువాత ఆన్ చేద్దాం సెల్‌ఫోన్స్!" అన్నాను.

"పని పూర్తయిపోయాక... ఇప్పుడు... ఇంతవరకూ లేని బేజారు కన్పిస్తోందే మీలో?" అన్నాడు శంకర్ నవ్వి.

"ఇంకా కొంత వ్యవధి వుంది కదా? ఇంకా పదో, పాతికో అభిప్రాయాలు తీయమంటారేమోననే భయం... నాకు ఓపికున్నట్లు లేదు బాబూ!" అంటూ సెల్‌ఫోన్ ఆఫ్ చేసేశాను.

* * *

చచ్చిచెడీ అర్ధరాత్రివేళ రైలు పట్టుకున్నాము.

"టీవీ వాళ్ళం బాబో!" అంటూ బ్రతిమలాడుకుని రెండు బెర్తులు సంపాదించుకుని... కొన్ని గంటలపాటు నిద్రపోయాం కూడా.

తిరుగు ప్రయాణంలో ఉన్నామనీ, వచ్చేస్తామనీ ఇంట్లోవాళ్ళకు చెప్పడానికి సెల్ ఆన్ చేశాను.

ఆన్ అవడమే ఆలస్యం సెల్ మ్రోగడం మొదలయింది.

"ఖర్మరా బాబూ!" అనుకుంటూ ఆన్ చేశాను.

"నిన్న రాత్రి నుండి ఏమయిపోయారు ఇద్దరూ?" ప్రొడక్షన్ ఇంచార్జి కంఠస్వరంలో ఏదో ఎక్సయిట్‌మెంట్.

"రైలు పట్టుకోవడం ఆలస్యమయింది... పనయిపోయింది కదా?" అంటూ గొణిగాను.

"పని బ్రహ్మాండంగా పూర్తిచేశారయ్యా! మిక్సింగ్, ఫ్రేమింగ్, ఎడిటింగ్ అన్నీ పూర్తయి ప్రోగ్రాంకూడా గ్రాండుగా టెలికాస్ట్‌కు సెట్ అయింది. కాలానికి నిలిచే ఈ ప్రోగ్రాం రూపకర్తవు నిజానికి నీవే! జర్నలిస్ట్ హ్యాండీక్యాంతోటే ఇంతమంది ఇంటర్వ్యూలను ఇంతకలర్‌ఫుల్‌గా షూట్‌చేసిన శంకర్‌కూడా అభినందనీయుడు కానీ..."

"ఏమిటిసార్?" అన్నాను సంశయంగా

"టెలికాస్ట్‌కు సిద్ధం చేశాక తెలిసిందేమంటే నీవు చేసిన వంద ఇంటర్వ్యూలలో సరిగ్గా ఏభయిమంది విభజనను వ్యతిరేకించారు... ఏభయిమంది సమ్మతించారు... ఇక్కడ పడ్తోంది మా కన్‌క్లూషన్‌కు ఆటంకం!"

ఆశ్చర్యంతో నోరు తెరిచేశాను నేను. అభిప్రాయాలనయితే చకచకా సేకరించగలిగాము కానీ ఎందరటు, ఎందరిటు అన్నది లెక్క పెట్టుకోలేకపోయాము. అయినా అంత వ్యవధి మాకెక్కడ ఉండినది కాబట్టి?

"ఇప్పుడేం చేయాలి సార్?" అన్నాను నీరసంగా.

"ఇహ అట్టే వ్యవధి లేదు... కొద్ది గంటల్లోపే ప్రసారం... కాబట్టి రైలెక్కడ ఆగితే అక్కడ దిగిపోండి...దగ్గరి దాపుల్లో ఆగే రైలు కాకపోతే ఏదయినా ఊరు కళ్ళబడగానే చైన్ లాగేసి దిగిపోండి! మంచి చెడ్డలు, కష్టనష్టాలు చూసుకునే రిస్క్ మొత్తం మన యాజమాన్యానిదే!"

"అలాగే దిగిపోతాము సార్!" అన్నాను ఉత్సాహం పుంజుకుంటూ...

గుడ్, దిగిపోయి మంచి దార్ఢ్యకమున్న మనిషిని పట్టుకుని అభిప్రాయం తీసుకుని పంపితే చాలు. ఆ ఒక్క మనిషి ఏం చెప్తే అదే వేదం అవుతుంది. ఒక రకంగా ఓటింగ్‌లో ఆ వ్యక్తి వాక్కు కీలకం అన్నమాట. వెంటనే పంపెయ్యాలన్నమాట... చిట్టచివర్న జోడించి ప్రసారం చేస్తాం. అర్థం అయింది కదా?"

"అర్థం అయింది సార్!"

"వెరీగుడ్! గో ఎహెడ్, నీకూ, శంకర్‌కూ కూడా అడిషనల్ ఇంక్రిమెంట్లు పడిపోతాయిలే!" అన్నాడు ఉత్సాహపరుస్తూ.

ఆయన చైనులాగి రైలాపమని చెప్పినా రిస్క్ తీసుకుని ఆ సాహసం అయితే చెయ్యలేకపోయాను కానీ ఏదో ఒక ఊరి దగ్గర సిగ్నల్ కోసం రైలు ఆగడం ఆలస్యం దగ్గర్లోనే కన్పిస్తున్న సింగల్ తారురోడ్డును చూసి వెనకాముందూ చూసుకోకుండా సూట్‌కేస్ అందుకుని రైలు దిగేశాను.

గొనుక్కుంటూ, సణుక్కుంటూ నా వెనుకే దిగాడు శంకర్ కెమెరాకిట్, ఎయిర్ బ్యాగ్‌లు పట్టుకుని. కంచెలు, కంపలు, చేన్లు దాటుకుని ఇద్దరం తారురోడ్డు చేరుకుని ఊరి వైపు అడుగులెయ్యసాగాం.

నా అంచనా తప్పింది.

మోటారు సైకిలుమీదో, స్కూటరోమీదో... కనీసం సైకిలు మీదయినా ఎవరూ ఎదురు రావడం లేదు.

"ఆత్రపడ్డారు సార్... ఊర్లోనే దిగి ఉండాల్సింది!" అన్నాడు శంకర్ కాళ్ళీడ్చుకుని నడుస్తూ.

"ఇలాంటి చిన్న స్టేషన్లలో ఆ బండి ఆగదు కద" అన్నాను.

అంతలో... నా మొర ఆలకించి భగవంతుడు పంపిన దూతలా ఓ ఒంటెద్దు బండివాడు ఎదరొస్తూ కన్పించాడు దూరంగా.

"సామాన్యుడి అభిప్రాయ సేకరణకు ప్రయత్నం చేద్దాం! తప్పేముంది?" అని అనుకుంటూ... "శంకర్ లాంగ్‌షాట్‌లోంచి క్లోజప్‌కు రావాలి. చప్పున కెమరా తీసి బండి గమనాన్ని రోడ్, బ్యాక్‌గ్రవుండ్‌తో సహా తీసుకో. వెరయిటీగా ఉండాలి!" అన్నాను.

వర్కులో శంకర్ ఎఫిషియంట్. అర నిముషంలో కెమెరా తీసుకుని మరో అరనిముషంలో పనిలో పడ్డాడు.

"ఉష్...చు...చు...చు..." అంటూ ఎద్దు భుజం మీద అరచేత్తో తడ్తూ నెమ్మదిగా బండిని ఆపాడు బండతను నా వేడికోలును మన్నించి. బండి నిండా ఎరువులు, గింజలు మొదలైన వాటి తాలూకు బస్తాలేవో వున్నాయి.

అదృష్టవశాత్తు బండతను నాలుగక్షరాలు చదివిన వ్యక్తేనని తెలిసింది. పైగా లోకాన్ని బాగా పరిశీలించిన వ్యక్తిగా కూడా కన్పించాడు... పరిశీలనగా గమనిస్తే! అతని ముఖంలో కళ్ళలో ఆ వెలుగు కన్పిస్తోంది!!

అతనిపేరు రామయ్య.

నా సోదంతా విని అర్థం చేసుకున్నాడు.

"ఇప్పుడు చెప్పండి రామయ్యగారూ, రాష్ట్రం విడిపోయి ముక్కలవాలా? లేక సంఘటితంగా బలోపేతం కావాలా? చెప్పండి!" అంటూ మైక్ మౌత్‌పీస్‌ను అతని ముందుకు చాపాను.

"అయ్యా, రాష్ట్రం మూడు ముక్కలయినా, ఆరు చెక్కలయినా... లేక మీరన్నట్లు సంఘటితంగా బలోపేతమయినా బక్కవాడికి ఐదువేళ్లూ నోటికి అందే లక్షణాలు కన్పించడం లేదు! నింగిమీది ధరలు నేలమీదికి దిగివచ్చేది అంతకన్నా కన్పించడం లేదు!! మొదట బడుగువాళ్ళందరూ చచ్చిపోతారు. అయితే అది అంతటితో ఆగిపోదు. క్రమంగా అందరూ పోవాల్సిందే!" అని అన్నాడతడు తుండు గుడ్డతో ముఖం తుడుచుకుంటూ.

అతనిలో అంతటి వికాసాన్ని ఊహించలేకపోయిన శంకర్ ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి రామయ్యగారూ, అంతమాటనేశారు?" అన్న ప్రశ్న అసంకల్పిత ప్రతీకారచర్యలా నా నోటి నుండి వెలువడింది.

"నిజమేనయ్యా! తన కాలంలో కలరా, ప్లేగు లాంటి రోగాలతోనూ, డొక్కల కరువుతోనూ మనుషులు పిట్టల్లా రాలిపోయారని మా ముత్తాత చెప్తుంటే నా చిన్నతనంలో విన్నాను.

గంజి కరువులలో కూడా మనుషులు చాలామంది చనిపోయారని మా తాతకూడ చెప్పేవాడు.

ఉప్పుడు బియ్యాల కరువులో, చౌక దుకాణాలలో అతి చౌకగా దొరికే ఉప్పుడు బియ్యాలను కూడా కొనుక్కోలేక ఎంతోమంది మనుషులు మలమలా మాడిపోయారని మా అయ్య చెప్పగా కూడా విన్నాను.

ఈ డొక్కు బండికి ఈ ఎండిపోయిన ఎద్దును కట్టి బతుకుబండి నీడుస్తున్న నేను చెప్తున్నాను... వినండి... మనకాళ్ళు మనం నరుక్కుంటున్నట్లు చెట్లన్నీ నరికేస్తున్నాం, గొడ్డనేది కనపడకుండా కబేళాలకు తోలేస్తున్నాం, విషపు ఎరువులతో భూమిని కాల్చేస్తున్నాం, కొండలనూ కరిగించేస్తున్నాం... చివరకు కాలువల్లో ఇసుక రేణువు లేకుండా తినేస్తున్నాం.

ఇంక... ఇప్పుడయితే కలరా, ప్లేగు లాంటి రోగాలు రానవసరమే లేదు! పచ్చని చెట్టే కన్పించని ఈ నేలమీద... పండించేవాడు లేని...అథవా... పండించాలని ఏ తెలివి తక్కువవాడో ముందుకొచ్చినా ఆకాశంలో కానీ, నేలమీదకానీ, నేలలో కానీ చుక్కనీరు కన్పించని... ఎడారిగా మారే ఈ భూమిమీద తిండిగింజకాదుకదా... నీటి చుక్క కూడా దొరకక మనుషులు మరణిస్తారు! అది మాత్రం ఖాయం."

ఆక్రోశంతో కూడిన అతని మాటలు నోటినుండి కాక గుండెలోతుల్లోంచి ఊడిపడ్తున్నట్లున్నాయి. కెమెరా ఆపడం కూడా మరచిపోయిన శంకర్ అతన్నే కెమెరా లోంచి చూస్తున్నాడు.

చుట్టుపట్ల కనుచూపుమేర దూరంలో ఎక్కడా ఒక చిన్న చెట్టయినా కన్పించని ఆ ప్రదేశంలో నిలబడ్డ మా మీదుగా వెచ్చటి గాలి వీస్తోంది. ✪

*(కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ,*

*– కదలిక మనలో మాసపత్రిక, నవంబర్ 2012)*

# పనిమనిషి!

గీత ఒక్కటే అయినప్పుడు ఒక్కలాగే ఉండిపోతుంది. దాని పక్కన మరో పెద్ద గీతో, చిన్నగీతో గీయబడినప్పుడే మొదటి గీత ఇంకోరకంగా కన్పించడం...

✶ ✶ ✶

రామం ఫోను చెయ్యడం కూడా మానుకున్నాక నాలో కాస్త చలనం వచ్చింది.

"వాడికి బాగా కోపం వచ్చినట్లుంది" అని అనుకున్నాను.

రాదామరి? చూడాలనిపించినప్పుడల్లా వాడు వాడి భార్యాబిడ్డలతో కలిసి ఇంతదూరం వచ్చెయ్యడం, రెండు మూడు రోజులు మాతో కలిసి ఆనందంగా గడిపి వెళ్ళడం చేస్తూనే వచ్చాడు.

నేనే... వాయల్పాడు వెళ్ళి దాదాపు ఆరేండ్లయిపోయింది. వచ్చిన ప్రతిసారీ "ఓసారయినా వచ్చి వెళ్ళరాదా?" అని అంటూనే ఉన్నారు వాడూ, వాడి శ్రీమతీ కూడా. పిల్లలయితే సరేసరి.

"మా ఇంటిమీద ఇంకో ఇల్లు కట్టేస్తాము... మీరు వచ్చేసి అందులో ఉండిపోండి!" అని అనేస్తుంటారు వాళ్ళు వచ్చిన ప్రతిసారీ.

అంత అభిమానం వారి పిల్లలకు కూడా!

మరి నేను కదిలితే కద?

ప్రమోషన్ వచ్చాక ఉద్యోగ జీవితం సులభతరం కావడానికి బదులు కనా కష్టంగా తయారయింది. మితిమీరుతున్న రాజకీయ జోక్యం, ఇంకా కృతకంగా వచ్చిపడ్తున్న ఒత్తిడులు. ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాలంటే గౌరవానికీ, గంభీరత్వానికీ ప్రతీకలు. ఇప్పుడదంతా పోయి చేపల బజార్లలా తయారుచెయ్య బడున్నాయి. నిజాయితీగా నడిచే ఉద్యోగులకు కాస్తా దినదినగండం నూరేండ్లయుష్షులా నడుస్తుండడం వాస్తవం.

ఉద్యోగ పర్వాన్ని అలా పక్కన పెడ్తే నాకెన్నో ఇతర పనులు... పనికివచ్చేవి... పనికిరానివి... అసలు ఇన్ని బాధ్యతలు, బరువులు అంత అవసరమా? అని అన్పిస్తుంటుంది నాకే! ఒక్కోసారి నామీద నాకే విసుగేస్తుంటుంది కూడా!! అయినా తిప్పటలు తప్పించుకోలేను!

కొంతమంది జీవితాలు అంతేమరి... అందుకే వాయల్పాడు వెళ్ళి అన్నేండ్లయింది. పిల్లలకు శెలవులున్నప్పుడు నాకు తీరుబడి కాదు. నాకు వీలు చిక్కినప్పుడు పిల్లలకేమో స్కూలు.

"వెళ్ళి నాలుగురోజులుండి వస్తామండీ!" అని చెప్పి చెప్పి మానుకుంది నా శ్రీమతి. పిల్లలయితే ప్రతి సెలవులలో శతపోరి నిరాశ మిగుల్చుకున్నారు.

వాయల్పాడంటే నాకూ చాలా యిష్టం నిజానికి.

చిత్తూరు జిల్లాలో చాలా చిన్న టవున్. చల్లటి వాతావరణం. చుట్టూ చక్కటి ప్రకృతి... ఎటుచూసినా పచ్చదనం... నిండుగా... ప్రాచీన ఆలయాలు...

పండ్రెండేళ్ళ క్రితం సూపర్‌వైజర్‌గా నేనక్కడ పనిచేసినప్పుడు రామం వాళ్ళ ఇంట్లోనే అద్దెకుండేవాళ్ళం. మొదట్లో చిన్నగా వున్న మా పిల్లలకు, వాళ్ళ పిల్లలకు, తరువాత రామం భార్య లలితకు, నా భార్య శారదకు ఆపై నాకు, రామానికి స్నేహం కలిసి ఆత్మీయత పెరుగుతూ వచ్చింది.

మొదట్లో రామం నేనూ 'అండీ' అంటూ గౌరవించుకునేవాళ్ళం. తరువాత ఏమోయ్ అనుకున్నాం. తరువాత ఒకర్నొకరు 'ఒరేయి' అని ప్రాణంగా పిలుచుకునే వరకూ అనుబంధం పెరిగి పెద్దదయింది.

తను పీలేరు హైస్కూల్లో ఉపాధ్యాయుడుగా చేస్తుండేవాడు.

రోజూ పెందలాడే బస్‌లో వెళ్ళి సాయంకాలం ఆరయ్యేసరికి తిరిగి వచ్చేస్తూండేవాడు. ఆరుబయట కుర్చీలు వేసుకుని కూర్చుని గంటల తరబడి కబుర్లతో కాలక్షేపం చేసేవాళ్ళం. రెండు కుటుంబాల మధ్యా పెరిగిన అనుబంధాల వల్ల మేమెప్పటికీ ఆత్మబంధువులమే!

రామంగాడి కోపం తగ్గించడానికీ, ఏ ఒత్తిడీ లేకుండా నాలుగు రోజులు గడపడానికీ ఎట్టకేలకు వాయల్పాడుకు బయల్దేరాను పిల్లల్ని, శారదనూ తీసుకుని... పిల్లలకు శెలవు రోజులు కాకపోయినా!

* * *

ఆరేళ్ళ క్రితం నేను నా కుటుంబంతో వాయల్పాడుకు వచ్చినప్పుడు మీటరుగేజి మార్గం, చిన్నరైళ్ళు... ఇప్పుడయితే బ్రాడ్‌గేజయిపోయింది. దర్జాగా పెద్ద రైలు. కానయితే వేళ్ళమీద లెక్కకట్టేన్ని రైళ్ళయినా నడవడం లేదు ప్రస్తుతానికి.

పెందలాడే బయల్దేరి గుంతకల్లు–తిరుపతి ప్యాసింజరు ఎక్కి ప్రయాణం చేసి మధ్యాహ్నం రెండు గంటలకు వాయల్పాడు చేరుకున్నాము. అత్యాధునికంగా పెద్దంత ఎత్తులో హుందాగా కన్పిస్తోంది రైల్వేస్టేషను. రైలు వెళ్ళిపోయాక అంత ఎత్తున ప్లాట్‌ఫాం మీద నుండీ అవతలకు చూస్తే తూర్పువైపు అంతులేని అందమైన ప్రకృతి మాత్రం అప్పట్లాగే కన్పించింది. కళ్ళకింపుగా, మనసుకు చల్లగా... నన్ను కట్టిపడవేసే ప్రయత్నం చేస్తూ.

“ప్రతి ఉదయం, సాయంకాలం నేనూ లలితా ఇక్కడికి వచ్చేసి ఆ చెట్టు చుట్టూ వున్న చప్టామీద కూర్చుని ఆ ప్రకృతినే రెండు సంధ్యల పంచరంగులలో చూస్తుంటాం. అదే మా ఆరోగ్య రహస్యం... ఇప్పటికయితే ప్లాట్‌ఫాం టిక్కెట్లు కొనమని కోరడం లేదు రైల్వే వారు!” అంటూ నవ్వేశాడు, మమ్మల్ని రిసీవ్ చేసుకోవడానికి వచ్చిన రామం.

ఇల్లు దగ్గరే! అందువల్ల అందరం బ్యాగులు మోసుకుంటూ నడిచే బయల్దేరాం స్టేషను నుండీ.

* * *

వాయల్పాడులో పెద్దగా మార్పు లేదు. రామం ఇంటిలోనూ ఏ మార్పూ లేదు. కానయితే పనిమనిషి మారింది అంతే!

ఆరేళ్ళ క్రితం మేం వచ్చినప్పుడు ఉండిన పని మనిషి పెళ్ళి చేసుకుని వేరే వూరు వెళ్ళిపోయిందట. కొత్త పనిమనిషి రెండు పూటలా ఠంచనుగా వచ్చి పాచిపనులు చేసి, బట్టలుతికి పోతోంది.

స్నేహ మాధుర్యాలను, విందు భోజనాలను చవిచూస్తూ అక్కడ మేం గడిపిన వారం రోజులలోనూ నేనూ, శ్రీమతీ ఒక విషయం గమనించాము.

పనిమనిషి రమణమ్మ క్రమం తప్పకుండా రెండు పూటలా వచ్చి ఓపికగా తన పని తాను చక్కగా చేసుకుపోతోంది.

మా ఆశ్చర్యం చూసి రామం నవ్వేశాడు.

“ఈమె పనికి వచ్చిన కొత్తలో చాలా ఇబ్బంది పెట్టింది రాజా. రెండు రోజులు పనికి వస్తే మూడవ రోజు నాగా. పండుగలు వస్తే చాలు గైరు హాజరు. పైగా ‘మాకు

పండుగలు ఉండవా? మేం మనుషులం కామా??" అంటూ ప్రశ్నలు సంధించడం. వారానికో సినిమాకు డబ్బులివ్వాల్సిందే! నెలకో పాత చీరో, పంచో కావాలని టెండర్. బంధువులు వస్తే చాలు ఆ నెల ఎక్కువ జీతం ఇవ్వాలంటూ పేచీ. మిగిలిన అన్నం, కూరలు తీసుకువెళ్ళే పాత్రలలో అడపా దడపా ఒకటీ అరా గల్లంతు. సంవత్సరానికి రెండు పర్యాయాలు కొత్త చీర తప్పనిసరి... ఇలా ఒకటి కాదులే... ఎన్నో... తల పట్ట కట్టుకుపోయేది" అంటూ ఊపిరి తీసుకోవడానికి ఆగాడు రామం.

నిజానికి మా వూర్లో, మా ఇంట్లో కూడా మా పనిమనిషితో అవన్నీ అనుభవించేవే. నిజం చెప్పాలంటే రామం వాళ్ళు పడ్డదానికన్నా ఎక్కువగానే అవస్థలు పడ్డాము... పడ్తున్నాము కూడా!

"ఇప్పుడయితే చక్కగా పనిచేసుకు వెళ్తున్నట్టుందే?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎందుకు చేసుకుపోదన్నా, మా ఆయన ఆవిడ తోక తెగ్గోసి కడపసున్నం తగిలిస్తేనూ!" అంది లలిత నవ్వేస్తూ.

"ఎలా?" కుతుహలంగా ప్రశ్నించింది శారద.

"ఏం లేదమ్మా ఓసారి జీతం పెంచమని కోరింది రమణమ్మ. ఆమె పనిలో చేరి మూడేండ్లు కాలేదు... ఆరుసార్లు పెంచాను జీతం. అయినా ఆమెకు తృప్తి లేదు. "ఎంత పెంచాలి?" అని అడిగాను.

"రెండు వందలా ఏభయి పెంచండయ్యా!" అంది ఆశగా.

"నేను చెప్పిన షరతులకి ఒప్పుకుంటే ఐదు వందల రూపాయలు పెంచుతాను!" అన్నాను.

రమణమ్మ కళ్ళు ఆనందంతో మిలమిలా మెరిశాయి. లలిత కళ్ళయితే కోపంతో ఎర్రబారాయి. లలితను అంత కోపంలో చూడలేదు ఎప్పుడూ.

"చెప్పండయ్యా, మీ షరతులకి ఒప్పుకుంటాను!" అంది ఆశ్చర్యంగా రమణమ్మ.

"నీకు సంతకం చెయ్యడం తెలుసా?" అని ప్రశ్నించాను.

"తెలుసయ్యా!"

"ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం హాజరు పట్టీలో సంతకం చెయ్యాలి నీవు."

"అలాగే చేస్తానయ్యా!"

"చేస్తానంటే కాదు... నీవు చెయ్యనిరోజు... అంటే నీవు పనికి రానిరోజు అరదినం అయితే అరదినానికి... పూర్తి దినం అయితే పూర్తి దినానికి జీతం కత్తిరించేస్తాను సమ్మతమేనా?"

ఒక నిముషం ఆలోచించి, "సమ్మతమేనయ్యా!" అంది.

"ఇహపోతే గిన్నెలు తీసుకువెళ్ళి పోగొట్టరాదు. పోగొడ్తే దాని ఖరీదు నీ జీతంలో కోత. పాత బట్టలు నీకుగాక ఎవరికీ ఇవ్వము. కానీ ఇచ్చినప్పుడే పుచ్చుకోవాలి. తరచూ వేధించరాదు. సంవత్సరానికి రెండు కొత్త చీరలు మామూలుగానే ఇస్తాము. ఆపై గొంతెమ్మ కోరికలు కోరరాదు. ఇవన్నీ నీకు సమ్మతమైతే చెప్పు ఐదు వందలు పెంచుతాను. మళ్ళీ ఏడాది వరకూ మధ్యలో జీతం పెంచడం జరగదు!" అన్నాను ఖచ్చితంగా.

మూడునాలుగు నిమిషాలు ఆలోచించుకున్న రమణమ్మ అంగీకారం తెలిపింది. ఆనాటి నుండీ ఇంట్లో ప్రశాంతంగా గడుస్తోంది. ఒప్పందం జరిగి ఐదు నెలలు దాటింది. ఆబ్సెంట్ అంటూ పడలేదు ఇంత వరకూ!" అంటూ హాయిగా నవ్వేశాడు రామం.

✶ ✶ ✶

వాయల్పాడులో వారం రోజులు ఏడు క్షణాల్లా గడిచిపోయాయి.

అయిష్టంగానే అయినా ఆదివారం తిరుగు ప్రయాణానికి సిద్ధం అయ్యాము.

పిల్లలయితే ఏడ్చి గోలపెట్టేశారు... కానీ తప్పదు కదా?

ఈ ప్రపంచమే 'వియోగం–కలయిక–కలయిక–వియోగం' అనే నాలుగు చక్రాలమీద నడుస్తున్న వాహనం లాంటిది మరి!

వాయల్పాడు రైల్వేస్టేషన్‌లో మధ్యాహ్నం పండ్రెండు గంటలకు తిరుపతి–గుంతకల్ ప్యాసింజరు రైలు ఎక్కించి బాధపడ్తూ వీడ్కోలు చెప్పారు రామం వాళ్ళు.

రైలు బయల్దేరి నాలుగైదు స్టేషన్లు దాటాక మామూలు స్థితికి రాసాగారు పిల్లలూ, శారదా విషాదయోగం లోంచీ. ఇహ అప్పుడు మొదలుపెట్టింది శారద.

"జీతం పెంచయినా సరే మనమూ మన పనిమనిషితో అలాంటి ఒప్పందమే చేసుకోవాలండీ!" అంటూ. రైలు నడకతో పాటు తన నస కూడా సాగుతూనే ఉంది.

చివరికి భరించలేక అనేశాను... 'సరే శారదా అలాంటి ఏర్పాటే పనిమనిషి పార్వతమ్మతో మనం కూడా చేసుకుందాములే!"

అనడమే కాదు... రైలు దిగాక ఇంటికి వెళ్తున్నప్పుడు ఆదివారం అయినా తీసివున్న ఓపుస్తకాల షాపు వద్ద ఆటో ఆపించి మరీ ఓ మంచి అటెండెన్సు రిజిష్టరు కొనుగోలు చేశాను.

* * *

మేం ఊర్నుండి వచ్చామని తెలిసి మరునాటి ఉదయాన్నే పనిమనిషి పార్వతమ్మ వచ్చేసింది తన ఆరేళ్ళ చిన్న కొడుకుతో పాటు. చాలా ముద్దుగా, బొద్దుగా ఉండే ఆ పిల్లవాడు మామూలుగా ప్రతి రోజూ ఉదయాన్నే తన తల్లితో పాటు వచ్చేస్తాడు.

వాడు రావడం, ఆలస్యం వాడికి రాత్రి అన్నం, కూరలు వడ్డించేస్తుంది శారద.

శారద ఆ పనిలో ఉండగా నేను వెళ్ళి హాజరు పట్టీ పుస్తకం తీసుకుని అందులో పార్వతమ్మ పేరు వ్రాశాను. ఆపై ప్రతిరోజూ రెండు పూటలా పార్వతమ్మ సంతకం అందులో చేసేలా ఏం ఒప్పందం చేసుకోవాలా? అని ఆలోచిస్తున్నాను.

"అమ్మా, నీవింకెప్పుడూ ఊరికి పోవద్దమ్మా!" అంటూ పార్వతమ్మ కొడుకు అనడం నాకు కూడా స్పష్టంగానే విన్పించింది.

"ఎందుకురా?" అని ప్రశ్నిస్తోంది శారద.

"మరేమో నీవు తెల్లార్తో నాకు అన్నం పెడ్తావు... బడిలో మద్దాన్నం అన్నం పెడ్తారు... రాత్రికి మా అమ్మ ఇంట్లో అన్నం పెడ్తుంది. నీవు ఊరికి పోయిన కాడ్నించీ, తెల్లారి మా అమ్మ పనిచేసే ఎవరింట్లోనూ నాకు అన్నం పెట్టలేదమ్మా. మద్దాన్నం బడిలో అన్నం పెట్టేవరకూ కడుపులో మంటమ్మా?" అన్నాడు వాడు ఏడ్పు గొంతుతో.

ప్రపంచంలోని దైన్యమంతా వాని స్వరంలో విన్పించినట్లనిపించింది నాకు.

"అట్లే లేరా... నేనే వూరికీ పోను!" అంటూనే చరచరా నా గదిలోకి వచ్చేసింది శారద.

"ఆ హాజరపట్టీ తయారుచేశారా?" అంది.

"ఆ! పేరు రాశాను!" అన్నాను నీరసంగా.

"ఏదీ దాన్నిలా ఇవ్వండి!" అంది.

నేను మౌనంగా అందించాను.

సర్రున రెండు ముక్కలుగా చింపివేసింది శారద ఆ హాజరు పట్టీ పుస్తకాన్ని.

"దీని అవసరం లేదు... ఇకపై రాదు!!" అంటూ వెళ్ళిపోతోంది శారద.

నేనూ లేచి తనను అనుసరించాను.

వంట గది అవతల చిన్న వసారాలో నేలమీద వంగి కూర్చుని శారద పెట్టిన చద్ది అన్నాన్ని శ్రద్ధగా తలవంచి తింటున్నాడు ఆ చిన్నోడు... దేశ పేద ప్రజల ప్రతినిధిలా. నిజమే! ఈ దేశమే రైతులది – పేద ప్రజలది కూడా!!

ఎందుకో అప్రయత్నంగా నా కంట కన్నీరు కదిలింది.

మరో రెండడగులు అటేసి పాత్రలు కడుగుతున్న పార్వతమ్మను చూశాను.

పీక్కుపోతున్న ముఖం, వయసుకు మించి వంగిపోతున్న వెన్ను, నెరసిపోతున్న తల!!

బహుశా ఆమె భర్త ఏ కూలీనాలీనో చేసి కొద్దో, గొప్పో డబ్బు తెస్తుంటాడు. అది ఏమూలాలకు?

ప్రభుత్వ చౌక దుకాణంలో తెచ్చుకునే నాసిరకం బియ్యంతో అన్నం చేసుకుని, కచ్చాకో, బుచ్చాకో వేసి కూర వండుకుని తింటూంటారు. అందులో బలం ఏముంటుంది?

ఇంతింత జీతాలు తెచ్చుకునే మాకే బ్రతుకు ఎంతో భారంగా నడుస్తోంది... పెరిగిపోతున్న జీవనవ్యయం వల్ల! ఇక పాచిపనుల వల్ల పార్వతమ్మకు లభించేది, ఆమె భర్త తెచ్చేది ఆ కుటుంబ అవసరాలను ఎంత వరకు తీర్చగలుగుతుంది?

పాలకులకు, ప్రతిపక్షాలకు ఇలాంటి విషయాలు ఆనవు. కుర్చీల కోసం కుమ్ములాటలకు, ఆస్తులు విస్తారంగా, అయోమయంగా పెంచుకోవడాలకూ వారి సమయం చాలదు మరి.

అవసరాలు తీరకా, తీరే మార్గాలు లేకా పార్వతమ్మలూ, రమణమ్మలూ అడుక్కుంటారు, పేచీలు పెడ్తుంటారు, అప్పుడప్పుడు పోట్లాడుతారు కూడా!!!

అది కాస్తా పేరాశగా కన్పిస్తుంది పనులు చేయించుకునేవారికి!

పెద్దంత జీతాలు పొందుతూ కాస్తంత సుఖమయిన జీవితాలను గడిపే ఉద్యోగులే ఉద్యోగ సంఘాల నాయకులు చిటిక వేస్తే చాలు పెన్‌డవున్ స్ట్రయిక్, పేపర్ డవున్ స్ట్రయిక్, వర్కు టు రూల్ అంటూ పనులు మానుకుని, సమ్మెకు దిగి తమ కోరికలన్నింటినీ సాధించుకుంటూంటారు.

చిన్న వ్యాపారస్తులు మొదలుకుని చమురు కంపెనీల వరకూ తమ తమ లాభాల పంటలు పండేలా వ్యాపారులు ధరల గాలిపటాల ఆటలాడేస్తూంటారు.

ఇక రాజకీయ నాయకుల విషయానికొస్తే సరే సరి... సర్వం స్వాహా...

ఇన్ని యేనుగుల సమూహాల మధ్యన... రక్తాన్ని చమటగా మార్చి ధారపోస్తూ శ్రమపడి బ్రతికే ఈ పనిమనుషులను గూర్చి ఏకాస్తయినా మనసు పెట్టి మనిషితనంతో ఆలోచించగలిగితే, వారిలో గౌరవ ప్రదమైన శ్రమజీవులే కన్పిస్తారు వాస్తవానికి. వీరి శరీర కష్టం లేకపోతే సుకుమారులైన మనుషులకు పనులు సాగవు. ఆ కష్టానికి ప్రతిఫలంగా వారు కాస్త హెచ్చు తక్కువగా ఏదయినా ఆశించినా ఇవ్వడానికి అయిష్టత చూపడం, వారిని అసహ్యించుకోవడం ఏ రకంగానూ సబబైన పనికాదు నిజానికి.

ఇలా ఆలోచిస్తూ పార్వతమ్మనూ, ఆమె కుమారుడ్నీ మార్చి మార్చి చూసి హాల్లోకి వచ్చాను. పక్క గదిలో బీరువా తెరచి చీరలలో ఏదో వెతుకుతోంది శారద. బహుశా పార్వతమ్మకివ్వడానికి కాస్త పాత చీరను అన్వేషిస్తున్నదేమో?

నేనూ అప్పటికప్పుడే ఓ నిర్ణయానికి వచ్చాను... ఏ షరతులూ లేకుండా పార్వతమ్మ జీతం పెంచాలని!! ✪

*కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ, స్వప్న మాసపత్రిక డిసెంబరు – 2012*

# అన్నదాత

'ఇంతకన్నా అనువైన చోటు ఇక దగ్గర్లో లేదు!' అని అనుకుంటూ ఓ పొద వెనుక, కొండవేపచెట్టు నీడన కూలబడ్డాడు రంగప్ప.

చేతి సంచిలోంచీ మొదట సత్తుచెంబు తీసి నేలమీద పెట్టాడు. తరువాత శీతలపానీయ సీసాలు రెండు తీసి చెంబు ప్రక్కనే నిలబెట్టాడు. ఆపై పురుగు మందున్న ప్లాస్టిక్ చిన్న సీసాను వెలికి తీశాడు... కళ్ళలో తడికదుల్తోండగా.

కాలప్రవాహంలో, కాయకష్టంతో గట్టిపడిన చేతులతో మూడు సీసాల మూతలూ ఊడదీయడం పెద్ద కష్టం కాలేదతనికి. సత్తు చెంబులోకి పురుగులమందు పూర్తిగా వంచేశాక, శీతలపానీయాన్ని కూడా చెంబులోకి వంచుతుండగా... పొంగుతోపాటు గుప్పుమని కొట్టింది పురుగుమందు వాసన. అయినా అతనికి ఎలాంటి ఇబ్బందీ అన్పించలేదు... ఏళ్ళ తరబడి పంటలకు మందులు పిచికారీ చెయ్యడం వల్ల ఎప్పుడో అలవాటయిపోయింది.

ఆ సమయంలో అతని కళ్ళముందు...

వరుస కరువులతో, వర్షాభావంతో ఎండి పగుళ్ళు బారిన పొలాలు, నిండుకున్న గాదెలు గరిసెలు, తరిగిపోయిన గడ్డివామిలు...

కోరికలతో తన ఇల్లు గుల్ల చేసింది చాలక సరికొత్త కోరికతో కుమార్తె ఒళ్ళు కుళ్ళబొడిచి తరిమికొట్టిన అల్లుని కుటుంబం...

అంతులేని ఆలోచనలతో, భయాలతో కళతప్పిన ముఖంతో కన్నీళ్ళ కడవ నెత్తిన పెట్టుకుని నట్టింట కూర్చున్న కుమార్తె దీన వదనం...

"అయ్యా, నేనింక చదువు మానుకుని టవున్లో ఆటో నడపడం నేర్చుకుంటాను!" అని అంటున్న కుమారుని నిరాశా జనకమైన చూపులు...

అధిక వడ్డీకి డబ్బుతెచ్చి పర్టిలైజర్స్ దుకానదారుని ఎదానా, విత్తనాల అంగడి అతని రొమ్ముమీదాపోస్తే కల్తీ ఎరువులు, విత్తనాలు అంటగట్టిన వైనాలు...

"నీవింక లెక్క కట్టలేవుకానీ సగం మడి రాసిస్తావా? ఛస్తావా?" అంటూ నెత్తిమీద కూర్చున్న మోతుబరి దౌర్జన్యం...

… వరుసగా అన్నీ కదిలిపోతూ తల బ్రద్దలయ్యేలా నిరాశాజనకమైన ఆలోచనలను రేకెత్తిస్తుండగా…

'ఇలా నలిగిఛస్తూ ఇంకా ఆలస్యం ఎందుకు? ఇకపోతే పీడాపోయె!' అని అనుకుంటూ రెండు చేతులతో చెంబు ఎత్తుకుని నోటి వద్దకు తీసుకున్నాడు.

సరిగ్గా అప్పుడు విన్పించింది ఆ కేక… కాదు… గావుకేక!

అనుమానం లేదు… ఖచ్చితంగా అది అబల ఆర్తనాదమే!!

చప్పున పైకి లేస్తూ కూడా సత్తుచెంబును అతి పదిలంగా ఉంచాడు నేలమీద.

అతడు చకచకా పొదల వెనుక నుండీ వెలుపలికి వచ్చేసరికి… దెయ్యాల గుట్టమీద నుండీ పడ్తూ, లేస్తూ పరుగు పెట్టుకు వస్తోంది గోవిందమ్మ…

ఆమె వెనుకనే బలిసిన ఆంబోతులా దూసుకువస్తున్నాడు తిమ్మరాయప్ప!

కళ్ళకు కన్పించిన దృశ్యంతాలూకు విషయం అరకొరగా అర్థంకాగానే వెన్నుమీద ముల్లుగర్రతో ఎవరో బలంగా పొడిచినట్లయింది రంగప్పకు.

"తిమ్మప్పా ఆగక్కడ!" అని పెద్దగా అరుస్తూ అటువైపు పరుగుతీశాడు.

తిమ్మరాయప్ప ఖంగు తిన్నాడు. అక్కడ అతడా సమయంలో మూడో మనిషిని ఊహించినట్లు లేదు.

"సూడన్నా, తలసెడిన ఆడదాని మానందీసేకి ఈడు పందిలా ఎలా ఎగబడొత్తున్నాడో సూడు" అంది గోవిందమ్మ వగురుస్తూ.

"కండ్లూ, కాళ్ళూ రెండూ నాశనమైపోతాయి తిమ్మప్పా!" అన్నాడు ఉగ్రంగా.

"నీకెందుకు? మర్యాదగా నీ దారిన నువ్వుపో!" అన్నాడు తిమ్మరాయప్ప తెగించి.

"మొన్న మొగుడు చచ్చిన ఆడదానిమీద పాపిలా నీవు చెయ్యేస్తోంటే పెట్టమారోడిలా నేను నాదార్నపోవాలా?" అంటూ వంగి ప్రక్కనే కన్పించిన పెద్దసైజు పిచ్చిరాయిని రెండు చేతులతో పైకెత్తాడు రంగప్ప ఆవేశంగా.

ఆక్షణాలలో అతని కళ్ళముందు ఏడాది క్రితం దెయ్యాలగుట్టమీద ఉరివేసుకుని చచ్చిపోయిన గోవిందమ్మ భర్త వెంకటేశ్వర్లు రూపం కదలాడుతోంది… అంతేకాక… తనులేకుండా పోయినప్పుడు తన భార్యాపిల్లలు రేపెలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందో చూచాయగా దృశ్యమానమవుతోంది అతని మస్తిష్కంలో.

రంగప్ప కూడా తెగింపుగా రాయెత్తుకునే సరికి తిమ్మరాయప్ప ముఖం నల్లబడిపోయింది. దూరం ఆలోచించి అక్కడ్నుండీ వెళ్ళిపోయాడు పెద్ద పెద్ద అంగల్తో.

"మనుషులు దెయ్యాల్లా మారిపోతున్న కాలం... పగలే అయినా ఒంటరిగా ఇంతదూరం ఎందుకొచ్చావు? ఆ గుట్టమీదికి ఎందుకుపోయావు?" అంటూ కోపంగా ప్రశ్నించాడు రంగప్ప.

"ఈ రోజు మా ఇంటాయన ఏడోదన్నా. ఉన్నకాడికి ఏదో చేస్తిమి. నా బిడ్డచేత ఒలికికాడ పల్లెమేయిస్తే కాకిముట్టలా... నా మనసుండక ఆపల్లెం దీసుకుబోయి నా పెనిమిటి ఉరేసుకున్న సెట్టుకాడ బెట్టాను!" అందామె దీనంగా.

ఆమె చెప్పింది వినగానే అతని మనసంతా చేదుగా, బాధగా తయారయింది.

"అప్పుడే ఏడాదయిపోయిందా?" అన్నాడు.

ఆమె తలవూపింది కన్నీళ్ళతో.

"వీడు చెడె గాడిద... వీడి పాపం వీడినే కాల్చుకు తింటుంది కానీ... నీకేం దిగులు లేదు, నేరుగా ఇంటికిపో. ఇంకెప్పుడూ వంటరిగా బయట తిరగకు. ఈ విషయం కూడా ఎవరికీ చెప్పుకోవద్దు... మనకే బగిశీనం!" అన్నాడు రంగప్ప దూరం ఆలోచించి... కాలిదారిదాకా ఆమెకు తోడు నడుస్తున్నప్పుడు.

అతడు తిరిగి వచ్చేసరికి చెక్కుచెదరని చెంబు అతన్ని ఆహ్వానిస్తున్నట్లుగా కన్పించింది. అయితే మరుక్షణం గోవిందమ్మ భర్త తన ఎదుట గాలిలో నిలచి ఏదో ఆదేశిస్తున్నట్లుగా అన్పించింది.

నెమ్మదిగా వెళ్ళి చెంబు ఎదుట కూర్చున్న అతని ఆలోచనలలో అప్పటికే పెద్ద కదలిక... హఠాత్తుగా అతనికి తన తండ్రి రూపం మనసులో మెదలింది. ఆ వెంటనే ఆయన పడ్డ కష్టాలు, మొక్కవోని ఆయన మనస్థైర్యం తాలూకు ఘటనలు కళ్ళ ముందు కదలసాగాయి.

* * *

పెళ్ళయి ఇరవయ్యేళ్ళు గడిచాక గర్భవతయింది రంగమ్మ. అయితే రంగప్ప గర్భంలో ఉండగానే ఆమె ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది.

నెలలు నిండిన పిదప కాన్పు కష్టమవడంతో ఎద్దుల బండిమీద వరిగడ్డి పరుపేసి రంగమ్మను పడుకోబెట్టి నల్లగుట్టక్రిందనున్న రాళ్ళడొంక వెంబడి బండిని పరిగెత్తించాక కానీ రంగప్ప జననం నమోదు కాలేదు.

కష్టపడి కనుక్కున్న పండంటి బిడ్డను కళ్ళారా చూసుకుంటూ ఉండగానే చలువలు కమ్ముకున్నాయి ఆమెకు. ఆమెను తీసుకుని ఎడ్లబండి టవున్ దారి పట్టగానే ఆమె ప్రాణాలు అనంత విశ్వంలో లీనమైపోయాయి.

"వీడు నష్టజాతకుడు" అంటూ రంగప్పను అయినవాళ్ళు, కానివాళ్ళు ఆడిపోసుకుంటున్నా అతని తండ్రి రామయ్య మాత్రం రంగప్పను గుండెలకు హత్తుకునే పెంచాడు. ఎందరు ఎన్ని చెప్పినా మళ్ళీ పెళ్ళిమాట తలపెట్టలేదు. తల్లి తండ్రీకూడా తానే అయి పెంచి పెద్ద చెయ్యడమే కాదు... చాలవరకూ విద్యా బుద్ధులూ చెప్పించ గలిగాడు.

మట్టితప్ప మరోలోకం తెలియని ఆయన తన చివరిదశ కాలంలో పొలంవెళ్ళి వస్తుండగా కాలుజారిపడి కుడికాలి బంతిగిన్నె కీలు మధ్యని బంతి పగిలింది. టవున్‌లోని ధర్మాసుపత్రివారు, మిషనాసుపత్రివారు కూడా కాదనడంవల్ల ఎడ్లబండిమీదే తండ్రిని జిల్లాకేంద్రంలో పేరుపొందిన ఎముకల ఆస్పత్రికి తీసుకువెళ్ళాడు.

"ఆపరేషన్ చేసి బంతికి స్క్రూలువేసి సరిచేస్తాను. ఆపరేషన్, బెడ్‌చార్జి అంతా పదివేలవుతుంది. మందులు మీరే తీసుకోవాలి!" అన్నాడు ఆరోజులలోనే ఆ డాక్టరు.

వరుస కరువుల దెబ్బతో చేతులలో డబ్బూ, ఇంట్లో ధాన్యం లేని కాలం. అప్పో, సప్పో తెచ్చుకున్నదీ అప్పటికే అయిపోవచ్చింది. అందువల్ల పల్లెకు వెళ్ళి తమకుండిన ఆవును, జత ఎద్దులను, కొంత భూమిని అయినకాడికి అమ్మి సొమ్ము చేసుకువస్తానన్నాడు రంగప్ప.

"ఒద్దురా నాయనా, మనం మట్టిని నమ్ముకుని బ్రతికేటోళ్ళం. మనకు కలిమి, బలిమి, జీవం మొత్తం ఆ నేలా, గొడ్డూ గోదానే... వాటిని పోగొట్టుకుంటే బతుకు బరువయి మనకు మనుగడుండదురా!" అన్నాడు రామయ్య.

"నిజమేనయ్యా... కానీ కర్నూలు ధర్మాసుపత్రికి పోవాలంటే ఎంత దూరం? ఎంత కత? దూరాభారం, ఖర్చూ అంతకే వస్తుందేమో?" అన్నాడు రంగప్ప దిగులుగా.

"బండి కట్రా, చెపుతాను... ఏం భయపడవద్దు!" అన్నాడు రామయ్య నిబ్బరగా. తాము వచ్చిన ఎద్దుల బండిలో వేసిన పరుపు వేసినట్లే ఉండడం వల్ల రామయ్య చెప్పినట్లే అతన్ని బండిమీదకు చేర్చి ఆయన పక్కలు కదలకుండా నూలు తాళ్ళతో ఒడుపుగా బండి గూటాలకు కట్టి, హరికెన్ లాంతరు వెలిగించి బండి కాడిమాను మధ్యన కట్టుకుని రాత్రికి రాత్రే బయల్దేరారు రంగప్ప దంపతులు.

ఆ రాత్రి, అరపగలు తండ్రి చెప్పిన ప్రకారం కాలిదారుల్లో, బండిబాటల్లో నెమ్మదిగా ప్రయాణం చేసి రెండామడల దూరంలో మారుమూలనున్న చిన్న గ్రామం గోవిందాపురం చేరుకున్నారు.

రామయ్యకు ఏనాటి స్నేహమోకానీ ఆవూర్లో వున్న నాటువైద్యుడు వెంకటస్వామి వారిని ఆదరంగా ఆహ్వానించాడు.

ఆరోజుకు నొప్పి తెలియకుండా ఏదో పసురుపూసిన ఆయన మరునాడు చీకటివదలకనే రంగప్పను వెంటబెట్టుకుని రెండు వెదురు గంపలు తీసుకుని అడవిలోకి బయల్దేరాడు. మధ్యాహ్నందాకా అడవంతా చెడదిరిగి ఆయన చూపించిన ఆకులన్నీ ఆయనతోపాటు సేకరించాడు రంగప్ప.

ఇద్దరూ గోవిందాపురం చేరి స్నానాలు చేసి అన్నాలు తినడం ఆలస్యం... పెద్దంతరోట్లో ఆకులు వేసి నూరడం మొదలు పెట్టాడు వెంకటస్వామి.

వెంకటస్వామి, ఆయన శ్రీమతి, వాళ్ళపాలేరు, రంగప్ప, రంగప్ప భార్య వరుసగా మార్చిమార్చి నూరేసరికి... రెండు గంపల ఆకుకాస్తా అరచేతిలో వెన్నముద్దంత రూపం దాల్చింది. రెండు నూలు పంచలను అరచేతి వెడల్పుతో పొడవాటి ముక్కలుగా చింపుకుని, వాటితో మందుముద్దతో కలిపి పట్టుబిగిస్తూ ఒడుపుగా కీలుమధ్యని బంతిని సరిపెట్టి కట్టేశాడు వెంకటస్వామి.

విషయం తెలుసుకున్న రామయ్య వాళ్ళ వూరివాళ్ళు కొంతమంది కలసి ఓ ట్రాక్టరు కట్టించుకుని గోవిందాపురానికి రావడంతో తిరుగు ప్రయాణం కాస్త తేలికయింది.

"నులక మంచంమీద పడుకోబెట్టకండి! నేలమీదే నార పరుపుపైన రబ్బరుపట్టా, దానిమీద నూలు దుప్పటి పరచి పడుకోబెట్టండి. రెండు వారాలపాటు నెమ్మదిగా పక్కకు తిప్పుకుని కాలకృత్యాలు మీరే పరిశుభ్రం చెయ్యాలి. ఆలోపు బంతి కూడాగట్టుకుని నొప్పి తగ్గిపోయి కూర్చోవడం నెమ్మదిగా సాధ్యమవుతుంది. అప్పుడయితే చేతులమీద దేకుంటూ పక్కకుపోగలడు.

రెండునెలలు బాగా కాపాడుకుంటే లేచి చంక కర్రల సాయంతో నడుస్తాడు. అప్పుడోసారి తీసుకువస్తే ఈ కట్టు నేనే విప్పదీయాల్సి వుంటుంది. అంతదాకా కట్టుకు తడితగలకుండా చూసుకుంటే మంచిది. ఆపై ఆర్నెల్లు జాగ్రత్తగా వుంటే మామూలు

మనిసయిపోతాడు. ఈ ఏడెనిమిది నెలలూ సెల్దిపదార్థాలు లేకుండా మూడుపూటలా పథ్యం భోజనం పెట్టండి. మూడు పూటలూ కూడా తిండి తిన్నవెంటనే వక్క, ఆకు, సున్నంతో తాంబూలం తప్పని సరిగా ఇవ్వాలి. ఇది అతిముఖ్యం!" అంటూ చాల జాగ్రత్తలు చెప్పి పంపాడు వెంకటస్వామి.

అంత పడుబాటు పడినా ఏనాడూ నొప్పి, నొయ్యి అని ఎవరినీ, ఏ విధంగాను బాధించలేదు రామయ్య. మౌనంగా కళ్ళు మూసుకుని ఓ యోగిలా పడుకుని గడిపాడు. రంగప్ప చేతకూడా రెండుమూడు వారాలే సేవలు చేయించుకున్నాడు. ఆపై చిన్నగా దేక్కుంటూ వెళ్ళి కాలకృత్యాలవీ తనే తీర్చుకోసాగాడు.

గోవిందాపురంలో కట్టు విప్పదీసుకుని రావడం ఆలస్యం... చేతికర్రల మీద నడుస్తూనే చిన్నా చితకా పనులు చేయడం మొదలుపెట్టాడు రామయ్య.

చిన్నరుగుమీద కూర్చుని గడ్డి కంటివున్న మట్టి బెడ్డల్ని కర్రతో కొట్టి గడ్డిని శుభ్రపరచడం, జొన్నకర్రలు ముక్కలుగా నరికి ఆవులకు వెయ్యడం, ఎద్దులకు కర్రలు తినిపించడం, పొలంలో కూర్చుని డబ్బాతో చప్పుడు చేస్తూ పక్షులను తరమడం, రాత్రులందు చేన్లో నెమ్మదిగా మంచెపైకి చేరుకుని కాపలాగా పడుకోవడం... ఇలా ఏదో ఒక పనిచేస్తూనే గడిపాడు.

"ఇంత పెద్ద వయసులో ఆస్పత్రి ఖర్చులు లేకుండా అంత పెద్ద గండం గడవడమే గొప్ప విషయం. ఇంకా ఈ పనులన్నీ నీకెందుకు?" అని ఎవరైనా ప్రశ్నిస్తే... "మట్టిలో పుట్టిన మనిషి మట్టిమీద పనిచేస్తూ బతకాలి... పనిచేస్తూనే శెలవు తీసుకుని మట్టిలో మట్టయిపోవాలి!" అంటూ నవ్వేవాడు.

ఆయనకు పనిలేకపోవడం అంటూ ఉండేదికాదు! పని లేకపోతే పనిని కల్పించుకునే వాడు... మడకలు రిపేరీ చేసుకోవడం, కపిలిదోనె అరువు చేసుకోవడం, ఎద్దుల గిట్టలకు ఇనుప అడుగులు కొట్టించడం, ఎద్దుల కొమ్ములు జివరడం, ఎడ్లబండి మరలు బిగించుకుని కందెన వేసుకోవడం, ఇంటికి సంబంధించిన రిపేరీలు, తాపీపనులు చేసుకోవడం... ఇలా ఎన్నో చిన్నచిన్న పనులు... ఖాళీగా ఉండకుండా... పని... పని... పని... పనిచేస్తూనే జీవించాడు... పనిచేస్తూనే సునాయాసంగా జీవిత యాత్ర చాలించాడు!

* * *

"అలాంటి మహానుభావుని కడుపునపుట్టిన నాకెందుకు ఇలాంటి పిరికితనంతో కూడిన దుర్బుద్ధిపుట్టింది?" అని అనుకుంటూ జ్ఞాపకాలలోంచీ బయటపడ్డాడు రంగప్ప.

ఆపై చెంబును చేతుల్లోకి తీసుకుని అందులోని ద్రవాన్ని పక్కనున్న పొదలోకి చల్లేసి, చెంబును ఖాళీ సీసాలను చేతి సంచిలోకి వేసుకుని లేచి నిలబడ్డాడు.

"చేతకాని వానిలా చావడం కాదు... చేవవున్న వాడిలా తలెత్తుకుని బతకాలి... రామయ్య కొడుకు రంగప్పంటే ఏమిటో లోకులకు చూపాలి... ఊపిరి ఆగిపోయే వరకూ భార్యా, పిల్లలకు తోడూ, నీడలా ఉండి తీరాలి!" అని అనుకుంటూ అక్కడ్నుండీ కదుల్తున్న రంగప్ప మనసులో దిగులు తొలగిపోయి దాని స్థానంలో కసిలాంటిదేదో చోటు చేసుకోసాగింది.

✶ ✶ ✶

"ఉన్న దాంట్లో సగం మడిచెక్క పెద్దరెడ్డికే కట్టబెట్టేసి బాకీలేని బతుకు బతుకుదాం. కాలం కలసిరాకపోతే టవున్‌లో రిక్షాతొక్కయినా మిమ్మల్ని సాక్కుంటాను... వడ్డీ పెరుగుదలతో నడ్డి విరిగిపోకముందే ఈ అప్పు బరువు తీర్చుకోవడానికి మాత్రం అడ్డు చెప్పకండి!" అన్నాడు రంగప్ప ఓ రాత్రి భోజనాలప్పుడు. బాగా ఆలోచించే ఆ నిర్ణయానికి వచ్చాడతడు.

"నీకేది మంచిదనిపిస్తే అదే చెయ్యి!" అని అనేసిందతని భార్య పరమ ప్రశాంతంగా.

పొలం అమ్మకం అంటేనే ఉరిపోసుకుని ఛస్తానని గోలచేసే తన భార్య అలా అనేసరికి ఆశ్చర్యంతో పొలమారింది రంగప్పకు.

"నీకెప్పుడూ, దేనికీ ఎవరూ అడ్డు చెప్పమయ్యా!" అంది అతని కుమార్తె.

"చదివిన కాడికి చాలయ్యా! పెద్ద పరీక్షలయిపోగానే నేనూ ఏదో ఒకపని చూసుకుని నీకు తోడుంటాను. అంతగా నీవు చదవమంటే ప్రయివేటుగా సాగిస్తాను. కాలం కలిసొస్తే మళ్ళీ మనం మడి సంపాదించుకోవచ్చులే!" అంటూ ధైర్యవచనాలు చెప్పాడు కుమారుడు కూడా!

ఆనందాశ్చర్యాలతో తలమునకలయిపోయాడు రంగప్ప.

తను పెరట్లో గడ్డివామిలో దాచిపెట్టిన చేతిసంచిని కుమారుడు ఎలాగో చూశాడనీ, విషయం కొద్దొగొప్పో పసిగట్టి తన తల్లినీ, అక్కనూ గుంభనంగా హెచ్చరించాడనీ రంగప్పకు తెలియదు.

✶ ✶ ✶

నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులవల్ల నష్టపోయిన సహరైతుల్ని కూడేశాడు రంగప్ప ఓ రాత్రి వెన్నెట్లో చెరువు కట్టమీద. విషయం వివరించాక... "ఊ, ఆ అని

అనకుండా మీరంతా నేను చెప్పినట్లు చేస్తే శరీర కష్టం పోయినా కనీసం మన డబ్బయినా మనకు కొంతమేర వచ్చే అవకాశం ఉంది!" అన్నాడు.

అక్కడ చేరిన వారందరికీ రంగప్పమీద గౌరవభావం వుంది. అందువల్ల అందరూ తమ అంగీకారం తెలిపారు... ఏదయినా ఉపకారం జరుగుతుందన్న ఆశతో.

* * *

ఆ చిన్నటవున్‌లో "కిసాన్ ఫెస్టిసైడ్స్ అండ్ ఫర్టిలైజర్స్" ఆ చుట్టుపట్ల గ్రామాలకంతావున్న ఒకే ఒక పురుగుమందులు, ఎరువులు అమ్మే దుకాణం. రంగప్పతో కలసివెళ్ళిన రైతులందరూ ఆ షాపు ముంగిట అడ్డుగా కూర్చున్నారు కొంతభాగం రోడ్డును కూడా ఆక్రమించుకుని.

వారెవరూ ఎగబడ్తున్న ఎండను ఏకాస్తయినా ఖాతరు చెయ్యడం లేదు.

ఆ దుకాణంకేసి ఎవరొచ్చినా... "అయ్యా, బాబూ!! ఈ అంగడిలో దొరికేవన్నీ పనిచెయ్యని పురుగుమందులు, పనికిరాని నాసిరకం ఎరువులు... ఇక్కడ ఏది కొన్నా రైతుకు కష్టమూ, నష్టమూ తప్ప మరేమీ మిగలదు! మేమంతా అలా నష్టపోయిన వాళ్ళమే!" అంటూ చెప్పడం మొదలు పెట్టారు.

"ఏమిటిదంతా?" అంటూ గోలచేశారు షాపువాళ్ళు.

"ఏం మీకు తెలియదా! మీ ఎరువుల వల్లా, పురుగు మందులవల్లా నిండా మునిగిపోయిన విషయం ఎన్నిదపాలు వచ్చి చెప్పాము?! పట్టించుకున్నారా? అందుకే చివరికి ఇలా రోడ్డెక్కాల్సి వచ్చింది!" అన్నారు అందరూ ముక్తకంఠంతో.

"అయినా మీ ఈ పని పద్ధతిగా ఉందా?"

"మా నష్టం మాకు కట్టివ్వాలి... లేదా మేం ప్రతిరోజూ వచ్చి కూర్చుని ఇలాగే చేస్తాము... సాయంకాలందాకా తిండీ, నీళ్ళూ ముట్టం!" అన్నాడు రంగప్ప.

తమకు అనుకూలంగా వుండే రౌడీలకు కబురుపెట్టారు షాపువాళ్ళు. వాళ్ళు వాళ్ళ ఆయుధాలతో వచ్చేసరికి రైతుల చేతులలో చిన్న చిన్న గొడ్డళ్ళు, కొడవళ్ళు, ముళ్ళుగర్రలు, చెక్కుడె బారలు మొదలైనవి చేతి సంచుల్లోంచీ వెలుపలికి వచ్చి ప్రత్యక్షం అయ్యాయి. పైగా రైతులందరి కళ్ళలో అన్నింటికీ తెగించిన మెరుపులు కన్పించి అందరినీ హడలగొట్టాయి.

వ్యవహారం ముదిరి పాకాన పడబోతోందని గ్రహించిన షాపువారు రౌడీలను వెనక్కి పంపేసి ఫోన్లు చేయడంతో అరగంటలో మందీ మార్బలంతో పోలీసు జీపు వచ్చి ఆగింది రోడ్డుమీద.

ఈ పర్యాయం రైతులందరి చేతులలో ఆయుధాలు మాయం అయి రసీదులు రెపరెప లాడాయి.

అసలా బిల్లులే తమవి కావన్నారు షాపువాళ్ళు అచ్చమైన ఆంగ్లంలో.

"ఈ బిల్లులమీది రబ్బరుస్టాంపు మీదికాదా?" ప్రశ్నించాడు ఇన్స్‌పెక్టరు.

"మా షాపులో రబ్బరు స్టాంపులు ఉపయోగించముసార్, అన్నీ ప్రింటెడ్ బిల్సే ఇస్తాము!" అన్నాడు షాపతను బిల్‌బుక్స్ చూపుతూ.

అతడలా అనగానే ఉగ్రుడయ్యాడు ఇన్స్‌పెక్టరు రైతులమీద.

"అయ్యా, నేనూ ఆ రోజుల్లో ప్రియూనివర్సిటీ కాడికి చదివినవాడ్నే! పట్నంలో యే గుమాస్తా ఉద్యోగమో వెతుక్కుని హాయిగా బతుక్కోకుండా నేలతల్లినే నమ్ముకుని మట్టి పిసుక్కుంటూ బతుకు నెట్టుకొచ్చిన వాడ్ని. మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి, మట్టిని ప్రేమిస్తూ జీవించే రైతెప్పుడూ అపద్దం చెప్పడయ్యా! వీళ్ళేమో బిల్లులమీదున్న రబ్బరు స్టాంపు ముద్రలు తమవి కావంటున్నారు. ఇరువర్గాల మీదా దయవుంచి ఈ షాపులోని టేబులు అడుగు అరలలో వెతికించండి. రబ్బరు స్టాంపు కనపడ్తుంది. అది దొరకక పోతే మేం వెళ్ళిపోతాం!" అన్నాడు రంగప్ప.

"టేబులు సొరుగులు తీయండి!" అన్నాడు ఇన్స్‌పెక్టరు.

"తాళాలు పెద్దయజమాని వద్ద ఉండిపోయాయి!" అంటూ నీళ్ళు నమిలారు షాపువాళ్ళు.

"ఏం తమాషా చేస్తున్నారా? తాళాలు లేకుండానే వ్యాపారాలు చేస్తున్నారా? వెంటనే తెప్పించండి!" అంటూ మండిపడ్డాడు ఇన్స్‌పెక్టరు.

పది నిముషాలలో ప్రత్యక్షం అయ్యాయి తాళం చెవులు.

టేబులు చిట్టచివరి అరలో మూడు, నాలుగు రబ్బరు స్టాంపులు దర్శనమివ్వడమే కాదు... రైతుల దగ్గరున్న రసీదుల మీది ముద్రలతో సరిపోయాయి. వాటిని టేబులు మీదవుంచి డీటెయిల్డు పంచనామా వ్రాయమని సబ్ ఇన్స్‌పెక్టర్ని ఆదేశించాడు ఇన్స్‌పెక్టరు. రంగప్ప వాళ్ళని కూడా కంప్లయింటు వ్రాయమన్నాడు.

సబ్‌ఇన్స్‌పెక్టరు స్వయంగా పంచాయతీ నామా వ్రాయడం మొదలుపెట్టేలోపు కొందరు పెద్ద మనుషులు వచ్చి రంగప్రవేశం చేశారు! చిక్కుముడి విప్పదీశారు!! బిల్లు తెచ్చిన ప్రతి రైతుకూ షాపువాళ్ళు కొంత లెక్క అప్పటికప్పుడు చెల్లించారు.

ఇహ అక్కడ్నుండీ రంగప్పతో కలసి రైతులందరూ విత్తనాల దుకాణదారుని వద్దకు చేరుకున్నారు. సంగతి మొత్తం అప్పటికే గ్రహించవున్న ఆ దుకాణదారుడూ రైతులతో రాజీపడి అందరికీ కొంతమేర డబ్బు చెల్లించాడు.

మొత్తానికి ఒకరకంగా సమస్య మొత్తం కాస్త సులభంగానే పరిష్కారమైంది. రంగప్పతో సహా రైతులందరూ బరువెక్కిన జేబులతో పల్లెదారి పట్టారు.

నడిదార్లో అన్నాడు రంగప్ప...

"ఈ ఎరువుల్ని, మందుల్ని ఇంకా నమ్ముకోకూడదు మనం!"

"ఇంకేం చెయ్యాలి? అవి లేనిదే పండి చావడం లేదుకదా పంటలు?" అన్నాడు ఒక రైతు మహా ఆక్రోశంగా.

"తప్పకుండా పండుతాయి. అసలు హరిత విప్లవమే పెద్ద తప్పిదమన్న భావాన్ని అనేకమంది జీవవైవిధ్య మండలి సభ్యులు, వ్యవసాయశాఖల తాలూకు ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు వ్యక్తపరుస్తున్నారిప్పుడు. ఇదెలా వుందంటే చేతులు పూర్తిగా కాలిన తరువాత ఆకులు పట్టుకుంటున్నట్లుగా ఉంది. ఈ రసాయనిక ఎరువులు, పురుగు మందులు విపరీతంగా వాడడం వల్ల మన నేలలన్నీ నాశనం అయిపోయాయి. నేలలో వుండి పంటలకు ఉపకారం చేసే బాక్టీరియా అంతరించిపోయింది. పంటలకు మేలుచేసే కీటకాలన్నీ పోయాయి. పైగా బి.టి. పరిజ్ఞానం వల్ల కొత్తకొత్త క్రిములు వ్యాప్తిచెంది అపకారం చేస్తున్నాయి. హైబ్రిడ్ విత్తనాలు, రసాయనాలవల్ల జీవశక్తి, పోషక విలువలు లేని పంటలు పండి రకరకాల రోగాలు, లెక్కలేనన్ని ఆస్పత్రులు పుట్టుకు రావడానికి కారణమవుతున్నాయి. ఈ దుస్థితికి మన స్థాయిలో మనం కొంతమేర అడ్డుకట్టవేయవచ్చు!"

"ఎలా?" అన్నాడు ఇంకో రైతు దిగులుగా.

"వీలయినన్ని కానుగచెట్లు, వేపచెట్లు, పగలు పచ్చారు చెట్లు, రావిచెట్లు పెంచుకుంటూ రావాలి. ఒక చెట్టును కొట్టెయ్యడం అంటే మనకాళ్ళను మనమే నరుక్కోవడం అన్న వాస్తవాన్ని ప్రతి మనిషీ గ్రహించాలి. ప్రతిరైతూ నాలుగైదు చెట్లనయినా పెంచకపోతే ఇక మనం వానచుక్కలను మరచి పోవాల్సిందే. వాన వంగాలంటే నేలమీద చెట్లు పెరిగి తీరాలి.

నీడ, ఆకులు, కొనకొమ్మలు తప్ప మరేమీ ఎవరూ ఏ చెట్టు నుండీ ఆశించరాదు. గుట్టలమీద, డొంకలలో జిల్లేడు చెట్లుకూడా విస్తారంగా పెరగాలి. ఆకులూ, అలుములూ, గొడ్లక్రింద తొక్కుడు గడ్డీ, పేడా... వీటితో కలిసి జిల్లేడు ఆకు కూడా

మురిగితే చాలు... ఆ ఎరువుతో పాటు నేలకు వేపపిండీ, గానుగపిండీ పడ్తే మరో ఎరువు, పురుగు మందుల అవసరం రాదు నిజానికి. దేశీయ ఆవుల పేడ, పంచితాల మిశ్రమమైన ఘనజీవామృతాన్ని కుదుళ్ళలోకి చల్లినా, పారించినా సాగుభూమిలో వానపాములు అసంఖ్యాకంగా పెరిగి పెద్దవయి నేలను ఎంతో సారవంతం చేస్తాయి. ఈ చర్యవల్ల ఏ రసాయనిక ఎరువులూ అక్కరలేకుండా పంట అధిక దిగుబడి కావడమేగాక భూమికి చక్కటి జవసత్వాలు ఏర్పడగలవు.

కూలీ నాలీ చేసయినా సరే ప్రతి గృహస్తుడూ తన ఇంటికి కనీసం రెండు గొడ్లయినా సంపాదించుకుని వాటి సంఖ్యను పెంచుకుంటూ పోవాలి. ప్రతి రైతూ తన ఇంటికి గోబర్‌గ్యాస్ ప్లాంటును ఏర్పాటుచేసుకోవాలి. పస్తులయినా పడివుండి విత్తనాల గింజలు మాత్రం పంటలోంచే ఖచ్చితంగా, సురక్షితంగా దాచుకుంటూ రావాలి తప్ప భిక్షంలాగా ఇవ్వబడే విత్తనాల గింజల కోసం యాచకులలాగా ఆ సెంటర్ల వద్ద పడిగాపులు పడి విలువైన కాలాన్ని, ఆత్మగౌరవాల్ని కోల్పోరాదు!" అన్నాడు రంగప్ప లోతుగా ఆలోచిస్తూ.

* * *

రంగప్ప ఇల్లు చేరే సమయానికి అతని కుమార్తె ఇంటిముందు చెత్త తోస్తోంది. ఆమె రామునిచే పరిత్యజింపబడ్డ సీతలా కన్పించింది అతనికి ఆ సమయంలో. తండ్రిని చూడగానే పార్వతి చీపురు ప్రక్కన పడవేసి పరుగుపెట్టుకువెళ్ళి నీళ్ళచెంబు పట్టుకువచ్చి అతనికి అందించింది.

కాళ్ళు కడుక్కుంటున్న రంగప్ప మనసులో ఓ మెరుపు మెరిసింది.

"అమ్మా, ఓమాట చెప్పనా?" అన్నాడు ఇంట్లోకి వెళ్ళాక.

"చెప్పయ్యా!"

"కీలెరిగి వాత పెడ్తేనే కానీ రోగం కుదరదంటారు... మీ ఇంటాయనకు ఓ పెద్ద వాత పెడ్తానమ్మా!"

"అయ్యో, ఒద్దయ్యా..." అంది పార్వతి జాలిపడ్తూ.

"నీకేమయనా పిచ్చిపట్టిందా? ఇంటల్లుల్ని ఇబ్బంది పెడ్తే మనకు ఆపై పుట్టగతులుంటాయా?" అంది అతని భార్య భయపడ్తూ.

"పిచ్చిదానా, మనమెంతకాలంముంటామే? కలకాలం తోడుండాల్సినదయితే అతనే కదా? చిన్నపామయినా పెద్ద కట్టెతో కొట్టాలన్నారు పెద్దోళ్ళు. మంచిదెబ్బ

ఒకటి చురుగ్గా తగిలితే కానీ మనిషికి మనిషితనం మననానికి రాదు. ఉన్నదంతా ముప్పాతిక భాగం ఊడ్చిపెట్టేసినాక కూడా మనల్ని, మన బిడ్డనే ఇలా ఇరకాటంలో పెడ్తారా? మన బిడ్డ మనకు భారం కాదనుకో... కానీ ఆ బిడ్డకు తోడొద్దా?" చివరి వాక్యం అంటున్నప్పుడు గద్గదం అయిపోయింది స్వరం.

"సరే, నీకేది మంచిదనిపిస్తే అదే చెయ్యయ్యా!" అంది పార్వతి.

"మంచీ, చెడూ తెలిసినోడివి... నీ కింకేం అడ్డుచెప్పనింక!" అంది అతని భార్య కూడా.

* * *

"మీకందరికీ నష్టపరిహారం ఇప్పించేశాము కద? మళ్ళీ వచ్చావేం?" అంటూ విసుగ్గా ప్రశ్నించాడు ఇన్స్పెక్టరు.

"నా కుటుంబ సమస్య ఒకటి కొరుకుడు పడకుండా ఉందయ్యా! అది మీ ద్వారా తీరవచ్చునిపించింది. అందుకని చాల ఆశతో వచ్చానయ్యా!!"

"ఏమిటది?" విసుగ్గానే ప్రశ్నించాడు ఇన్స్పెక్టరు.

"ఒక కూతురు, ఒక కొడుకయ్యా నాకు. సగం పొలం అమ్మి, అడిగింది ఇచ్చి పక్కూరి పిల్లోడితో పాపపెళ్ళి చేశామయ్యా. వాడి అమ్మా, అయ్యా చెడ్డ ఆశపోతులు. అల్లుడు మంచోడేకానీ వాళ్ళెట్లా చెప్తే అట్లాడతాడు. సారె భారీగా అడిగిరి... బాధపడి పంపిస్తిమి. పండక్కి మోటారుసైకిలు కావాలనిరి. తీసిస్తిమి. మళ్ళీ కలర్‌టీవీ అడిగిరి కొనిస్తిమి. ఆపై మళ్ళీ ఒంగోలు గిత్తలడిగిరి. నెల్లూరు జిల్లా నుండీ తెప్పించాల్సివచ్చె!

వాళ్ళకు డబ్బులేక కాదు... దురాశ! పెద్దంత మడిపోగొట్టుకున్నాం, కొంత చేనూ అమ్ముకున్నాం, నా భార్య వంటిమీద చింతాకంత బంగారం లేకుండా పోగొట్టుకున్నాము. ఇకపోతే మేం తలదాచుకోను ఇల్లు, కలో గంజో త్రాగడానికి రవంతమడి, తల వాలిపోతే కడనిద్ర చేసుకోవడానికి కాసింత చేనూ మిగిలున్నాయి. మేమీ స్థితిలో వుంటే ఇప్పుడు మళ్ళీ సెకండ్‌హ్యాండ్ ట్రాక్టరయినా మడకలతో తీసీయమని పట్టుపట్టినారు. ఇంకా ఇల్లూ, వాకిలీ కాసింత నేలా పోగొట్టుకుంటే మేమేం అయిపోవాలి? ఎలా బ్రతకాలి??" అంటూ ఊపిరి తీసుకోవడానికి ఆగాడు రంగప్ప.

"ఇంటరెస్టింగ్... చెప్పు... ఇంకా చెప్పు!" అన్నాడు ఇన్స్పెక్టరు కాస్త ఆసక్తిగా.

"ఇదివరకు కొట్టి తరిమేవారు... ఈ సారయితే వాతలుపెట్టి మరీ తరిమారు! వాటిని చూస్తే కడుపు కాలిపోతుంది. అవి మానడానికే మూడునాలుగు నెలలు పట్టింది!" అన్నాడు బాధగా రంగప్ప.

ఇన్స్‌పెక్టరు కళ్ళముందు దూరప్రాంతంలో ఉన్న తన కుమార్తె రూపం మెదిలింది.

"వాతలు మానినా గుర్తులున్నాయా?" అని ప్రశ్నించాడు.

"ఆ ఉన్నాయయ్యా... వాటిని చూస్తే కడుపు తరుక్కుపోతుంది!"

"నీవు పి.యు.సి. చదివానన్నావు కదూ?"

"అవునయ్యా!"

"నేనో రిపోర్టు డిక్టేట్ చేస్తాను. నీవు వ్రాసి తీసుకువెళ్ళి నీ కుమార్తె చేత సంతకం చేయించు. దాన్ని తీసుకువెళ్ళి తాలూకా స్టేషనులో సబ్‌ఇన్స్‌పెక్టరుకు ఇవ్వు. ఆలోగా నేను అక్కడి ఇన్స్‌పెక్టరుకు ఫోనుచేసి సిఫార్సు చేస్తాను. వాళ్ళు విచారించి సరిచేస్తారు!" అంటూ రంగప్పకు తెల్లకాగితం అందించాడు.

✶ ✶ ✶

పార్వతి భర్తనూ, మామనూ అరెస్టుచేసి సబ్‌జైలుకు తీసుకుపోయారు. సబ్‌జైలులో స్త్రీల సెల్, స్త్రీ పోలీసులూ లేనందున అత్తనూ, ఆడపడుచునూ జిల్లా జైలుకు తరలించారు. వాళ్ళ వూరూ, వాడా గోలగోలచేసినా బెయిలివ్వను పొమ్మంది లేడీ మేజిస్ట్రేట్. అందువల్ల జిల్లా జైలులో తల్లీకూతుర్లు, సబ్‌జైల్లో తండ్రికొడుకులు జైలు భోజనం తినక తప్పలేదు. చివరికి రంగప్పే అయ్యో అన్నా కోర్టువారు బెయిలివ్వలేదు. రాజీకుదిరేవరకూ!

జైల్లోంచీ వెలుపల పడగానే... నలుగురూ తిరుమల కొండకు ప్రయాణమయ్యారు.

"దుర్మార్గుడు, కఠినాత్ముడు, రాతిమనిషి..." అంటూ రంగప్పనూ, "అదేం ఆడది?" అంటూ పార్వతినీ తిట్టిపోశారు ఇరువూర్లవారూ.

కానీ... తిరుపతినుండీ తిరిగి రావడం ఆలస్యం... పార్వతిని పువ్వుల్లో పెట్టుకుని కాపురానికి తీసుకు వెళ్ళేసరికి అందరి హృదయాలలో కొత్తకోణాలు విచ్చుకున్నాయి.

ఆ చుట్టుపట్ల పల్లెలలో, గ్రామాలలో పుట్టిండ్లకు తరిమివేయబడి వుండిన ఆడపిల్లలను అత్తారింఢ్లవాళ్ళు వచ్చి తీసుకువెళ్ళడం మొదలైంది.

✶ ✶ ✶

రంగప్ప కుమారుడి పరీక్షలయి పోయాయి. అతడు తన మేధస్సును పెంచి పెద్ద చేసుకున్నాడని రంగప్పకు తెలియదు. అందుకే తన కుమారుడు దగ్గరలోనే వున్న ఓ ఫ్యాక్టరీలో నైట్ డ్యూటీ సెక్యూరిటీ గార్డుగా పనిలో చేరడం అతనికి నచ్చలేదు.

"నీవు రైతుబిడ్డవురా... ఈ కాపలాదారు ఉద్యోగమేమిట్రా?" అన్నాడు.

"తప్పదు నాయనా... మన దేశమే రైతులదయినా ప్రస్తుతం కడుపారా తిండిలేకుండా బాధపడ్తున్న వారిలో ఎక్కువ భాగం రైతు కుటుంబాలకు, వ్యవసాయరంగానికి చెందినవారే ఉన్నారు! బహుళజాతి వాణిజ్యంతో రైతులు బలిపశువులుగా మారిపోయారు. 1997 నుండీ 2007వ సంవత్సరపు లోపు జరిగిన పదేళ్ళలో ఆత్మహత్యలు చేసుకుని చచ్చిపోయిన రైతుల సంఖ్య ఒకలక్షా ఎనభైమూడు వేల వరకూ ఉంటుందని ఒక అంచనా వెయ్యబడింది. ఆపై ఇప్పుడు నడుస్తున్న ఈ దశాబ్దంలో ఆత్మహత్యలు చేసుకుని మరణిస్తున్న రైతుల సంఖ్య మరింత నివ్వెర పరుస్తోంది... ఈ దుస్థితిలో మార్పు రావాలి.

ప్రభుత్వాల ద్వారా మార్పు వస్తుందన్నమాట కల్ల. పెట్టుబడిదార్ల మార్కెట్ జూదానికి ప్రతి ప్రభుత్వమూ కొమ్ముకాయడం పరిపాటయిపోయింది. పెట్టుబడిదారులు తాము కోరిన ధరతో అమ్ముడుపోని తమ సరుకులను పుచ్చబెట్టి, కుళ్ళబెట్టి సముద్రాల పాలు చేస్తారు తప్ప ధరలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించరు. ప్రభుత్వ గిడ్డంగులు, ధాన్యాగారాలలోని తిండిగింజలు కూడా అడపాదడపా పాడయిపోయి సముద్రాల, నదుల పాలయిపోతున్నాయి. ఈ నిరాశా జనకమైన దుస్తితి ఈనాటిది కాదు. దాదాపు వంద సంవత్సరాలుగా సాగుతున్నదే!

ఈ వలయాల నుండీ వెలుపల పడడానికి మార్పనేది ఎలాగయినా ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు మొదలయి తీరాలి! దానికి మనం మనస్థాయిలో ప్రయత్నిస్తే తప్పులేదు కద?" అంటూ ఆగాడు.

రంగప్పకు తన కుమారుడు కొత్తగా కన్పించి ఆశ్చర్యపరిచాడు. ఆనాటి నుండీ రంగప్ప చెప్పడం మానేసి కుమారుడు చెప్పింది వినడం అలవాటు చేసుకున్నాడు. అందులో అతనికి ఆనందం, ఆశలు కన్పించసాగాయి.

రాత్రంతా జాగారంతో పనిచేసి వచ్చినా పగలు కొద్దిగంటలే నిద్రించేవాడు రంగప్ప కుమారుడు. అతని సూచనల మేరకు అతనితో కలసి ఉదయం మరియు సాయంత్రాలలో తమ చేనులో, చేనుచుట్టూ, మడి కట్టు ప్రక్కనా... అనువైన చోట్ల గుంతలు చేయడం మొదలుపెట్టాడు రంగప్ప. నెలల తరబడి సాగింది ఆ కార్యక్రమం.

తీసిన గుంతలన్నింటిలో వేప, కానుగ, నేరేడు, చింత, మామిడి, మునగ, సపోటా, దానిమ్మ, జామ మొదలైన మొక్కలు తెచ్చి నాటసాగారు.

వారిని చూసి ఇతర రైతులు కూడా ఆ పనులు చేపట్టారు తమ భూములలో.

ప్రతిరోజూ చెరి పది కావడుల నీటిని ఎంతో దూరం నుండీ ప్రయాసపడి మోసుకువస్తూ, రెక్కల కష్టంతో మొక్కలను బ్రతికించుకునే ప్రయత్నం చేస్తున్న ఆ తండ్రి కొడుకులు చాలామందికి ఆదర్శం అయ్యారు.

* * *

ఆరోజు... పెందలాడే...

పెరుగుతున్న మొక్కలకు రక్షణగా కంపలునాటి చుట్టుకుంటున్న రంగప్ప వద్దకు వచ్చారు రాజయ్య, సీతయ్యలు. ఆరైతు యువకుల ఇద్దరి చేతులలోనూ దరఖాస్తు కాగితాల కట్టలు...

"రంగప్ప మామా, మనందరికీ ధర్మవడ్డీలకే అప్పులు మంజూరు చేస్తారట... నీతో ప్రారంభించి ఊరందరి చేతా అర్జీలు పెట్టిస్తాము!" అన్నాడు రాజయ్య.

అర నిముషం వేయి ఆశలు రెపరెపలాడాయి రంగప్ప మనసులో. ఆ వెంటనే ఎవరో ముల్లుగర్రతో వెన్నుమీద పొడిచిన భావన! తియ్యటి శీతల పానీయంలో కలగలిసి పొంగుతున్న పురుగు మందు వాసన ముక్కుకు సోకుతున్న అనుభూతి! కుమారుడు తెల్పిన ప్రాపంచిక దుస్థితికి సంబంధించిన విషయాలు చెవులలో మార్మోగుతుండగా...

"చిట్టచివరికి నాకు మిగిలిన కొద్దిమడిలో సగానికి సగం మడిచెక్క పెద్దరెడ్డికి ఎందుకు ధారపోశానో తెలుసారా?" అని ప్రశ్నించాడు రంగప్ప.

"తెలీదు మామా!" అన్నాడు రాజయ్య ఆశ్చర్యంగా.

"మన ప్రాణాలు తీసే తియ్యటి విషంరా అప్పు! అది నా నెత్తిన ఉండకూడదనే అయిన కాడికి ఆ భూమి అమ్మి అప్పుతీర్చేశానురా. మీరూ ఆ కాగితాలన్నీ చింపి అవతల పారేస్తే సంతోషపడ్తాన్రా!!" అన్నాడు రంగప్ప.

"ఎందుకు మామా?" అన్నాడు సీతయ్య తెల్లబోతూ.

"అదంతేరా! కాడెద్దులు, అరెకరం నేలా ఉన్న రైతైనా సరే తను తిని పదిమందికీ పంచిపెట్టాలిరా! నిన్న మొన్నటిదాకా రైతు అలాగే బ్రతికాడు, అన్నదాతలా వెలిగాడు!! నేడే ఈ కష్టకాలం వచ్చిపడింది. చాలని కొదవకు పప్పుకూరలోకి ఉప్పు రుచిలా రైతు బతుకులోకి చేరిన అప్పు రుచి పెరిగి పెద్దదయింది.

అప్పులు... అప్పులు... అప్పులు... అవి ఎన్నో రకాలుగా రైతును గాలానికి తగులుకున్న చేపను చేసేస్తున్నాయి. చివరికా అప్పులలోనే ఎందరో రైతుల అకాల మరణాలు, ఆత్మహత్యలు!! ఆ చచ్చిన వాళ్ళ భార్యాపిల్లలు 'అలోలక్ష్మణా' అంటూ మాన మర్యాదలు పోగొట్టుకుంటూ, బ్రతకలేకా, చావలేకా దీనంగా దిక్కులు చూస్తూ గడపడం...

అందుకే ఈ అప్పునే ఎండమావిలో దాహం తీర్చుకోవాలనే స్థితినుండీ ముందు బయట పడాలిరా రైతు!

స్విజ్జర్లాండ్, హాలెండ్, డెన్మార్క్, జర్మనీ లాంటి చిన్నచిన్న దేశాలలోని రైతులు సహకారోద్యమంతో ఎంతో ఉన్నతిని సాధించి ప్రపంచంలోని అనేక దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మనం అలా సంఘటితంగా ఒకరికి ఒకరు అండగా నిలుస్తూ ముందుకు సాగాలి! అంతే!!

ఒరేయి ఇంకో పౌరుషమైన మాట చెప్పనా?,,, వాన పడకపోతే రైతు వాడి రక్తాన్ని చమటగా మార్చి ఆ చమటతో నేలను తడపాలిరా! గొడ్లు లేని దుస్థితి కలిగిన నాడు భార్యా బిడ్డల్ని కాడికి కట్టి భూమిని దున్నాలిరా!! అప్పుడేరా నేలతల్లి మూలిగేలా బరువుగా పంటపండేది! అప్పుడేరా చేయి చాచిన వాడి దోసిట్లో లేదనకుండా పావుగింజలు పోయగలుగుతాడు రైతు.

రైతు బక్కచిక్కి పోవచ్చు!...

కానీ రైతు గుండెప్పుడూ మెతకబడకూడదు!!

అందుకే రైతెప్పుడూ అన్నదాతలా తలెత్తుకుని బతకాలి! తలగుడ్డ అప్పులవాళ్ళ కాళ్ళదగ్గరో, అధికారుల మోచేతుల క్రిందో పెట్టి తలవంచుకుని బడుగు బ్రతుకు బతకకూడదు. రైతు తన శక్తిని పెంచుకుని ధైర్యంగా, బలంగా తను నమ్ముకున్న నేలలో తన కాళ్ళమీద నిలబడగలగాలి... అప్పుల మీద మాత్రం కానేకాదు..."

కించిత్ ఆవేశంతో కాస్త పెద్ద స్వరంతో రంగప్ప వాక్ప్రవాహం సాగిపోతూనే ఉంది... యువ రైతులిద్దరి చేతుల్లోని కాగితాలు చినిగి ముక్కలయిపోతున్నాయి... ✪

*(ప్రజాశక్తి సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ)*

*(ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, తేది **20-05-2012**)*

# గుండెమంట

**రా**మకృష్ణ భార్య శారద, అతని అత్తామామలు, బావమరుదులు, తల్లిదండ్రులూ అందరూ కలసి అందుబాటులో వున్న నా నెత్తిమీది కొచ్చి పడ్డారు. రామకృష్ణకు చిన్ననాటి స్నేహితుడు కావడం నా మొదటి నేరమయితే, వాడి తరుపున పెండ్లి పెద్దలలో కూడా మొదటివాడు కావడం రెండవది!

ప్రతిరోజూ ఎవరో ఒకరు రావడం, నా దుకాణంలో కూర్చుని రెండు మూడు గంటలపాటు ఆక్రోశించడం, ఆనక నాతోపాటు మా ఇంటికీ వచ్చి మరో గంటపాటు "ఆమెకేం తెలుస్తుంది?" అన్న ఆలోచన అయినా లేకుండా సుగాత్రి బుర్ర తినెయ్యడం!

వారం పది రోజులుగానూ ఇదే తంతు!!

ఇంత జరుగుతోన్నా రామకృష్ణ ఉలకడు! పలకడు!

వాణ్ణని ఏం లాభం?... ముందు నుండీ మూలి మనిషే వాడు... ఓ పట్టాన నోరుదాటదు వాడి మాట.

వాస్తవానికయితే తప్పంతా శారద వాళ్ళ నాయన నారప్ప గారిదే అన్నది నా విశ్వాసం. కాకపోతే అంకిపాడు మిట్ట ప్రభుత్వాసుపత్రిలో సుబ్బరంగా ఉద్యోగం చేసుకుంటూ సివిల్ సర్జన్ కాబోతున్న వాడ్ని, ఆ చుట్టుపట్ల ఊర్లలోని ఐదారుగురు ప్రయివేటు ప్రాక్టీషనర్ల వద్ద కన్సల్టెంట్‌గా, విజిటింగ్ డాక్టరుగా కూడా వ్యవహరిస్తూ నాలుగు రాళ్ళు వెనకేసుకుంటూ దర్జాగా, హాయిగా ఉండిన రామకృష్ణను అక్కడ వుండనీయలేదాయన.

అల్లుడూ, కుమార్తె కళ్ళ ముందుండాలంటూ ఘటోత్కచపురంలో పెద్దంత స్థలం సంపాదించి అందులో లంకంత భవనాన్ని కట్టించి... "అల్లుడూ, ఇంక నీవా ఉద్యోగం గట్రా మానేసి వచ్చి సుబ్బరంగా ఇక్కడ ప్రాక్టీసు ప్రారంభించు!" అనేశాడు ఆయన.

"మా వియ్యంకుడు మా బిడ్డను మాక్కానీయకుండా చేసేస్తాడు!" అంటూ సంవత్సరాల తరబడి సణుక్కుంటూ ఉండిన రామకృష్ణ తల్లిదండ్రులు కూడా పూర్తయిన ఆ ఇంద్ర భవనాన్ని చూసి నోరు మెదపలేక పోయారు. మంచి జీతం ఇస్తున్న ఉద్యోగాన్ని, కన్సల్టింగ్ ఫీజుల రూపేనా వచ్చిపడ్తున్న పక్కదారి సంపాదనలను

వదులుకుని వచ్చేసి ఇక్కడ ఈ దేవేంద్ర భవనంలో 'శారద క్లినిక్ అండ్ నర్సింగ్ హోం' ప్రారంభించి అట్టే కాలం కాలేదు...

'నేనీ ఊర్లో ఈ ఆస్పత్రిని నడపలేను... నా ఉద్యోగానికే నేను పోతాను!' అంటూ ఓ బాంబు పేల్చాడు రామకృష్ణ.

ప్రాక్టీసు అంచెలంచెలుగా ఎదిగి మంచి స్థితికి చేరువవుతున్న దశలో అతడా నిర్ణయం తీసుకోవడం నాతో సహా ఎవరికీ మింగుడు పడని వ్యవహారం అయికూర్చుంది. ఎవరేం చెప్పినా ససేమిరా అనేస్తున్నాడు రామకృష్ణ.

'ఊరికి ఈశాన్యంగా పల్లపు ప్రాంతంలో ఈ స్థలం సంపాదించడానికి ఎంత కష్టపడ్డానో తెలుసా? ఆ స్థలంలో ఉన్నవాళ్ళను రకరకాలుగా ప్రలోభపెట్టి సగానికిపైగా కొనుగోలు చేశాక, అమ్మడానికి ఇష్టపడని వాళ్ళను నయానా, భయాన బెదిరించి, ఎక్కువ మొత్తాలను అంటగట్టి ఈ స్థలం మొత్తం స్వాధీనం చేసుకునే సరికి ఒక యజ్ఞం చేసినంత పనయింది. ఇక ఆపై హైదరాబాదు వెళ్ళి పర్మిషన్ తెచ్చుకుని ఇక్కడ బిల్డింగ్ ప్లాను అప్రూవ్ చేయించుకునేసరికి మరో యజ్ఞం చేసినంత పనయింది.

పనిమొదలు పెట్టాక ప్రతిరోజూ పనివాళ్ళను, మేస్త్రీలను పట్టుకువచ్చి ఇంజనీర్ల సలహాలు తీసుకుంటూ ఇంత పెద్ద బిల్డింగ్ కట్టడానికి ఎన్ని రోజులు ఎంత అవస్థ పడ్డాను? కడప జిల్లా నుండీ సిమెంటు, ఇసుక, చిత్తూరు జిల్లా నుండి కట్రాల్లూ, కంకర, కర్నాటక నుండీ కంపెనీ ఇటుక, విశాఖ నుండీ ఇనుపకమ్మీ, రాజస్తాన్ నుండి నేలబండలూ, గోడల బండలూ, శ్రీశైలం నుండీ కొయ్య సరుకు... అన్నీ పది చక్రాల లారీలతో లోడ్లులోడ్లు దింపించి దాదాపు మూడేండ్లు రాత్రింబవళ్ళు కష్టపడితే ఈ బిల్డింగ్ తయారయింది. దాదాపు కోటి రూపాయలు దీనికే కరిగిపోయాయి.

ఆపరేషన్ థియేటర్ సామాగ్రి, వార్డుల మంచాలు, బల్లలు, అల్మారాలు... అవీ, ఇవీ అన్నీ నలభై లక్షలు దాటాయి. బోర్డు కట్టి గ్రాండుగా ఆస్పత్రి తెరిచే సరికి మొత్తం ఒకటిన్నర కోట్లయి కూర్చుంది. ఇంతా చేశానా... ఇప్పుడిప్పుడే ఆస్పత్రి రోగులతో, రోగాలతో నిండుతోంది. తీరా వెన్నబడేటప్పుడు బాన పగలగొట్టినట్లు బోర్డు తిప్పేసి పాత ఉద్యోగానికే పోతానంటాడే?... నాదీ తప్పేలే... రిజైన్ చెయ్యకుండా లాంగ్ లీవ్ పెట్టి వస్తానన్నప్పుడే ఒప్పుకోకుండా, రిజైన్ చేయించి వుంటే సరిపోయేది. అలా కాకుండా మిన్నకుండిపోయాను చూడు... అదీ నా బుద్ధిలేని తనం!" అంటూ ప్రతి రోజూ చెప్పిందే చెప్పి నా చెవిలో జోరీగయిపోతున్నాడు రామకృష్ణ వాళ్ళ మామగారు నారప్ప.

పాపం కూతురంటే పంచ ప్రాణాలు ఆయనకు.

నిజానికి ఆయనను చూస్తే జాలేస్తోంది. జీవితంలో బాగా కష్టపడి పైకొచ్చినవాడు. చివరి దశలో కాలం కలిసొచ్చి కోటీశ్వరుడయినాడు!

నా చిన్నతనంలో ఆయన తాపీ పనులకు బేల్దారి కూలీగా వెళ్తుండేవాడు. నేను హయ్యర్ ఎలిమెంటరీ స్కూలుకొచ్చేసరికి తాపీ మేస్త్రీ అయి సైకిల్ క్యారియర్‌లో ఓ చిన్న భోజనం క్యారియర్ కట్టుకుని పనికివెళ్తుండేవాడు.

నేను హైస్కూలు చదువు ముగించుకునేసరికి ఆయన కాస్తా చిన్న కాంట్రాక్టరుగా తయారయి నిగనిగలాడే సరికొత్త ర్యాలీ సైకిలు మీద చకచకా తిరుగుతుండేవాడు. తరువాత సువేగా మోపెడ్ మీద... ఆ తరువాత స్కూటరుమీద... ఆ పై అత్యంత ఖరీదైన మోటారు సైకిలు మీద!!

నేను బట్టలకొట్టు పెట్టుకుని ఇన్నేండ్లకు లక్షాధికారినయ్యాను.

రాజకీయ నాయకుల రాజ్యంలో, సాంకేతిక నిపుణుల యుగంలో కాంట్రాక్టరు నారప్ప కోట్లకు పడగలెత్తేశాడు.

బాగా చదువుకుని వైద్యున్నో, సాంకేతిక నిపుణుడ్నో కాకపోయినా, బట్టలకొట్లో కోట్లు సంపాదించలేకపోయినా నన్ను గౌరవించేవాడు ఆయన. ఇంటిల్లిపాదికీ నా కొట్లోనే బట్టలు కొనేవాడు. ఆ పరిచయంతోనే... కష్టపడి చదివి వైద్యుడయి ప్రభుత్వోద్యోగంలో స్థిరపడ్డ నా మిత్రుడు రామకృష్ణ గుణగణాలను ఆయన చెవిన వెయ్యగలిగాను... ఒకటికి పట్టు పదిపర్యాయాలు.

ఇంకేముంది? వాడి రొట్టివిరిగి నేతిలో పడింది! నారప్పకు అల్లుడయిపోయాడు! అత్యంత ఖరీదైన భవనం చేతిలోకి వచ్చింది! తీరా ఇప్పుడు కాస్తా ఈ మడత పేచీతో నాకు ఎనలేని తలనొప్పిని తెచ్చిపెడ్తున్నాడు... ఏం చేయను?

* * *

ఆ రోజు కొట్టు తెరిచాక కొత్తగా దిగిన స్టాకును గుమాస్తాలకు అప్పజెప్పి దేముడి పటాలకు పూలు వేసి కడ్డీలు వెలిగించాను. కొత్త స్టాకును ఖరీదు, నాణ్యతల వారీగా విభజిస్తూ అరలలో సర్దసాగారు గుమాస్తాలు.

ఇంతలో వచ్చి కూర్చున్నాడు నారప్ప మామ.

కాఫీ తెప్పించాను.

త్రాగేశాక మొదలుపెట్టాడు. పాడిందే పాడరా పాచిపండ్ల పండరీ... అన్నట్లు ఓ గంటసేపు తన బాధంతా వెళ్లగ్రక్కాడు.

ఆయన అలా వెళ్ళాక, మళ్ళీ స్ట్రాంగ్ కాఫీ తెప్పించుకుని తాగి రిలాక్స్‌య్యాను.

ఇంతలోనే ఆయన కుమారులు ఇద్దరూ కలసి వచ్చేసి కూర్చున్నారు... 'మా బావకు నీవైనా కాస్త బుద్ధిచెప్పి సరిచెయ్యకపోతే ఎలా మామా?' అంటూ మొదలు పెట్టారు.

ఇహ సంభాషణ సాగుతూనే ఉంది మధ్యాహ్నం దాకా... నేను ఇంటికి బయల్దేరిన తరువాత కానీ వారు నా షాపు నుండి కదల్లేదు. నిజానికి బాగా విసుగేసింది నాకు. రామకృష్ణను నాలుగు తన్నాలన్నంత కోపం కూడా వచ్చింది.

తీరా ఇంటికొచ్చేసరికి ఇంట్లో శారద కాచుకుని కూర్చుని వుంది... నాతో మాట్లాడటం కోసం. అరగంట పాటు శారద చెప్పిందంతా ఓపికగా విన్నాక, ఆమె, నేనూ భోజనానికి కూర్చున్నాము. ముగ్గురికీ వడ్డించాక తనూ కూర్చుంది సుగాత్రి డైనింగ్ టేబుల్ ముందు.

"ఒరేయి బడుద్దాయ్, సాయంకాలం ఐదు గంటలకు మా షాపు వద్దకు వచ్చెయ్యి. చాలా పనుంది!" అన్నాను భోజనాలు అయ్యాక రామకృష్ణకు ఫోను చేసి.

"ఐదు గంటలకు వచ్చేస్తే... ఆస్పత్రి...?" అన్నాడు వాడు సంశయంగా.

"ఎటూ దొంగల్దోలి దొడ్డిమూసేశాలా ఉన్నావు కదా?... ఒకరోజు పోకపోతే ఏముందిలే... నీ అసిస్టెంటు డాక్టర్లకు అప్పజెప్పిరా!" అన్నాను కోపంగా.

"అక్కడ శారద ఉందా?" అన్నాడు వాడు అనుమానంగా.

"ఆ, శారదమ్మ ఇక్కడే వుంది. నీవు సాయంకాలం ఐదు గంటలకల్లా నా కొట్టు దగ్గరకు వచ్చెయ్యి!" అంటూ సంభాషణ ముగించాను.

✶ ✶ ✶

సాయంకాలం ఐదు గంటలకు రామకృష్ణ కారు మా కొట్టు ముందు ఆగేసరికి నా శ్రీమతి సుగాత్రి కూడా ఆటోలో వచ్చి దిగింది.

సుగాత్రిని క్యాష్ కౌంటర్‌లో కూర్చోబెట్టి నేను క్యారీబ్యాగు భుజానికి తగిలించుకుని వెళ్ళి వాని కార్లో కూర్చున్నాను.

"ఎటుపోవాలి?" అన్నాడు వాడు ముభావంగా.

"అవుటర్ రింగ్ రోడ్డులోకి పోనీ" అన్నాను నేనూ ముక్తసరిగా.

కారు రింగురోడ్డు మధ్యలోకి చేరుకున్నాక ఓ బ్రిడ్జి పక్కగా ఆపించి క్యారీబ్యాగుతో సహా వెళ్ళి బ్రిడ్జి గోడమీద కూర్చున్నాను.

"ఏమిట్రా నీ ఈ గోల?" అంటూ వాడూ వచ్చి కూర్చున్నాడు.

క్యారీ బ్యాగులోంచి బిస్కెట్ ప్యాకెట్లు, ఫ్లాస్కు, ప్లాస్టిక్ కప్పులు తీశాను. టీలో అద్దుకుని నాలుగు బిస్కెట్లు తిన్నాక టీ తాగుతూ అన్నాను...

"ఇంక చెప్పవోయ్!"

'ఏంది చెప్పేది?' అన్నాడు వాడు కోపంగా.

"నీ విసుగూ, కోపతాపాలూ... అన్నీ పక్కనపెట్టు... ఇక్కడ ప్రాక్టీసు ఎందుకు మానెయ్యాలనుకుంటున్నావ్? క్రిస్టల్ క్లియర్‌గా చెప్పు!" అన్నాను.

"ఎలా చెప్పేది? వృత్తిరీత్యా వైద్యుడ్నయిన నాకేఅర్థం కాని అయోమయ స్థితిని కల్పిస్తున్న కారణం... చెప్పినా నీకు అర్థం కాకపోవచ్చు. అందుకే ఎవరికీ చెప్పలేక పోతున్నాను!" అన్నాడు వాడు.

"ఎవరికి చెప్పలేకపోయినా... చిన్ననాటి మిత్రుడ్ని, నీకు పెండ్లి కూడా కుదిర్చిన పెద్ద మనిషిని, ఇంత మంచి ఆస్తి నీకు రావడానికి కూడా కొద్దో గొప్పో పరోక్షంగా కారకుడ్ని... నీ ఈ చర్యతో నీ వాళ్ళందరిచేతా బాధింపడుతున్న వాణ్ణి... నాకు కాక మరెవరికి చెప్తావు? నీవు చెప్పేది చెప్పు... నాకు వీలయినంత అర్థం చేసుకుంటాను" అన్నాను.

కొన్ని నిమిషాలు మౌనంగా ఉండిపోయిన వాడు చిన్నగా నిట్టూర్చి అన్నాడు...

"ఇంకో కప్పు టీ తాగాలి రాజారావ్!"

నేను ఫ్లాస్కులోంచి మరో కప్పులోకి టీ వంచి అందించాను.

* * *

"ఆ మధ్యన ఒక చిత్రమైన పేషంటు వచ్చాడు..." అంటూ ప్రారంభించాడు.

మనిషి కాస్త చిత్రంగా కన్పించాడు. "ఏమిటి కష్టం" అని ప్రశ్నించాను.

"నాకు అతి విచిత్రమైన ఆలోచనలు వచ్చేస్తున్నాయి సార్!" అన్నాడు పేషెంట్.

ఆ కంప్లయింటయితే నాకు కొత్త కాదు. నేను సైక్రియాటిస్టుని కాకపోయినా గవర్నమెంటు సర్వీసులో కొన్ని కేసులు డీల్ చేసిన తప్పనిసరి అనుభవం ఉంది.

"చెప్పండి... ఎలాంటి ఆలోచనలు వస్తున్నాయి?"

"మా వీధి ఊడ్చే కార్పొరేషన్ వర్కర్ని లాగి చెంపదెబ్బ కొట్టాలనిపిస్తుందండీ!"

"ఎందుకు?"

"నాకు తెలిసి అతనికి పదిహేను వేలకు పైగా నెలకు జీతభత్యాలు లభిస్తాయి. కానీ తనకు తరచు డబ్బులిచ్చేవారి ఇండ్లముందర పరిశుభ్రపరచి తతిమ్మా ఇండ్ల ప్రాంతాన్ని గాలికి వదుల్తాడు!"

"మీ కోపంలో న్యాయం ఉంది... ఇంకా."

"సిటిజన్స్ చార్టరు సర్వీసు సెంటరు ఉద్యోగిని కాళ్ళకు తాడుకట్టి తల్లక్రిందులుగా వ్రేలాడ దీయాలనిపిస్తుందండీ!"

"ఎందుకు?"

"లంచాల బారి నుండీ ప్రజలను తప్పించడానికి, వారి సమస్యలు సత్వర పరిష్కారాలు పొందడానికీ ఏర్పాటుచెయ్యబడ్డ ఆ సెంటర్‌లో అతడు అందుకు విరుద్ధంగా మరింత జాప్యం చేస్తూ అవినీతికి పాల్పడుతున్నాడు!"

"మీ ఆలోచనకు అర్థం ఉంది!" అనగలిగాను.

"చిన్నచిన్న మరమ్మత్తులు చేస్తే సరిపోయే దివ్యమైన రహదార్లకు మరమ్మత్తుల ఊసే ఎత్తకుండా, ఏకంగా రాత్రికి రాత్రే వాటి మీద జానడెత్తు రెన్యువల్స్ చేయించేసే ఇంజనీర్లకు కాళ్ళు తొలగించెయ్యాలనిపిస్తుందండీ!"

"అంత పెద్ద శిక్షా?" అన్నాను అసంకల్పితంగా.

"తప్పదండీ... తప్పుచేసే వారికి తగిన శిక్ష ఉండాలనిపిస్తుదండీ!"

"ఆలోచించాల్సిందే మరి!" అన్నాను.

"అందుకూ, ఇందుకూ తరచు రోడ్ల మీద బైఠాయించి కేకలుపెట్టే వారందరికీ బట్టలూడదీయించి పిరుదుల మీద వాతలు పెట్టించాలనిపిస్తుదండీ!"

"తమ నిరసనలను అలా ప్రకటించుకోగల స్వేచ్ఛవున్న మనుషులు కదా!"

"నిజమే! కానీ వారి నిరసనల పుణ్యమా అని ఆగిన అంబులెన్సులలో కొన్ని ప్రాణాలు హరీమనడం, ఆగిన ఆటోలలో నడిరోడ్డుమీద నలుగురి మధ్యనా కాన్పులు జరిగిపోవడం... ఇలాంటి వాటికి ప్రతిచర్యలుండాలి కదా?"

నేను మౌనం వహించాను.

"రైలు పట్టాలను ముట్టుకునేవారి చేతులు నరికెయ్యాలి సార్, ఎందుకంటే... ఒక రైలు పడిపోవడం, వందలాది మంది మరణించడం, వేలాదిమంది గాయపడడం,

కోట్లాది రూపాయల నష్టం వాటిల్లడం ఘోరమైన నేరం కదా? స్త్రీలను హింసించే వారు, ఆసిడ్ చల్లుతామని బెదిరించేవారు, అత్యాచారాలకు ప్రయత్నించేవారు, గృహహింసకు పాల్పడేవారు ఒక కన్ను, ఒక కాలు కోల్పోవాలి. భూ బకాసురులు, కలప స్మగ్లర్లు తమ నాలుకలు కోల్పోవాలి...” ఇలా సాగిపోతోంది అతని వాక్ప్రవాహం.

అతడు చెల్లించిన కన్సల్టింగ్ ఫీజు అతని దృష్టిలో పెద్ద మొత్తమే అయివుండాలి. అందుకే ఓపికగా కూర్చుని నెమ్మదిగా తన భావాలను విడుదల చేస్తున్నాడు.

“...ధరలను నియంత్రించకుండా సరదాగా ఆ మంటలకు మరిన్ని చితుకులేస్తున్న మహానుభావుడ్ని తిండి, నీళ్ళు లేకుండా నాలుగు రోజులపాటు నాలుగు రోడ్ల కూడలి మధ్యనున్న పంద్రెండు దీపాల స్థంభానికి వ్రేలాడదీయాలి” అతడు ఆ మాటలంటు న్నప్పుడు అతని స్వరంలో అరకడుపు వాడి ఆక్రందన అలవోకగా ధ్వనిస్తోంది.

“ఇంకా...” అని ప్రశ్నించాను నీరసంగా, అసంకల్పితంగా...

“సమాజ సంక్షోభానికి పరోక్షంగా కారకులవుతూ స్వలాభం చూసుకుంటున్న పాలకులందర్నీ వరుసగా విద్యుద్దీప స్థంభాలకు ఉరితీసి ఆ శవాలను అలాగే కుళ్ళబెట్టాలి...”

అనాగరికంగా సాగుతున్న అతని ఆలోచనలను అరికట్టడానికి తగిన ట్రీట్‌మెంట్ నిజానికి నా పరిధిలోనిది కాదు. అయినా అతని శారీరక స్థితిని నా పరిధిలో అన్ని రకాలుగాను పరీక్షించి మంచి మాత్రలు రాయడానికి ప్యాడ్ అందుకుని కొంత ఆలోచన చేస్తున్నాను.

“అన్నట్లు సార్, ప్రాణాలుపోసే పవిత్రవృత్తికే కళంకం ఆపాదిస్తూ నిర్దాక్షిణ్యంగా కొన్ని ప్రాణాలు గాలిలో కలసిపోవడానికి కారకులవుతూ అప్పుడప్పుడూ మీ వైద్యులు సమ్మెబాట పడ్తుంటారు. వారందరికీ పాదాలు తొలగించాలి”

నేను ఉలిక్కిపడ్డాను.

నా మనసులో మెదిలిన కొన్ని మందుల పేర్లు కూడా మాయమయ్యాయి.

“అలాగా?!” అన్నాను కాస్త కీచుగా.

“అవున్సార్, ఎథికల్‌గా చూస్తే వైద్యుడంత గొప్ప సంఘసేవకుడుండడు... ఓరల్‌గా చూస్తే ఆ వృత్తిలో పైకి వచ్చిన వాడంత సంఘద్రోహి మరొకడుండడు...” అంటాడు ఓ రచయిత. అందుకే ఈ వృత్తిలో పైకి వచ్చిన వారందరినీ......”

తాత్కాలికంగా వాడడానికి నేనతనికి కొన్ని మందులు రాసి ఇచ్చి, డిస్ట్రిక్ట్ జనరల్ ఆస్పత్రిలో ఉన్న స్పెష్టలిస్టును కలుసుకోమని చెప్తూ ఆయనకు ఓ సిఫార్సు ఉత్తరం కూడా రాసి ఇచ్చాను.

* * *

రామకృష్ణ చెప్పడం ముగించాడు.

"ఓరి పిరికి వెధవా?! ఎవడో పిచ్చివాడు ఏదో వాగాడని నీవు భయపడి ఇదంతా వదులుకుని పారిపోతావా?" అంటూ పరిహాసంగా ప్రశ్నించాను.

"ఈ సమస్య నిన్నటిదీ ఈ రోజుదీ కాదు రాజారావ్, రేపటిది! అంటే భవిష్యత్తుది! అంతేకాదు ఆ అశాంతి, అసహనం, ఆగ్రహం... అన్నీ... అతని ఒక్కనివే కాదు, పగిలిపోబోతున్న అగ్నిగుండంలా మారిపోబోతున్న సమాజం మొత్తానికీ చెందినవని భావిస్తున్నాను నేను!"

"ఎలా?"

"నా వద్దకు వచ్చిన రోగికి అవే ఆలోచనలతో బాధపడ్తూ నిద్రలేమికి గురవుతున్న రోగులు దాదాపు వందమంది తెలుసునట! వారందరికీ వేలాదిమంది అలాంటి వారే తెలుసునని చెప్తున్నాడు! ఇంత చిన్న ఊర్లో అంతమంది ఆక్రోశం అలావుంటే ఇంత పెద్ద రాష్ట్రంలో, మొత్తం మన దేశంలో ఎన్ని కోట్ల మంది...?... వారందరి ఆక్రోశం ఏదో ఒకరోజు ఆవేశంగా మారక తప్పదు కదా? మరి ఆనాడు... ఆ రోజు సంగతేమిటి?" అని ప్రశ్నించాడు రామకృష్ణ.

చప్పున జవాబు దొరికే ప్రశ్నా అది? ఒళ్ళు జలదరించగా నేను మౌనాన్ని ఆశ్రయించాను. అందువల్ల రామకృష్ణే కొనసాగించాడు...

"ఆక్రోశం అవధులు దాటినప్పుడు సామాన్యుడి గుండె రగలదా?... ఇహ అప్పుడు అతడు తన ప్రాణాల్ని కూడా లెక్కచెయ్యడు. తమ దుస్థితి, నిరాశా, నిస్పృహలు ఉత్ప్రేరకాలుగా మారి సామాన్యులు సంఘటితమయి ఆగ్రహిస్తే జరిగే పరిణామాలు భయానకంగా ఉంటాయి కదా?!

గతంలో అయితే మేడే తరువాతి సంఘటనలు, నిన్న మొన్న జరిగిన ఘటనలలో అయితే ప్రజాగ్ని జ్వాలలలో పతనమైపోయిన రాజ్యాధినేతల హీనమైన దీనస్థితి, నేడయితే లండన్‌లో ప్రారంభమయి, లీడ్స్, లివర్‌పూల్, బర్మింగ్‌హెూం, వోల్వర్ హాంప్టన్, నాటింగ్ హెూం మాంచెస్టర్, ఇంకా ఎన్నో నగరాలు... ఇలా ఇంగ్లాండు అంతా

విస్తరించిన అల్లర్లు, లూటీలు, దహనాలు, ఇతర హింసాత్మక సంఘటనలు... ఆపై జరిగిన జరుగుతున్న విషయాలు... ఇవన్నీ రేపటిని గూర్చి చెప్తున్నదేమిటి?"

రామకృష్ణ ఊపిరి తీసుకోవడానికి ఆగాడు.

అతని అంతరంగంలో ఏర్పడుతున్న ఆలోచనలలోని లోతులు నాకు కొద్దికొద్దిగా అవగాహన అవడం మొదలుపెట్టాయి.

✶ ✶ ✶

రామకృష్ణ వెళ్ళి తన ఉద్యోగంలో చేరిపోయి అసలు సిసలైన సంఘసేవకుడిలా తన వృత్తి బాధ్యతలు నిర్వహిస్తూ నిశ్చింతగా ఉన్నాడిప్పుడు.

అలిగి కొంతకాలం పుట్టింటిలోనే ఉండిపోయిన శారద చివరికి చేసేది లేక అతని దగ్గరకు వెళ్ళిపోయి సుబ్బరంగా కాపురం చేసుకుంటోంది.

నారప్పమామ ఆస్పత్రి బిల్డింగును చిన్న చిన్న అపార్టుమెంట్లలాగా, పోర్షన్లుగా ఆల్టరు చేయించి అద్దెలకు ఇచ్చుకున్నాడు.

రామకృష్ణ తల్లిదండ్రులు, సోదరీ సోదరులు, బంధుమిత్రులు... అందరూ అతన్ని పనికిమాలిన వాడని తిట్టుకుంటూ అతన్ని గూర్చి కథలు కథలుగా చెప్పుకుని అర్థంలేని తృప్తిని అనుభవిస్తూ కాలాన్ని దుర్వినియోగపరుస్తున్నారు.

✶ ✶ ✶

"మీటరు రెండు వందల డెబ్బయి" అంటున్నాడు కొనుగోలుదారునితో మా గుమాస్తా.

నేను అతని చేతుల్లోని వస్త్రం కేసి చూశాను.

"ధర సరిగ్గా చూసి చెప్పు... ఆ క్లాత్ వెల మీటరు రెండు వందలా ఇరవయి రూపాయలే కదా?!" అన్నాను.

నాకు "అతి సర్వత్ర వర్జయేత్" అన్న సూక్తి తరచు జ్ఞాపకానికి వస్తున్నది. ఎందుకంటే రేపటిని గూర్చిన భయం నాలోనూ ఉందిప్పుడు!

నిజమే... బహుశా భయం నడిపిస్తుంది భవిష్యత్తును.

న్యాయంగా ఆలోచించగలవారు మాత్రమే జీవించగలుగుతారేమో? భవిష్యత్తులో..!!

*శ్రీలక్ష్మి మాసపత్రిక ప్రారంభసంచిక – మార్చి **2012***

# ఎదుగుదల ఎక్కడాగి పోతున్నది?

**ఘ**టోత్కచపురం ఆర్డీవో ఆఫీసు పెద్దగేటు ప్రక్కగా సుకన్య మౌనపోరాటం ప్రారంభించడమే నాకిష్టం లేదు. దాన్ని ఆపడానికి అన్ని రకాలుగా ప్రయత్నించి భంగపడ్డాను. అయితే ఆ పనికి కొన్ని స్త్రీవాద సంస్థలు, ఇతరులూ మద్దతు తెలిపి ఆమెకు ఎండ తగలకుండా షామియానా ఏర్పాటుచేయించి, ఆందోళనా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం నాకు మింగుడు పడని వ్యవహారమే అయింది.

వారు పొరపాటు చేస్తున్నారని వాళ్ళకు తెలియచెప్పాలని శతవిధాలా ప్రయత్నించాను.

"ఇతగాడెవరో పురుషాహంకారానికి ప్రథమ ప్రతినిధిలా ఉన్నాడు!" అంది ఓ యువతి కోపంగా.

"నేను వాస్తవాల్ని తెలుపుతోంటే, నన్ను పురుషాహంకారినని అంటారా?" అంటూ ఆమెమీద మండిపడడం నేను చేసిన నేరమయింది.

"ఇలాంటి వాళ్ళవల్లే ఈ సమాజం ఇలా అఘోరిస్తోంది. ముందు ఇతన్ని సంస్కరించాలి!" అంటూ కొందరు ఆడవాళ్ళు కొంగులను నడుములలో దోపుకుంటూ ముందుకు వస్తే, వారికి మద్ధతుగా కొందరు పురుషపుంగవులు సైతం చొక్కారెట్టలు పైకిమడుస్తూ వచ్చి నన్ను చుట్టుముట్టారు.

మొత్తానికి అందరూ కలసి వీరోచితంగా నామీద పడి చితకబొడిచేస్తున్నా చూస్తూ కూర్చుండిపోయింది సుకన్య...

పాపం మౌన పోరాటంలో ఉంది కద?! ప్రభావతి అప్పుడు అక్కడలేదు!! "మేల్‌పిగ్, హిబ ఫేలో..." అన్న బిరుదులతో నన్ను కీర్తిస్తూ ఆడవాళ్ళు, తిట్లు లేకుండానే మగవాళ్ళు కొట్టిన దెబ్బలకన్నా, కాపడం పెడ్తూ... "ఆ సుకన్యంటే ఎందుకండీ మీకంత అభిమానం?" అంటూ సుగాత్రి సంధించిన ప్రశ్నే నన్నెక్కువ ఇబ్బంది పెట్టింది.

"ప్రపంచంలో అతిదారుణంగా దోపిడికి గురవుతున్నది స్త్రీ!" అంటారు లెనిన్. నేను అంత గొప్పగా ఆలోచించే వ్యక్తిని కాకపోయినా... మనిషిగా స్పందిస్తాను బహుశా!... అంతే!!" అన్నాను.

అంతకుమించి గతాన్ని చెప్పడం నిజానికి నాకిష్టంలేదు. అయితే ఆ సమయంలో ఆ గతమే నా కళ్ళముందు కదలాడుతోంది!

✶ ✶ ✶

ఫైనలియర్‌లో ఉన్నప్పుడు సుకన్య అంటే పడిచచ్చేవాడ్ని. గాలికెగిరే ఆమెపైట చెరగుకోసం, ఆమె నల్లని కురులలోని తెల్లని మల్లెల వింత సౌందర్యం కోసం, ఆమె దగ్గర్నుండీ వచ్చే ఫెర్ఫ్యూం సువాసనలను ఆస్వాదించడం కోసం... ప్రాణాలు వదిలెయ్యడానికి కూడా సిద్ధం అన్నట్లుండే వాడిని.

పకపకా నవ్వేసింది సుకన్య నా ప్రేమగోలంతా నేను వెలిగ్రక్కినరోజు.

"నీవు పెద్ద అందగాడివీ కావు, ధనవంతుడంతకన్నా కావు... ఏంచూసి ప్రేమించను నిన్ను?" అనేసింది నవ్వుతూనే.

అసలే సున్నిత మనస్కుడ్ని. ఆ దెబ్బ నుండీ కోలుకోవడానికి చాల రోజులు పట్టింది. యూవర్శిటీ వాళ్ళు బొటాబొటీ మార్కులేసి డిగ్రీ చేతికిచ్చి పుణ్యం కట్టుకోవడం వల్ల కాస్త తేరుకున్నాను.

సెరికల్చర్ డిపార్టుమెంటులో వచ్చిన ఓ ఇంటర్వ్యూకు వెళ్తే ఫారం వర్కర్‌గా ఘటోత్కచపురం గ్రయినేజికే తీసుకున్నారు. సిగ్గుపడకుండా పనిలో పడ్డాను.

దండులో కొలువులా చేసేది చాలా చిన్న ఉద్యోగమయినా మంచి వ్యక్తిగా నలుగురిలో గుర్తింపు పొందుతూ వచ్చాను. దానికితోడు నిద్రరాని రాత్రులను సద్వినియోగం చేసుకుని నా మనసులో రేగే సంఘర్షణల వల్ల ఉత్పన్నమయ్యే భావాలకు అక్షర రూపం ఇస్తూ రావడంవల్ల రచయితగా నాకో ఇమేజ్ ఏర్పడుతూ వచ్చింది క్రమంగా. ఆపై గుర్తింపు వెతుక్కుంటూ వచ్చింది.

సుకన్య నన్నేకాస్తయినా గుర్తించకపోయినా తనమీది ప్రేమ తగ్గలేదు నాలో! అందువల్ల నా ప్రేమను మళ్ళీ అభివ్యక్తీకరిస్తూ ఆమెకు ఓ ఉత్తరం వ్రాశాను. తిరుగు టపాలోనే జవాబు వచ్చిపడింది.

అందులో నాలుగే నాలుగు చిన్న చిన్న వాక్యాలు...

డియర్ రాజారావ్,

నీవు చేసే ఉద్యోగమేమిటి? నీ స్థితేమిటి??

నిన్ను ప్రేమించి, ఆపై నిన్ను పెళ్ళికూడా చేసుకున్నాననుకో...

నీవేం తింటావ్? నాకేం ఒరగబెడ్తావు??

మిత్రురాలు
సుకన్య.

ఓసారి బాగా గాయపడి కోలుకున్న హృదయం కాబట్టి ఈ పర్యాయం మరీ కృంగిపోకుండా కాస్త తట్టుకోగలిగింది. రోజులు గడచిపోతున్నాయి...

అంకితభావంతో నిజాయతీగా నా పనినేను చేసుకుంటూ వెళ్తుండడం ఉద్యోగ జీవితంలో నాకెంతో ఉపకరించింది. కొద్ది సంవత్సరాలలోనే పదోన్నతులతో ఫొరంఫోర్‌మెన్ కాగలిగాను. జీతం బాగా పెరిగింది! పని భారం కొంత తగ్గింది. మా డిపార్టుమెంటువారి ద్వారా ఫ్రీ ఇంట్రస్టు లోను లభ్యం కావడం వల్ల నేనో ఖరీదైన మోటారు సైకిలును కూడా పొందగలిగాను.

ఓరోజు నడచి వెళ్తున్న సుకన్య ప్రక్కన నా బైక్ ఆపి లిఫ్ట్ ఇస్తానన్నాను.

నిస్సంకోచంగా నా వెనుక కూర్చుంది తను! ఆమెను ఇంటివద్ద దింపి కలలలో తేలిపోతూ తిరిగివచ్చి, ఇంకో ప్రయత్నంగా మరో ప్రేమలేఖ పోస్ట్ చేశాను.

దానికీ తిరుగు టపాలోనే జవాబు వచ్చింది...

మైడియర్ రాజారావ్,

నాలుగు జీతపురాళ్ళు తెచ్చుకుంటున్నావు, ఓ మోటారు సైకిలు కొనుక్కున్నావు... నాకు లిఫ్టు కూడా ఇచ్చావు... బావుంది!

అయినా అతి సామాన్యుడివి నీవు.

ఆశల ఆకాశంలో, ఊహల గుర్రాలమీద వీర విహారం చేసే కలల మనిషిని నేను. నీవద్ద నాకేం లభ్యం అవుతాయి? అత్యాశకు వెళ్ళకు...

నీ మిత్రురాలు

సుకన్య

పెద్దదెబ్బ, ఆ తరువాత చిన్న చిన్న దెబ్బలతో గట్టిపడిన హృదయం కాబట్టి బాధస్సలు కలుగలేదు. ఓటమిని అంగీకరించలేక, మరోలేఖ వ్రాశాను.

ప్రియాతి ప్రియమైన సుకన్యా,

నీ ఉత్తరం అంది ఆనంద పరచింది.

నీవన్నట్లు నేను అతి సామాన్యుడినే! అయితే నికార్సయిన జీవితాన్ని గడిపే మామూలు మనిషిని... అయితే...

ఆశల ఆకాశంలో వీరవిహారం చేసే నిన్ను కలల మధ్య నుండీ క్రిందికి దించి, నేలమీదే నీకో స్వర్గాన్ని నిర్మించి, దానికి నిన్ను రారాణిని చెయ్యాలనే భగీరథ ప్రయత్నంలో ఉన్న వాడ్ని నేను.

నీ చుట్టే పరిభ్రమిస్తూ నిన్నే ప్రేమించే మనసు, నిన్నో దేవతలా గుండెగుడిలో ప్రతిష్ఠించుకున్న హృదయమూ, నీకోసం నవ్వుతూ శరీరాన్ని వదిలి పెట్టడానికయినా సిద్ధపడే ప్రాణమూ, నావద్ద ఉన్నాయి. వీటికి నీవు విలువ ఇవ్వగలిగితే నేను వచ్చి నీ తండ్రి అనుమతితో నిన్ను స్వీకరిస్తాను. అది నీకు సమ్మతమే కద?

చంద్రుని రాకకోసం ఎదురుచూసే చకోరపక్షిలా నీరాక కోసం ఎదురుచూచు...

నీ, రాజారావు.

ఆ ఉత్తరానికి నేను జవాబు ఆశించలేదు. సుకన్యే వచ్చి కలుసుకుంటుందన్న నా అంచనా తప్పుతూ జవాబు పోస్టులోనే వచ్చింది నెమ్మదిగా.

చాల ఆతృతతో విప్పి చదివాను.

మై డియర్ పూర్‌ఫెలో రాజారావ్,

ఫ్రాంక్‌గా జవాబిస్తున్నందుకు మన్నించు! నేను నిన్ను వివాహం చేసుకోలేను. నీవు నాకివ్వగలిగే నేలమీది స్వర్గం నాకవసరం లేదు.

ఇహపోతే నీవు నన్ను స్వీకరించడాన్ని అనుమతించడానికి నా తండ్రి భారతంలోని ప్రతిష్టానపురం రాజు యయాతి కాదు. తలవంచుకుని నీవెంట రావడానికి నేను మాధవినీ కాను. నా తల్లిదండ్రులు నాకు కావాల్సినంత స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్నీ ఇచ్చిన ఉదారులు. పైగా నాకంటూ ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వమున్న వనితను నేను. కాబట్టి అత్యాశలకు వెళ్ళకుండా నీకు తగిన యువతిని చూసుకుని, చేసుకుని సుఖపడు. గుడ్‌బై!

మిత్రురాలు,
సుకన్య.

ఆ ఉత్తరం చదివాక నాకు బాధ కలుగకపోగా ఉక్రోషం తన్నుకు వచ్చింది. నేరుగా వెళ్ళి ఆమెను కలుసుకుని...

"నీ తండ్రి యయాతి కానట్లే నేను గాలవుడినో, అయోధ్యాధిపతి ఇక్ష్వాకుడినో, కాశీరాజు దివోదాసునో, భోజదేశపు ప్రభువు ఉశీనరుడనో కానుకద?... నీకేదయినా అన్యాయం జరిగిపోవడానికి?? నీకోసమే తపిస్తూ, నిన్నింతగా ప్రేమించే నన్నెందుకు ఇష్టపడవు?" అంటూ చాల కోపంగా ప్రశ్నించాను.

"ప్రతి మనిషికీ కొన్ని ఇష్టాలూ, మరికొన్ని అయిష్టాలూ ఉంటాయి కదా రాజారావ్?!" చాలా శాంతంగా ఎదురు ప్రశ్న వేసింది సుకన్య.

"ఆ!" అన్నాను కోపంగానే.

"స్ఫురద్రూపియై మంచి శరీరచ్ఛాయతో అందంగా, హుందాగా ఉండి, మంచి స్థితిపరుడు కూడా అయివున్న వ్యక్తిని వివాహం చేసుకోవాలన్నది నా ఆకాంక్ష. నీలాంటి సగటు మనిషిని మాత్రం కానేకాదు!" అందామె శాంతంగానే.

తలవంచుకుని వెనక్కి తిరిగి వచ్చేశాను.

లోతుగా తగిలిన ఆ గాయం పూర్తిగా మానకమునుపే నా తల్లిదండ్రులు బలవంతంగా తీసుకువెళ్ళి సుగాత్రిని చూపించారు.

ఇంటికి తిరిగి వచ్చాక నా తండ్రి అన్నాడు... "మా అందరికీ బాగా నచ్చిందరా ఈ సంబంధం. ఈ అమ్మాయిని నీవు చేసుకుంటే మా కందరికీ ఆనందం!"

'ఇష్టపడ్డ యువతిని చేసుకునేరాత ఎటూ లేదు... పెద్దవాళ్ళిష్టపడ్డ అమ్మాయిని చేసుకుని వారికయినా ఆనందం కలిగిస్తే మంచిదికదా?" అని అనుకుంటూ తల వూపాను.

పెళ్ళయి పోయింది. రోజులు, వారాలు, నెలలు చాల త్వరితంగా గడిచి పోతున్నాయి. పెళ్ళయ్యాక అసిస్టెంటు ఇన్స్‌పెక్టరుగా ప్రమోషన్ వచ్చింది. సైన్సు గ్రాడ్యేటునే కాబట్టి ఆ వెనువెంటనే డిపార్టుమెంటు ట్రయినింగుకు అవకాశం వచ్చింది.

సుగాత్రి అడుగుపెట్టిన వేళా విశేషమన్నారు అయినవాళ్ళందరూ. ఆ సంగతేమిటో గానీ పల్లెటూరి రైతు కుటుంబం నుండి వచ్చిన, పెద్దగా చదువుకోని సుగాత్రి సంస్కారం, సౌశీల్యం, ప్రేమ, అభిమానాలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేస్తుండేవి సదా! ఆమె నీడలో పాతగాయాలన్నీ మానుపట్టాయి.

ఓ పర్యాయం ప్రశ్నించాను... "పెద్ద అందగాడినీకాను, ధనవంతుడ్నంతకన్నా కాను... ఎందుకు నామీద నీకింత ప్రేమ?"

సుగాత్రి చిన్నగా నవ్వి అంది... "అశాశ్వతమైన బాహ్య సౌందర్యాన్ని గూర్చి, ధనాన్ని గూర్చి  ఆలోచనలు ఎందుకు? నన్ను ప్రేమించే హృదయమూ, మనసూ, నాకోసమే జీవించే పంచ ప్రాణాలూ మీలో వున్నాయి. ఆడదానికంతకన్నా విలువైన సంపద ఏంకావాలి? అయినా ధనానికి మనకు లోటేముంది? భద్రతతో కూడిన సర్కారు కొలువుంది కద మీకు!"

ఆమె విశ్వాసాన్ని చూసి విచలితుడ్నయిపోయాను.

* * *

నేను ట్రైనింగ్ ముగించుకుని వచ్చేసరికి సుకన్య కాశీపతితో కలసి కాపురం పెట్టి ఆనందంగా జీవిస్తోంది బ్యాంకర్సు కాలనీలో.

కాశీపతి మంచి అందగాడు, కోటీశ్వరుడని పేరుబడ్డవాడు. వారు ఇరువురూ చూడచక్కని జంటే అయినా నాకు వారి కలయిక ఏమాత్రం నచ్చలేదు... కారణం... కాశీపతికి అదివరకే వివాహం అయింది. భార్య జీవించేవుంది! అందంగా, ఆరోగ్యంగా కూడా వుంది!! వారికి ఒకపాపకూడా!

సుకన్య అతని అందం, అతనికున్న మేడలూ, పొలాలూ, కారూ చూసి ఆత్రపడిపోయింది. కానీ అంత డబ్బు లేకపోయినా... నాలా ఆలోచించగలిగే, కొద్దోగొప్పో డబ్బున్న అందగాడే ఎవరో ఒకరు సంతోషంగా ఆమెను చేసుకుని ఉండేవాడు.

"ఔదుంబరాణి పుష్పాణి
శ్వేత వర్ణంచ వాయసమ్
మత్స్య పాదం జలే పశ్యే
న్న నారీ హృదయ స్థితం." అన్న శ్లోకాన్ని మననం చేసుకుంటూ... ఈ ఆడవాళ్ళ హృదయాలు అస్సలర్థంకావు... అనుకున్నాను.

రెండు మూడు పర్యాయాలు సుకన్య దార్లో ఎదురుపడ్డప్పుడు అసలేమీ జరగనట్లుగా మాట్లాడడమేగాక నన్ను తమ ఇంటికి ఆహ్వానించడం వల్ల ఒక పర్యాయం ఆమె ఇంటికి వెళ్ళక తప్పలేదు.

ఇల్లు, లేటెస్ట్ ఫర్నిచర్, ఇంట్లో నౌకర్లు... అంతా చాలా డాబుగా ఉండడమే కాదు ఆమె జీవితం కూడా చాల దర్జాగా నడుస్తోంది. బహుశా అదంతా చూపడానికే నన్నాహ్వానించి ఉండవచ్చు.

ఆ తరువాత కూడా మర్యాద కోసం రెండు మూడు పర్యాయాలు వాళ్ళింటికి వెళ్ళాల్సివచ్చింది. కాశీపతి పరిచయం అయ్యాడు. సుకన్య అభ్యర్థన మేరకు సుగాత్రిని కూడా తీసుకుని ఓరోజు వారింటికి లంచ్‌కు వెళ్ళివచ్చాను.

సుగాత్రి మంచి ఇంప్రెషన్ కలిగించింది కాబోలు... తరువాత సుకన్య తరచు మా ఇంటికి వచ్చి వెళ్ళసాగింది.

మరో ప్రమోషన్‌తో సెరికల్చర్ ఇన్స్‌పెక్టర్ని అయ్యాను. పోస్టింగ్ దగ్గరి ఊర్లోనే కావడంవల్ల సంసారాన్ని మార్చాల్సిన అవసరం రాలేదు. రిమార్కులు లేని నా లెంగ్త్ ఆఫ్ సర్వీసు, ఎబిలిటీలు నా పేరును అసిస్టెంటు డైరక్టర్స్ ప్యానల్‌లోకి చేర్చాయి. వైవిధ్య భరితమైన రచనలతో రచయితగా కూడా చాలమంచి గుర్తింపును పొందగలిగాను ఆలోపు.

కాలం గడిచిపోతోంది.

నా జీవితం ఏ ఇబ్బందీ లేకుండా సజావుగా, సగౌరవంగా సాగిపోతుండగా సుకన్య జీవన గమనంలో మాత్రం కొన్ని అపశృతులు చోటు చేసుకుంటూ రాసాగాయి. కలసి జీవిస్తూనే వున్నా సుకన్య, కాశీపతులు తరచు తగవులు పడ్తున్నట్లు తెలుస్తూ వచ్చింది.

ఓ ఆదివారంనాటి ఉదయాన్నే సుకన్య 'స్త్రీ శక్తి' సంస్థ సభ్యురాలయిన ప్రభావతితో కలసి మా ఇంటికి వచ్చింది. టిఫిన్, కాఫీలాంటి మర్యాదలు పూర్తయ్యాక నెమ్మదిగా రంగంలోకి దిగింది ప్రభావతి...

"మనం సుకన్యకు, కాశీపతికి పెళ్ళి చేయాలి!" అంటూ.

నేను తెల్లబోయాను. సుగాత్రికూడా ఆశ్చర్యంతో నోరు తెరిచింది.

"ఇప్పుడు కొత్తగా మనం చేసేదేమిటి? వాళ్ళు భార్యా భర్తలు కదా?" అన్నాను సుకన్య మెడలోని బరువైన బంగారపు మంగళసూత్రాల గొలుసుకేసి చూస్తూ.

"వీళ్ళది గాంధర్వ వివాహం... చట్ట సమ్మతంకాదు. రేపు అతని ఆస్తి మీద ఈమె కెలాంటి హక్కూ ఉండదు!"

" ఆ విషయం ఇప్పుడా ఆలోచించాల్సింది?"

"సుకన్య అమాయకురాలు కాబట్టి అంతదూరం ఆలోచించలేకపోయింది. తను రేపో, మాపో ఓ బిడ్డను కన్నా ఆ బిడ్డను కాశీపతి బిడ్డ అని కానీ, సుకన్యను అతని భార్య అని కానీ గట్టిగా అనరుకదా?" అంది ప్రభావతి. ఆమె అంత దూరం ఎందుకాలోచిస్తోందో నాకర్థం కాలేదు.

సుకన్య మరీ అంత అమాయకురాలేం కాకపోయినా నాకు కాశీపతి మీద ఒళ్ళు మండిపోయింది. బహుశా నాకు దక్కని సుకన్యను అలవోకగా దక్కించుకున్న అతని మీద నాకే తెలియకుండా నాలో అంతర్గతంగా ఉండివున్న ఆక్రోశం యేదో ఆ సమయంలో అలా వెలుపలికి వచ్చి పడిందేమో?

నిజానికి మనిషి అదుపులోంచి, సులువుగా జారిపోయేది వివేకమే ఒక్కోసారి!

"నేనేం చెయ్యాలి?" అంటూ ఆవేశంగా ప్రశ్నించాను.

"కాశీపతిని కలసి సుకన్యను రిజిస్టరు మ్యారేజో లేక గుళ్ళో పెళ్ళో ఏదో ఒకటి చేసుకోమని నచ్చజెప్పాలి!" అంది ప్రభావతి.

"మూర్ఖత్వం!" అని ఏ కోశానా నా కన్పించకపోవడం వల్ల ఆరోజే వెళ్ళి కాశీపతిని కలిశాను... విడిగా!

"ఇంకా ఇప్పుడు తనని రిజిస్టరు మ్యారేజి కాదుకదా... మళ్ళీ రహస్య వివాహం చేసుకోవాలన్నా కూడా సాధ్యంకాదు" అన్నాడు కాశీపతి అంతావిని.

"ఎందుకని?" నాలోని ప్రకర్షను వెలుపలపడనీయకుండా ప్రశ్నించాను.

"లీగల్‌గా ఇబ్బందులు వచ్చి పడ్తాయి కద?"

"సుకన్యను చేపట్టేటప్పుడు ఈ లీగల్ మొదలైన ఇబ్బందులన్నీ జ్ఞాపకానికి రాలేదా?" అంటూ కాస్త కఠినంగా ప్రశ్నించాను.

"ఎందుకు లేదు?... అప్పుడే ఇవన్నీ సుకన్యతో రోజుల తరబడి డిస్కస్ చేశాను కద? ఇప్పుడు కొత్తగా ప్రభావతి మాటలు విని ఇలా ప్రవర్తిస్తోంది మరి!"

"ఆఫ్‌కోర్స్... ఆమెకు తన జీవితానికి సంబంధించిన భద్రత కావాలి కద?"

"అందుకే కద... తనుంటున్న ఇల్లు... ఇరవయి లక్షల వరకూ పలికేది, ఆరెకరాల పొలం... పది లక్షలు పై చిలుకు చేసేది... రెండూ తన పేర్న వ్రాసి రిజిష్టరు చేసిస్తానంటున్నాను కద?" అన్నాడు అతడు విసుగ్గా.

ఈ విషయం సుకన్యకానీ, ప్రభావతికానీ నాతో ప్రస్తావించింది కాకపోవడం వల్ల తెల్లబోయాను.

“అసలు పరస్పర విశ్వాసం, ప్రేమ మృగ్యం అయిపోతూ వస్తే జీవితాలకు అర్థం ఉంటుందంటారా రాజారావ్?”

కాశీపతి అలా ప్రశ్నించగానే నేను “ట్రూత్ ఈజ్ స్ట్రాంగర్ దాన్ ఫిక్షన్” అనుకుని కాస్త సిగ్గుపడ్డాను మనసులో. కానీ పైకిమాత్రం...

“మిమ్మల్ని నమ్ముకున్న అబలగా తనకు అత్యంత విశ్వాస పాత్రమైన న్యాయాన్ని కోరుకుంటున్నది సుకన్య!” అని అన్నాను.

“ఏమిటండీ న్యాయం? పెళ్ళయి ఓ బిడ్డవున్న వాడ్ని కాబట్టే అప్పట్లోనే నా పరిస్థితులు మొత్తం తనకు వివరించాను కదా? తప్పని అనుకుంటే ఇద్దరిదీ తప్పే! కానీ తప్పంతా నాదే అయినట్లుగా తలచి ఆమేకేలోటూ రాకుండా చూస్తున్నాను. ఆమె చెయ్యి పట్టిన నాటినుండీ నేటి వరకూ కూడా నెలలో పాతిక రోజులు సుకన్య ఇంట్లోనే గడుపుతున్నాను. నా పెద్ద భార్యతో, బిడ్డతో గడుపుతున్నది ఐదురోజులే! సుకన్య డబ్బు, నగలు ఏదడిగినా ఇంతవరకూ కాదనలేదు. ఆమె తాలూకు ఖర్చు నెలకో గెజిటెడ్ ఆఫీసరు సంపాదన కన్నా ఎక్కువవుతుందన్న నిజం ఎవరికి తెలుసు? నవ్వుతూ ఖర్చుపెట్టే నాకుతప్పు!” అన్నాడతడు బాధగా.

ఆ రాత్రి అతడు సుకన్య ఇంటికి వెళ్ళలేదు.

మరునాటి ఉదయాన్నే మళ్ళీ మా ఇంటికి వచ్చేశారు సుకన్య, ప్రభావతీ. ఇద్దరూ చాల ఆవేశంలో ఉన్నారు.

“ఎవర్నయినా లాయర్ను సంప్రదించండి కేసు పెడ్తాము!” అంది ప్రభావతి.

“ఇంత చిన్న విషయానికి అంత దూరమా?” అన్నాను నిర్ఘాంతపోతూ.

“సంసారంలో వచ్చే కలతల్ని నిదానించి సర్దుకుపోవాలి... ఆత్రపడకండి” అంది సుగాత్రి నచ్చజెప్పడాన్కి ప్రయత్నిస్తూ.

“ఇది మీరనుకున్నంత చిన్న విషయం కాదు. అంత తేలికగా వదిలిపెట్టడానికి. డబ్బు ఎంత ఖర్చయినా బాధలేదు. మంచి లాయర్ని సంప్రదించి రండి!” అంది సుకన్య మండిపడిపోతూ.

సర్ది చెప్పడానికి ప్రయత్నించి ఓడిపోయాము నేనూ, సుగాత్రీ.

ఆ సాయంకాలం సుకన్య వాళ్ళ తండ్రిగారిని తీసుకువెళ్ళి నా చిన్ననాటి మిత్రుడు లాయర్ గోపీని కలిశాను.

"ఫీజుకు వెనుకాడరంటున్నావు.... కాబట్టి మరో లాయరెవరైనా ఈ కేసు తీసుకోవచ్చు... నేను మాత్రం ఈ కేసుతీసుకోను" అన్నాడు గోపీ అంతా విని.

"అదేమిటి?"

"నైన్టీఫైవ్ పర్సెంటు ఓడిపోయే అవకాశాలున్న ఈ కేసును నీ మిత్రుడై వుండీ నేనెలా తీసుకుంటాను?"

"కేసు నిలవదా?"

"అతనికి పెళ్ళయిందనీ, పాపవుందనీ తెలిసి మరీ అతనితో కలిసింది నీ మిత్రురాలు. పైగా సంవత్సరాలు గడిచాయి. న్యాయాన్యాయాల సంగతెలా వున్నా పెళ్ళయి, ఓ బిడ్డకూడా వున్న పురుషుడు రెండవ వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరం. మొదటిభార్య అనారోగ్యంతోటో, మరో కారణంతోనో మనస్ఫూర్తిగా తన అంగీకారాన్ని తెలిపితేతప్ప సాధ్యంకానిపని!"

"మరో మార్గం ఏదీ లేదా?" అని ప్రశ్నించాను.

"ఓ మార్గం ఉంది!" అన్నాడు గోపీ కాస్త సంశయంగా.

"ఏమిటది?"

"మతం మార్చుకోగలిగితే!"

నాకు నవ్వు తన్నుకు వచ్చింది.

గోపీ చెప్పిందంతా మక్కీకి మక్కీగా ఒప్పజెప్పాను సుకన్యకూ, ప్రభావతికీ.

సుకన్య తండ్రి యయాతి కాకపోతే పోయె... ఒట్టి వెన్నెముక లేని అమీబాలా ఉన్నాడు... గోపీ దగ్గరే కాదు... కుమార్తె ముందు కూడా నోరు మెదపడం లేదు! మౌనంగా కూర్చున్నాడు ఉత్సవ విగ్రహంలా!!

"అలా అయితే మనం వెళ్ళి ఆర్డీవోను కలుద్దాం... ఆయన తప్పకుండా న్యాయం చేస్తాడు!" అంది ప్రభావతి.

అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్ళి ఆర్డీవోను కలిశాము.

"ఇటీజ్ హైలీ ఇంపాసిబుల్!" అనేశారాయన అంతావిని.

"ఎందుకు సార్!?" అంది ప్రభావతి చాల ఆవేశంగా.

"పెళ్ళయి, బిడ్డను కూడా కలిగివున్న వ్యక్తితో మిసెస్ సుకన్యకు... సారీ... మిస్ సుకన్యకు వివాహం జరిపించడం చట్టరీత్యా నేరం. పెద్ద నేరం!"

"ఒక అమాయకురాలైన అబలకు న్యాయం చెయ్యలేరా సార్?"

"ఈ అమాయకురాలికి న్యాయం చెయ్యాలంటే మరో ఇద్దరమాయకుల గొంతులు కోయాలి కదా తల్లీ"

"ఎలా సార్?"

"సుకన్యకు ఫేవర్ చెయ్యాలంటే అతని భార్యకు, బిడ్డకు అన్యాయం జరిగిపోతుంది కదా? కాబట్టి ఇది చట్టరీత్యాకానీ, ధర్మరీత్యాగానీ మేం సాల్వ్ చెయ్యగలిగిన సమస్యకాదు... మీ అంతట మీరే ఆర్థికంగా పరిష్కరించుకోవాల్సిన విషయం ఇది" అని అనేశారాయన.

అంత జరిగాక కూడా సుకన్య ఆలోచన మారలేదు.

నా ఇంట్రస్టు చూసిన గోపీ స్వయంగా వచ్చి మరీ... "కాశీపతి వ్రాసియిచ్చే ప్రాపర్టీని మొదట వ్రాయించుకుని రిజిస్టరు చేయించుకోండి" అని సలహా ఇచ్చి వెళ్ళాడు. కానీ లాభం లేకపోయింది.

సుకన్య ఆర్డీవో ఆఫీసు ముంగిట మౌనపోరాటం మొదలు పెట్టేసింది! పైగా నాకేమో దెబ్బలూ తప్పలేదు!!

దెబ్బలు తిన్నానని తెలిసి నన్ను చూడడానికి వచ్చాడు గోపీ ఒకరోజు. "ఇంతగా చెప్పినా వీళ్ళ తలలకెందుకెక్కడం లేదు? ఈ ప్రభావతి ఒకరు... సుకన్యను చెడగొట్టటానికి!" అన్నాను.

గోపీ నవ్వేశాడు.

"నిజానికి ప్రభావతి కూడా నీలాగే అమాయకురాలనిపిస్తోంది!"

"ఎలా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

"ఆమెకు తన స్త్రీవాద దృక్పథం, తన సిద్ధాంతాలూ, అంతులేని ఆవేశం తప్ప ఇతర లౌకిక విషయాలపట్ల పెద్దగా పరిజ్ఞానం ఉన్నట్లు లేదు!"

"కనీసం సుకన్య బుర్రకయినా ఎక్కాలికదా? తెలివి తక్కువ మనిషి" అన్నాను కోపంగా.

"సుకన్య చాల తెలివైన మనిషి రాజారావ్, అందుకే మనమాటలు తన బుర్రకెక్కడం లేదు!" అన్నాడు గోపీ మళ్ళీ నవ్వి.

"ఎలా?  ఎందుకు??"

"మన మాటలు వింటే తనకు ముప్పయి లక్షల ప్రాపర్టీ మాత్రమే లభిస్తుంది. తను ఈ పోరాటంలో గెలిస్తే... గెలవడం సాధ్యమయ్యేపని కాదని ఆమెకు తట్టడం లేదన్నది వేరే విషయం... ఒకవేళ గెలిస్తే కనీసం డెబ్బయి ఎనభయి లక్షల ఆస్తి ఆమెకు లభ్యమవుతుంది కద!?"

"వార్నీ... మరి ఈ సమస్య పరిష్కరించబడేదెలా?"

"కాశీపతి మరింత ఎక్కువ ప్రాపర్టీ ఇస్తానని కాంప్రమైజ్ అయితే ఇట్టే పరిష్కారం అయిపోవచ్చు!" అన్నాడు గోపీ నవ్వుతూనే.

అయితే అలాంటి అద్భుతమేదీ జరగలేదు.

✶ ✶ ✶

సుకన్య మౌన పోరాటాన్ని మొదట్లో అటు రెవెన్యూ వాళ్ళుకానీ, ఇటు పోలీసులు కానీ ఏమాత్రం పట్టించుకోలేదు. కానీ రోజులు గడిచేకొద్దీ ఆమె మౌన పోరాటం రాజకీయ రంగులు పులుముకోవడంతో ప్రతిరోజూ పేపర్ల తాలూకు జిల్లా ఎడిషన్లలో పెద్ద పెద్ద హెడ్డింగులతో, పోటోలతో సహాచోటు చేసుకుంటూ వచ్చింది. ఇంకా నయం దెబ్బలుతిన్న నాపేరు పేపర్లలో వచ్చిందికాదు.

"అమాయకురాలికి అన్యాయం చేసిన కఠినాత్ముడు కాశీపతిని వెంటనే అరెస్టు చేయాలి" అన్న నినాదంతో బ్యానర్ కట్టి పదిమంది యువతులు సుకన్యతో కలసి రిలే నిరాహారదీక్షల్లో కూర్చోవడంతో పరిస్థితి గందరగోళంగా తయారయింది. పైగా ఓ రాజకీయపార్టీ ఆధ్వర్యంలో ఆమె పోరాటానికి మద్దతుగా ఘటోత్కచపురంలో ఓ రోజు సంపూర్ణ బంద్ కూడా జరిగింది. దాంతో అంతవరకూ పురుషాహంకారంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాశీపతి భయపడిపోయి వెళ్ళి ఎక్కడో దాక్కున్నాడు.

పరిస్థితి అంతదాకా వచ్చాక ఉండబట్టలేక ఓ రోజు సాయంత్రం మళ్ళీ మౌనవ్రత శిబిరాన్ని సందర్శించి... కాశీపతి తిరిగి వచ్చేదాకా అయినా పోరాటాన్ని తాత్కాలికంగా ఆపమని అభ్యర్థించాను.

"ఎందుకీ విరామం? ఏమిటి అందువల్ల ప్రయోజనం?" అంది చాలా ఆవేశంగా ప్రభావతి. అప్పుడు గ్రహించాను ఆనాటి గోపీమాటల్లోని వాస్తవాన్ని.

"నేను సుకన్య క్షేమం కోరి, ఆమె భవిష్యత్తును గూర్చి ఆలోచించి చెప్తున్నాను... ప్రస్తుతానికి ఈ పోరాటం ఆపుదాం, తెగేదాకా లాగడం కన్నా కాశీపతికి సుకన్యకు

రాజీ కుదర్చడమే మంచిపని. సుకన్య నా మనిషి అని మళ్ళీ పరిగెత్తుకువచ్చి ఇంతగా చెప్తున్నాను!” అన్నాను కాస్త ఆవేశంగా.

“అలాగా? అయితే మేమంతా సుకన్య మనుషులం కామన్న మాట! సంతోషం!! సుకన్య మీ మనిషని పరుగుపెట్టుకు వచ్చారు కదా, సుకన్య మీకేమవుతుంది? తల్లా, సహోదరా, కుమార్తా, ప్రియురాలా? ఆవిడ మీకేమవుతుందో ముందు తేల్చిచెప్పండి! ఆ తరువాత మీ సూచనలు, సలహాలు మేం స్వీకరించాలో, వద్దో ఆలోచిస్తాము!” అంది ప్రభావతి మరింత ఆవేశంగా, పెద్ద స్వరంతో దూకుడుగా.

ఆమె అలా అనగానే... “స్నేహితురాలు!” అని అనబోతూ హఠాత్తుగా ఆగిపోయాను... ఎవరో వెన్నుమీద కొరడాతో లాగి కొట్టినట్లవడం వల్ల. ఆ క్షణాలలో చిన్న ఉలికిపాటుకు గురయ్యాను కూడా. నా ముఖం పాలిపోయింది... తల అవమాన భారంతో తొలిసారిగా వాలిపోయింది.

రెండు నిముషాలపాటు భయంకరమైన నిశ్శబ్దం... తరువాత... “నన్ను క్షమించండి!” అంటూ ప్రభావతికి రెండు చేతులూ జోడించి నమస్కారం చేసి నెమ్మదిగా వెనుదిరిగి వచ్చేశాను...

* * *

వద్దనుకున్నా న్యూస్ పేపర్ల జిల్లా ఎడిషన్ల ద్వారా ప్రతిరోజూ సుకన్య మౌన పోరాటం తాలూకు వార్తలు తెలుస్తూనే ఉన్నాయి.

కాశీపతి వద్ద డబ్బు తీసుకుని అతన్ని అరెస్టు చేయలేదంటూ వస్తున్న అభియోగాలతో విసిగిపోయిన పోలీసువారు చాలా తీవ్రంగా ప్రయత్నించి కాశీపతిని అరెస్టు చేశారు. బెయిలు వెంటనే లభ్యం కాలేదు.

అతని అరెస్టుతో ప్రభావతివాళ్ళు సుకన్య మౌనపోరాటాన్ని తాత్కాలికంగా నిలుపదల చేశారు.

“నాకు బెయిలు కూడా ఒద్దు... వెంటనే కేసు పెట్టండి... నేను చేసిన నేరానికి ఎన్ని సంవత్సరాలు శిక్షపడుతుందో పడనివ్వండి. ఆ శిక్ష అనుభవించిన తరువాతే నేను నా జీవితాన్ని నా భార్యాబిడ్డతో మళ్ళీ నూతనంగా ప్రారంభించుకుంటాను!” అని కాశీపతి అన్నాడని ఓరోజు పేపర్లో వచ్చింది.

“తనెక్కడికి పోతాడు? ఎన్నాళ్ళు పోతాడు?? మళ్ళీ నా దగ్గరికే రాకతప్పదు!” అని సుకన్య అంటున్నదని ఎవరో చెప్పగా విన్నాను.

'బుద్ధి కర్మానుసారిని' అన్నట్లుగా మనుషులెందుకింత మూర్ఖంగా ప్రవర్తిస్తారో అస్సలర్థం కావడం లేదునాకు.

అయితే ప్రస్తుతం నా ఆలోచనలలోని అదనపు ప్రశ్నలు... సుకన్య ఏమవుతుందా? ఆమె భవిష్యత్తు ఏమిటా?? అన్నవి మాత్రం కాదు. ఎందుకంటే నాకిప్పుడు మనుషుల మనస్థత్వాలలో, ఆలోచనా విధానాలలో ఎన్నోలోపాలు కన్పిస్తూ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేస్తున్నాయి.

అసలు ఇతరుల సంగతలా ఉంచితే, సమాజాన్ని ప్రభావిత పరుస్తున్న రచయితగా పేరుబడ్డ నా విషయం కూడా...

నాకు పెళ్ళయింది.

అనుకూలవతి, సంస్కారవతి, సౌశీల్యవతి అయిన భార్య. పైగా సహృదయురాలు.

పోతే ఏ చెడ్డ కాలమో సంప్రాప్తమయి సుకన్య కాశీపతితో తగువు పెట్టుకున్నది కానీ... కాశీపతి కూడా ఆమె కోరుకున్న విధంగానే మంచి అందగాడు, సంస్కారి, సహృదయుడు. నడచిన దారేదయినా కానీ ధర్మానికి కట్టుబడాలని ప్రయత్నించిన వాడు!

మరి ఈ పరిస్థితులలో నేనెందుకు సుకన్య చుట్టూ అలా ప్రాకులాడుతూ పరిభ్రమించాను?

ఏమిటి నాకు ఆమెమీది ఆసక్తి?

కేవలం హృదయమున్న మనిషిలా, విశాల భావాలు కలిగిన రచయితగా నా ప్రవర్తన సాగిందా..లేక...

బహుశా నాకే తెలియకుండా నా మనసులోఅంతర్గతంగా ఆమె పట్ల అస్పష్టమైన దురాలోచన ఏదయినా ఉండివుండినదా?

ప్రభావతి నా కళ్ళు తెరిపించకపోతే ఏమయ్యేవాడిని?

కొంపదీసి సంస్కారం ముసుగు ధరించిన మానవ మృగాన్ని కానుకదా నేను??

"అసలు మనిషియొక్క మానసిక ఎదుగుదల ఎక్కడాగిపోతున్నదా?" అన్నదే నా నిరంతర ఆలోచన ప్రస్తుతం!! ✪

*ఉపాధ్యాయ మాసపత్రిక కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ.*

***ఉపాధ్యాయ, మే, 2012***

# ఆత్మబంధువు

**వ**చ్చినపని కాస్తా త్వరగానే తెమిలింది.

'ఇహ ఇంత తినేసి రైలెక్కేస్తే సరి' అని అనుకుంటూ హెూటల్ హర్షకేసి నడిచాను.

మిలటరీ హెూటల్ అయినా అక్కడ మామూలు భోజనం కూడా బావుంటుంది... నిజం చెప్పాలంటే మా ఇంట్లో భోజనంలాగే ఉంటుంది.

హెూటల్‌లోకి వెళ్ళాక ఫ్యామిలి రూంలోకి వెళ్ళి ఓ చివరగా ఖాళీగావున్న టేబుల్ ముందు ఫ్యానుగాలి క్రింద కూర్చున్నాను.

"మటన్ బిరియానీ, చికెన్ బిరియానీ, ఫ్రైడ్‌రైస్, మటన్ కరీ, చికెన్ ఫ్రై, ఎగ్ ఫ్రై, ఫిష్ ఫ్రై, తండూరీ చికెన్..." వెలుపల నాన్‌వెజ్ వింగ్‌లో జనరల్ టేబుల్ దగ్గర ఎవరో సప్లయిర్ చదువుతున్న దండకం విన్పించింది.

'ఈ స్వరం చాల పరిచితమైనదిగా ఉందే?!' అని అనుకున్నాను.

మరో టేబుల్ దగ్గర కాబోలు మళ్ళీ ఆ స్వరం వినవస్తోండగా కుతూహలాన్ని ఆపుకోలేక లేచి వెలుపలికి వచ్చి ఆ వైపు చూశాను.

అతన్ని పోల్చుకోగానే కరంటు షాకు తగిలినట్లయింది నాకు.

ఆరేడు సంవత్సరాల క్రితంనాటి అతని అందమైన రూపం పరిశుభ్రమైన దుస్తులతో సహా కళ్ళముందు కదలాడింది.

ఎంత వ్యాపారస్తుడ్నయినా నేను మనిషిని. అందుకే ఆపై భోజనం చెయ్యాలని పించలేదు. కాస్త వికలమైన మనసుతో క్యాష్‌కౌంటర్ వద్దకు నడిచాను.

"ప్లీస్... ఎక్స్క్యూజ్‌మీ" అన్న నావైపు చూశాడు కౌంటర్‌లోని వ్యక్తి.

"ఒక చిన్న సహాయం చెయ్యగలరా?" అన్నాను అభ్యర్థనగా.

"చెప్పండి!" అన్నాడతడు నన్ను ఎగాదిగా చూసి.

"ఆ ఎర్రచొక్కా వేసుకున్న సర్వర్ రామదాసు మా దూరపు బంధువు. అయితే ఆయన నన్ను గుర్తుపట్టేలాలేరు. ఒక్క అరగంట అతనికి పర్మిషన్ ఇస్తే మేమలా బయటకు వెళ్ళి కాస్త మాట్లాడుకుంటాము!" అన్నాను మరింత అభ్యర్థనగా.

"అలాగా... అయితే మంచి రద్దీ సమయమే!" అన్నాడు అతను సంశయంగా.

"మీకేదయినా లాస్ జరిగితే దాన్ని కాస్తా నేను సంతోషంగా భరిస్తాను!" అన్నాను వినయంగా.

"అయ్యో రామ... రామదాసు వల్ల మాకు లాస్ అయినా కేర్ చెయ్యము... మంచి పెద్దమనిషి అతను... తీసుకువెళ్ళండి!" అంటూ అటు తిరిగి, "ఒరేయి సింహాద్రీ, కాస్సేపు రామదాసు టేబుల్లు కూడా నీవే చూడరా బాబూ!" అంటూ ఓ కుర్ర సర్వర్‌కు పురమాయించాడు.

ఎట్టకేలకు రామదాసు, నేను కలసి హెూటల్‌లోంచీ వెలుపలికి వచ్చి దగ్గరలోనే వున్న ఓ కూల్‌డ్రింక్ షాపు చేరుకున్నాము.

మొదట ఫ్రూట్‌సలాడ్, ఆపై ఆపిల్ జ్యూస్ ఆర్డరు చేశాను.

రామదాసు నన్ను గుర్తుపట్టలేకపోతూ ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు.

"ఫెన్షన్ చాలడం లేదా?" అంటూ మృదువుగా ప్రశ్నించాను.

రామదాసు కళ్ళలో ఆశ్చర్యం కన్పించింది.

"ఎక్కడా?... ఇంకా ఫెన్షన్ ఫిక్స్ అయి చేతికందందే?? ఇంతకూ తమరెవరో గుర్తురావడం లేదు!" అన్నాడు.

"నేనెవరో చెపుతాను కానీ... ముందు ఇది చెప్పండి... మీరు రిటయిర్ అయి ఎంతకాలం అయింది?"

"రెండు సంవత్సరాలా ఐదు నెలలయిపోయింది!"

"మరింతకాలం ఫెన్షన్ ఎందుకని అందలేదు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

"బహుశా మీకు తెలిసే వుండవచ్చు... నేను అంకితభావంతో నిజాయితీగా ఉద్యోగం చేసిన వాడ్నని. నాలాంటి వాళ్ళకు అఫీషియల్ గ్రడ్జస్ తప్పవు. అందుకే నా సర్వీసులో మొత్తం పధ్నాలుగు బదిలీలు.

నా చేతిలో కలం వుంది. నాకు వ్రాయడం చేతనవును... నాకేమిటి భయం? అని అనుకుంటూ మార్చిన ప్రతివూరికీ వెళ్ళి ఉద్యోగం చేశాను. తీరా ఇంకో ఆర్నెల్లకు రిటైర్ అవుతాననగా ఫెన్షన్ ప్రపోజల్సు తయారు చేసుకోవడానికి చూసుకుంటే నా సర్వీసు రిజిష్టరు కన్పించడం లేదు ఆఫీసులో.

ఇంక్రిమెంట్లు స్టాగ్నేషన్ వచ్చేవరకూ కూడా నా సర్వీసు రిజిష్టరు అరియర్ పేమెంట్సు కోసమూ, ఇతర ఎంట్రీల కోసమూ నేను పనిచేసిన ఆఫీసులకు అటూ

ఇటూ తిరుగుతూనే వుంది. అప్పుడు ఎక్కడో ఎలాగో మిస్సయింది. అయితే ఎక్కడ? అన్నది ట్రేసవుట్ కాకపోయింది.

ఓపికగా నేను పనిచేసిన ప్రతి కార్యాలయానికి వరుసగా వెళ్ళి విచారించాను... కానీ... నా సర్వీసు రిజిష్టరు జాడ దొరకలేదు. అన్వేషణలలోనే ఆర్నెల్లూ గడిచిపోయి రిటైర్ అయిపోయాను.

రోజులూ, వారాలూ, నెలలూ, సంవత్సరాలూ కూడా గడచిపోతున్నాయి. నేను పనిచేసిన కార్యాలయాన్నింటినుండీ సరయిన సహకారం లభ్యం కాకపోవడం వల్లా, నిరంతర జీవనసంగ్రామం విరామమివ్వక పోవడంవల్లా నా సర్వీసు రిజిష్టరు కాపీని తయారుచేయించుకోవడంలో ఘోరంగా విఫలం అయ్యాను. అందువల్ల ఫెన్షన్, గ్రాట్యుటీ, ప్రావిడెంటు ఫండు, అర్నుడు లీవు ఎన్ క్యాష్మెంటు... ఏదీ... ఏ ఒక్కటీ చేతికందకపోయింది. పిల్లల చదువులు ఇబ్బందిలో పడిపోయాయి. కుటుంబపు జరుగుబాటూ భారమైపోయింది!" అంటూ ముగించాడు అతడు.

"అయితే మాత్రం... అంతమంచి ఉద్యోగం చేసిన మీరు... ఇలా ఆ మాంసాహార భోజనశాలలో సప్లయర్గా...?" అంటూ ఆరోక్తిలో ఆపేశాను.

"ఏం చెయ్యను బాబూ? ఆర్థిక సమస్యలన్నీ చుట్టుముట్టి ఊపిరి ఆడక దిక్కుతోచని స్థితిలో పడిపోయాము. చివరికి అబ్బాయేమో తిరుపతిలో దూరపు బంధువుల ఇల్లల్లో వారాలు చేసుకుంటూ తంటాలుపడ్తూ తన చదువు తను కొనసాగిస్తున్నాడు. అయితే అమ్మాయి మాత్రం చదువు మానుకుంది. ఇంట్లోనే ఉదయం ఇడ్లీ, వడ, దోశ... సాయంకాలం బజ్జీలు వేసి చుట్టుపట్ల వాళ్ళకు అమ్ముతూ ఇల్లు నడిపే ప్రయత్నాలలో పడింది.

నేనూ ఓ లాడ్జిలో కొన్నాళ్ళు, ఓ మిల్లులో కొన్నాళ్ళు మేనేజరుగా, అక్కౌంటెంటుగా పనిచేశాను. కానీ రెండుచోట్లా చుక్కెదురయింది నాకు. ఆ స్థితిలో పులిమీద పుట్రలా నా శ్రీమతికి అనారోగ్యం... తీరా చూస్తే క్షయవ్యాధి అని తేలింది. నాతోపాటు ఊర్లు తిరిగి, తిరిగీ తినీ తినకా గౌరవంగా సంసారం నెట్టుకొచ్చిన నేరానికి తనకా శిక్ష?

ఇహ ఆమెకు మందులతోపాటు బలమైన ఆహారం ఇవ్వాలనీ, ప్రతిరోజూ మాంసాహారం, గ్రుడ్లు, పండ్లు తప్పనిసరని డాక్టరు సలహా. పైగా మందులు ఒక్కరోజు కూడా ఆపరాదు అన్న నిబంధన. సుఖాల మాట దేముడెరుగు... నాతో కలసి జీవితమంతా బాధలు పడిన నా భార్య ఆరోగ్యం కూడా ముఖ్యం కద? అందుకే హొటలు హర్ష వాళ్ళను అభ్యర్థించాను... 'జీతం ఇవ్వకపోయినా బాధలేదు... రోజూ రెండు పూటలా ఒక మనిషికి కొంత మాంసాహార భోజనం ఇవ్వండి... చాలు!' అంటూ. పుణ్యాత్ములు అంగీకరించారు.

విధిలేక కష్టంమీద ఆ ఆహారం అలవాటు చేసుకోగలిగింది నా శ్రీమతి. ఇంటికి భోజనం ఇవ్వడమేకాదు, నా సాధారణ తిండి తిప్పలూ కూడా అక్కడే జరిగిపోనిస్తున్నారు హోటలువారు. పైగా జీతం కూడా ఇస్తున్నారు!" అన్నాడు రామదాసు.

రెండేళ్ళలో రాయిలా రాటుదేలిపోయిన ఆ మనిషిని చూస్తూంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతడు నాకు బంధువో, స్నేహితుడో కాకపోవచ్చు... కానీ... అతడో మంచి వ్యక్తిత్వమున్న మనిషి. అతన్ని గూర్చిన అవగాహన వున్న నాకు అలాంటి వాళ్ళు ఈ సమాజానికి అవసరం అని తెలుసు.

"నేనేం తప్పుపని చేయడం లేదుకద! విధిలేని పరిస్థితులలో దొరికిన పనిచేస్తూ నా కుటుంబాన్ని రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నాను. అది నా ధర్మం కద?" అన్నాడతడు నా బాధను గమనించి.

నేను మౌనం వహించాను.

"ఇంతకూ తమరెవరు బాబూ? అలవాటులేని మాంసాహార వంటకాలు వడ్డించి వడ్డించి ఆకలే చచ్చిపోయిన నా కడుపుకు అమృతంలా ఫ్రూట్ సలాడ్, జ్యూస్‌లు అందజేశారు. 'అమృత ప్రదాతా సుఖీభవ' అని అశీర్వదించడం తప్ప ఏమీ చేయలేని స్థితినాది. ఎంత ఆలోచించినా మీరెవరో స్ఫురణకు రావడం లేదు!" అన్నాడు రామదాసు.

ఎన్నో బాధలు పడిన, పడ్తున్న అతని జ్ఞాపకశక్తి క్షీణించడంలో పెద్ద విశేషం ఏముంది? పైగా అతడు నన్ను చూసింది మూడు నాలుగు సార్లే... అదీ... ఆరేడు సంవత్సరాలకు మునుపు.

"నేనెవరో తరువాత చెపుతాను కానీ నేను మళ్ళీ మిమ్మల్ని ఓసారి కలుసుకోవాలి.. నన్ను నమ్మి మీ ఇంటి చిరునామా ఇస్తారా?" అన్నాను.

"దానికేం భాగ్యం... తీసుకోండి..." అన్నాడతను నొచ్చుకుంటూ.

అతని ఇంటి చిరునామా వ్రాసుకుని భారమైన మనసుతో కదిలివెళ్ళి రైలెక్కాను.

* * *

వృత్తిరీత్యా కాంట్రాక్టరునయిన నాకు రామదాసు పనిచేసిన డిపార్టుమెంటుతో కొద్దో, గొప్పో పరిచయాలున్నాయి. అందువల్ల మావూర్లో వున్న వాళ్ళ కార్యాలయంలో పనిచేసే పరిచయస్తుడు సుబ్బరాజును కలిశాను.

సుబ్బరాజుకు రామదాసు తెలియదు. కానీ అతన్ని గూర్చి నేను చెప్పిందంతా వినగానే చలించిపోయాడు.

“ఇలాంటి కేసులు లోకాయుక్తాలో వేస్తే తప్ప ఒక కొలిక్కి రావు. అసలు అతనెప్పుడో ఆ పనిచేసి ఉండాల్సింది!” అన్నాడు.

లోకాయుక్తాకు ఎలా అప్పీలు చేసుకోవాలో వివరంగా సుబ్బరాజును అడిగి తెలుసుకున్నాను. సుబ్బరాజు కొంత ఆర్థిక సహాయంకూడా అందిస్తానన్నాడు కానీ రామదాసు మనస్తత్వం బాగా తెలిసిన నేను అందుకు అంగీకరించలేదు.

నా చిన్ననాటి మిత్రుడు లాయర్ గోపీని కలసి విషయమంతా వివరించాను.

“ఇలాంటి కేసులలో సెటిల్‌మెంటు అయి డబ్బు చేతికందాక టెన్ టూ ఫిఫ్టీన్ పర్సెంట్ తీసుకుంటాము. కానీ రామదాసును గూర్చి నీవు చెప్పింది విన్నాక ఈ పనిని ఉచితంగా చేసి పెట్టాలనుంది. అయితే అతడు ఉచితాన్ని అంగీకరించ డంటున్నావు కాబట్టి టూ పర్సెంట్ తీసుకుంటాను!” అన్నాడు గోపి.

* * *

నా వర్షన్ అంతా విన్న తర్వాత...

“అయినా అన్నేండ్లు అన్నం పెట్టిన సంస్థకు వ్యతిరేకంగా లోకాయుక్తాకు ఎలా వెళ్ళను?” అంటూ నిరాసక్తత వ్యక్తపరిచాడు రామదాసు.

అయితే నేను పట్టుదలగా అతని భార్యా పిల్లలకు వాస్తవాలను వివరించి వారితో కలసి రామదాసును ఒప్పించగలిగాను.

ఎట్టకేలకు రామదాసును మావూరు తీసుకువెళ్ళి గోపీని పరిచయం చేసి, రామదాసు దగ్గర ఉండిన రికార్డ్సు, ఇతర డీటెయిల్స్ అన్నీ అతనికి ఇప్పించాను.

తరువాత...

మొట్టమొదట రామదాసు బదిలీలమీద పనిచేసిన ప్రతి కార్యాలయానికీ రామదాసు పేరిట రిక్విజిషన్లు వెళ్ళాయి.

సహజంగానే ఎక్కడా యే చలనమూ కన్పించలేదు. అందువల్ల ఆపై అడ్వకేటు గోపీ ద్వారా అన్ని కార్యాలయాలకూ లాయరు నోటీసులు అందాయి. అయినా అప్పటికీ ఎక్కడా యేకాస్త కదలికా కన్పించలేదు.

ఇహ చివరికి రామదాసు కేసు లోకాయుక్తకు చేరి అడ్మిట్ అయిపోయింది.

ఎనుము మీద వాన కురిసిన చందాన అప్పటికీ ఆ ఆఫీసులలో లోకాయుక్త తాకీదులమీద పెద్దగా స్పందన కలుగక పోవడంతో వ్యవహారాన్ని వేగవంతం

చెయ్యాలనీ మూడు నెలలలోగా రామదాసు పనిచేసిన ప్రతి కార్యాలయం నుండీ కూడా రికార్డులు తెప్పించుకుని అతని సర్వీసు రిజిష్టరు రీ బిల్ట్ చెయ్యాలనీ అతనిమాతృ కార్యాలయానికి ఆర్డరు వేసింది లోకాయుక్త. అయితే ఆరు నెలలు గడచిపోయినా ఆ పని పూర్తికాకపోవడంతో రామదాసు మాతృ కార్యాలయానికి చెందిన మేనేజరును సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది లోకాయుక్త.

దేవుడికయినా దెబ్బే గురువు అన్నట్లుగా రామదాసు పని ఊపందుకుంది.

లాయరు గోపీ కూడా చాలా శ్రద్ధ తీసుకుని రామదాసు పనిచేసిన ప్రతి వూరికీ వెళ్ళి అక్కడి అధికారులను కలసి పని వేగవంతం అయ్యేలా చూసివచ్చాడు.

ఆలోగా టైంబౌండుతో మళ్ళీ లోకాయుక్త తాకీదులు పంపడంతో త్వరలోనే రామదాసు సర్వీసు రిజిష్టరు కాపీ తయారయిపోయింది.

మొదట ఆర్జిత సెలవు నగదు రూపేణా అందడంవల్ల రామదాసుకు కొంత ఆర్థిక వెసులుబాటు లభ్యమైంది. ఆ వెంటనే ప్రావిడెంటుఫండు మొత్తం అందడంతో అతడు తన భార్యను మెరుగైన వైద్య సౌకర్యం కోసం మంచి ఆస్పత్రిలో చేర్చాడు.

అటూ ఇటూ ఆర్నెల్లు గడిచాక అతనికి రావాల్సిన మొత్తం అంతా దాదాపు పదిహేను లక్షల దాకా చేతికిందపోవడం, ఫెన్షన్ స్థిరీకరింపబడడం జరిగిపోయాయి. రామదాసు జీవితం మళ్ళీ మెయిన్‌లైన్‌లోకి వచ్చేసినట్లయింది.

✶ ✶ ✶

లాయర్ గోపీ తన మాట మేరకు ఖర్చులు కాక రెండు శాతం డబ్బే తీసుకున్నాడు రామదాసు నుండీ.

“మీరెవరో నాకు గుర్తురావడం లేదు… మీరూ చెప్పడం లేదు!! దేవుడు పంపిన దూతలావచ్చి, ఆత్మబంధువులా సహాయపడి చీకటిలో పడిపోయిన నా జీవితాన్ని మళ్ళీ వెలుగులోకి లాగారు. మీ ఋణం ఎలా తీరుతుందో తెలియదు!” అన్నాడు రామదాసు నా చేతులు పట్టుకుని.

“మీ నోటిగుండా ‘ఆత్మబంధువు’ అన్న మన్నన వచ్చింది నా పట్ల. అదిచాలు. ఈ దేశానికి మీలాంటి మనుషుల అవసరం చాలా చాలా ఉంది. కాబట్టి మీ ఆరోగ్యాన్ని, భావాల్ని జాగ్రత్తగా పదిలపర్చుకోండి. మీ పిల్లల ద్వారా కూడా సమాజానికి అందించే ప్రయత్నం చెయ్యండి!” అన్నాను మనస్ఫూర్తిగా.

"ఏమిటి అతని ప్రత్యేకత? నీవు ఆ రోజు యేదో చెప్పావు కానీ నాకు సరిగ్గా గుర్తులేదు!" అన్నాడు గోపీ రామదాసు వెళ్ళిపోయాక.

నేను చిన్నగా నవ్వి రామదాసుతో నా స్వల్ప పరిచయాన్ని నెమరువేసుకున్నాను.

* * *

దాదాపు ఏడేళ్ళ క్రితం...

పెండింగ్‌లో పడిపోయిన తన కాంట్రాక్టు బిల్లును త్వరగా సాధించి పెట్టమని నా మిత్రుడు కాంట్రాక్టర్ రవిశంకర్ నన్ను అభ్యర్థించడంతో ఘటోత్కచపురం వెళ్ళాను.

డబ్బుతో మనుషుల్ని, కాగితాల్ని కదిలించడం కూడా ఒక ఆర్టు! ఆ కళ నాలో చాలానే వుంది!!

ఒక చుట్టు చుట్టి పని సానుకూలం చేసుకోగలిగాను.

చకచకా ప్రిపేరయిపోయిన బిల్లు నాలుగు టేబుల్లు, రెండు గదులు దాటి అకౌంటెంటు గదికి చేరుకుంది.

"అతని కథ ఏమిటి?" అని ప్రశ్నించాను.

"గంటలో చెక్‌రెడీ అయి మీ చేతిలో పడ్తుంది సార్!" అన్నారు.

నేను ఆశ్చర్యపోయాను.

"ఆయనకేమిటి సార్, నిప్పులాంటి మనిషి! అలాంటివి ఆశించరు, కనీసం కంటితోకూడా చూడరు!! మీ మిత్రుడిచ్చిన ఆథరైజేషన్ కూడా అప్రూవ్ అయింది కాబట్టి అరగంటలో చెక్ రడీ అయి సంతకాలు కాగానే మీ చేతుల్లో పడుతుంది!"

నాకు ఆశ్చర్యం కలిగింది!

కానయితే నమ్మకమే కలుగలేదు!!

అందుకే ఆయనను కదిలించాను. తనేం మాట్లాడకుండా చెక్ నా చేతుల్లోపెట్టి ఇహ వెళ్ళండి అన్నట్లుగా నమస్కారం పెట్టేశాడు.

నేను వచ్చిన పని పూర్తయిపోయినా అతన్నలా వదిలేసి వచ్చెయ్యడానికి మనస్కరించలేదు.

'కృతజ్ఞతలతో – రాజారావు' అన్న ఓ చిన్న స్లిప్‌కు రెండు వెయ్యిరూపాయల నోట్లు జతచేసి కవర్లో వుంచి అతడలా వెలుపలికి వెళ్ళినప్పుడు రహస్యంగా అతని బీరువాలోకి విసిరేసి దర్జాగా వచ్చేసి బస్సెక్కాను.

తరువాత త్వరలోనే ఆ విషయం మరచిపోయాను.

మూడు నెలల తరువాతనుకుంటాను... నా పేరిట ఓ రిజిష్టర్డు కవరు వచ్చింది.

అది కాస్తా ఘటోత్కచపురంలోని ఆ ఆఫీసులో అకౌంటెంటు రామదాసు నుండీ వచ్చిన కవరు.

కవరులో నా పేరిట పంతొమ్మిది వందల రూపాయలకు ఓ డిమాండు డ్రాఫ్టు, ఓ ఉత్తరం ఉన్నాయి.

ఆ ఉత్తరంలో ఇలా వ్రాసి వుంది...

రాజారావుగారూ,

కృతజ్ఞతలతో మీరు రెండువేల రూపాయలు నా బీరువాలో పడవేసి వెళ్ళారు. ఆ బరువును మోస్తూ మీ చిరునామా తెలుసుకోవడానికి ఇన్నాళ్ళు పట్టింది.

నా విధులను నేను సక్రమంగా నిర్వహించినందుకు నాకు ప్రజల సొమ్ముతో ప్రభుత్వం మంచి వేతనాన్నిస్తోంది. కాబట్టి మీరు నామీద జాలిపడి నాకు డబ్బు ఇవ్వడంలో అర్థం లేదు. దయచేసి ఇలాంటి వాటిని ప్రోత్సహించకండి.

మన సమాజం, దేశం అత్యున్నతంగా ఎదుగుదల చెందాలంటే ప్రతిమనిషీ తన శీలసంపదను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇహపోతే నా బీరువాలో మీరు వేసివెళ్ళిన రెండువేల రూపాయలలో వంద రూపాయలను డి.డి. కమీషన్ నిమిత్తం మరియు రిజిష్టరు పోస్టు నిమిత్తం ఉపయోగించి తతిమ్మా పంతొమ్మిది వందలను మీకు పంపుతున్నాను. మీ సొమ్మును మీరు స్వీకరించి సద్వినియోగపరచండి.

మన రైతురాజ్యంలో జానెడు నేలను నమ్ముకుని మూరెడు ఆశలతో, బారెడు అప్పులతో బ్రతికే బడుగు రైతు బ్రతుకులు బాగుపడాలి. అందుకోసం అందరం ఆలోచించాలి. అంతేకాదు... ఆకలి, పేదరికం, అనారోగ్యం, ఆక్రోశం, అకాల మరణాలు, హింస, అభద్రతాభావం మొదలైనవి కన్పించని, నీడనిచ్చే పచ్చని చెట్లతో నిండిన ప్రశాంత సమాజం మనకు అత్యవసరం. అందుకోసం మీలాంటి ఉత్సాహవంతులు కృషిచెయ్యాల్సిన అవసరం ఎంతయినా వుంది.

ఎక్కడైనా, ఎప్పుడైనా నమాజును విన్న హిందువులు సామవేద పఠనాన్ని మననం చేసుకుని పులకించాలి!

అదే విధంగా సామవేద పఠనాన్ని విన్న మహమ్మదీయులు నమాజును స్మరించుకుంటూ ఆనందించాలి!!

అలా... అలా అన్ని మతాల మార్గం ఒక్కటే అని మనిషి గ్రహించగలగాలి. పగ ద్వేషాలు కన్పించని ప్రేమమయమైన, వాత్సల్యపూరితమైన ఉత్తమ సమాజ నిర్మాణం జరగాలి.

ప్రేమ తప్ప మరొకటి తెలియని ప్రపంచం కోసం మీలాంటి వారందరూ ప్రయత్నిస్తారని ఆశిస్తూ...

భవదీయుడు
రామవరపు రామదాసు

* * *

నా జ్ఞాపకాలను విన్న గోపీ అదోలా అయిపోయాడు.

"మనం ప్రపంచాన్ని ప్రేమించడం మరచిపోతున్నాం, మన కాళ్ళు మనం నరుక్కుంటున్నట్లుగా ప్రకృతిని ధ్వంసం చేసేస్తున్నాం... సరిగ్గా మన ఆలోచనలు ఆగిపోయినచోట రామదాసు ఆలోచనలు ప్రారంభమవుతున్నాయి!" అన్నాను.

"రామదాసుకు ఎప్పుడు ఏ అవసరం కలిగినా నన్ను కలవమని చెప్పు" అన్నాడు గోపి మనస్ఫూర్తిగా.

"అతనికి ఏ అవసరమూ ఉండదనుకుంటాను. అతని కుమార్తెకు వివాహం చేసెయ్యవచ్చు... కుర్రవాడి చదువూ పూర్తయిపోతుంది. తనూ, తన శ్రీమతీ జీవించడానికి ఫెన్షన్ ఉండనే ఉంది కద? బహుశా ప్రపంచానికే అతని అవసరం ఉంటుంది ఎప్పుడూనూ!!" అన్నాను. ✪

***రచన కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికయిన కథ, రచన మే 2012***

# చద్దిపెట్టి

**"ఇం**కొక్క వెయ్యి రూపాయలు చేర్చుకుంటే చాలండీ... మంచి కంపెనీదే, క్రొత్తదే తెచ్చుకోవచ్చు!" అంది సౌజన్య.

తన చిరకాలవాంఛ... కాదు కల... త్వరలో నెరవేరగలదన్న ఆశ ఆ క్షణాలలో ఆమె కళ్ళలో కాంతులీనుతూ కన్పించింది.

నిజమే! సౌజన్య, నేనూ... ఇద్దరం కలసి రూకా, అర్ధగా పొదుపుచేస్తూ పదకొండు వేలరూపాయలు కూడగట్టడానికి దాదాపు మూడున్నర సంవత్సరాల కాలం పట్టింది మరి.

పెద్దల ఆస్థిలో ఏకాస్తయినా భాగమివ్వకుండా మోసంచేసి అన్యాయంగా అన్నయ్య కాజెయ్యడంవల్ల చిన్నవయసులోనే ఒక రకంగా బజార్నపడ్డవాణ్ణి నేను. ఓ మర్యాదస్తులైన యజమానుల లాడ్జిలో మేనేజరుగా నాకు ఉద్యోగం లభ్యమవడం ఏ జన్మలోనో నేను చేసుకున్న అదృష్టం. ఇరవయి నాలుగు గంటలు డ్యూటీ తరువాత ఇరవయి నాలుగు గంటలు విరామం. ఇద్దరు మేనేజర్లుండడంవల్ల నిజానికయితే నెలకు డ్యూటీ చేసేది పదిహేనురోజులే! కానయితే జీతం తక్కువ!!

ఎగువ మధ్య తరగతికి చెందిన వాడయినా నారాయణప్ప తన కుమార్తెను గొప్పవాడికి ఇచ్చి వివాహం జరిపించలేక తనంత తాను దిగివచ్చి దిగువ మధ్య తరగతి స్థితిగాడ్నయిన నా కాళ్ళు కడిగి కన్యాదానం చేశాడు. సౌజన్య ఉత్తమ ఇల్లాలు కాబట్టి గుట్టుగా నెట్టుకొస్తోంది సంసారం. సంస్కారవతీ, గుణవతీ, అనుకూలవతీ అయిన తను నా జీవితంలోకి ప్రవేశించాక చాలా నిశ్చింతగా సాగిపోతోంది నా జీవితం.

లాడ్జిలో గదులు ఖాళీచేసి వెళ్ళే వారిలో కొందరు మారాజులు కొద్దో గొప్పో బక్షీస్ ఇచ్చివెళ్తుంటారు నాకు. కంపెనీల ఏజంట్లు, మెడికల్ రిప్రజెంటివ్‌లు బసచేసినప్పుడు వారివారి కంపెనీల శాంపిల్స్ ఇచ్చి వెళ్తుంటారు... అవన్నీ చన్నీళ్ళకు వేణ్ణీళ్ళు తోడుగా నా సంసార నావకు ఉపకరిస్తున్నాయి.

జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుతున్న నా పిల్లలు చదువులో అత్యంత ప్రతిభను కన్పరుస్తూ పేరున్న కార్పొరేట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు దీటుగా మార్కులు తెచ్చుకుంటున్నారు. ఉన్నదాంట్లోనే భార్యాపిల్లల్ని చూసుకుంటూ చక్రవర్తి లెవల్లో

ఆనందాన్ననుభవిస్తున్న నాకు నాలుగేళ్ళక్రితం జరిగిన ఓ సంఘటన గుండెల్లో ముల్లులా గుచ్చుకుని నన్ను నేలమీదికి... కాదు... పాతాళానికి దింపింది.

మేం అద్దెకున్న ఇంటి లోగిలిలో ఉన్న ఇరుగుపొరుగులందరూ కొద్దోగొప్పో కడుపు నిండిన వాళ్లే... కొందరయితే బాగా బలిసినవాళ్ళూ ఉన్నారు. అయితే అన్ని కుటుంబాలవారూ సౌజన్యతో స్నేహంగా, ప్రేమగా ఉంటారన్నది మాత్రం వాస్తవం.

మిగులు కూరలు, ఆహారపదార్థాలు వృధాకాకుండా ఎవరింట్లోనో ఒకరింట్లో ఫ్రిజ్‌లో వుంచి మరునాడు తెచ్చుకునేది సౌజన్య. మా కుటుంబపు పొదుపులో అదో పెద్దభాగం నిజానికి. ఇరుగుపొరుగులు కూడా చాలారోజులుగా సహకరిస్తూనే ఉన్నారు ఆ విషయంలో.

ఓ రోజు మా లాడ్జి యజమాని ఇంట్లో ఏదో వ్రతం జరిగింది. వారు పెద్ద క్యారియర్ కట్టించి లాడ్జిబోయ్‌తో మా ఇంటికి పంపారు. అందువల్ల ఆ రోజు ఆహార పదార్థాలు చాలా ఎక్కువగా మిగిలిపోయాయి. వాటిని చెడిపోకుండా జాగ్రత్త చెయ్యడానికి గిన్నెలలో తీసుకువెళ్ళిన సౌజన్య దాదాపు నలభై నిముషాల తరువాత కళావిహీనమైన ముఖంతో అన్నీ వాపసు తీసుకు వచ్చేసింది.

ఎందుకో ఇరుగుపొరుగులందరూ వాటిని పదిలపరచడానికి వరుసగా తిరస్కరించారట. ఆనాడు అన్నీ ఎక్కువగా ఉన్నందున వారికీ ఇబ్బందిగా అన్పించి ఉండవచ్చు బహుశా. అసలు విషాదం అదికాదు... ఎవరో పరిహాసంగా ఏదో అన్నారు సౌజన్యను.

తను నిండుకుండ... విషయం అయితే చెప్పలేదు కానీ... "ఎలాగయినా ఒక సెకండ్ హ్యాండ్ ప్రిజ్ అయినా కొనుక్కోవాలండీ మనం" అంది చప్పిడి ముఖం వేసుకుని.

మా పెళ్ళయ్యాక అన్నేండ్లకు తను నన్ను కోరిన మొట్టమొదటి భారీ కోరిక అదే కావచ్చు బహుశా.

"కొన్నాళ్ళు ఓపికపట్టు సౌజన్యా... కొంత పొదుపుచేసి కొత్తదే తీసుకుందాము!" అన్నాను అనునయంగా.

ఆ మరుసటిరోజే కార్యాచరణలోకి దిగాను...

మెట్లక్రింద తుప్పుపడుతున్న మా నాన్నగారి జ్ఞాపకం... రాబిన్‌హుడ్ సైకిలును తీసుకువెళ్ళి ఓ సైకిలుషాపులో ఆయిలింగ్ చేయించుకుని బాగుచేసుకున్నాను. కొత్త సైకిలులాగే స్మూత్‌గా పరిగెడుతోంది అది.

అదివరకు డ్యూటీకి బస్‌లో వెళ్ళేవాణ్ణి... వెళ్లడానికి నాలుగు రూపాయలు, మరునాడు ఇంటికి తిరిగి రావడానికి నాలుగురూపాయలు... మొత్తం ఎనిమిది రూపాయలు బస్సుకు ఖర్చయ్యేది. వెళ్ళగానే ఓ టీ తెప్పించుకుని త్రాగేవాణ్ణి... అదో రెండ్రూపాయలు... అదీ మానుకున్నాను. పై రెండు ఖర్చులు ఆదా చెయ్యడం ద్వారా నెలకు వందా ఏభయి రూపాయలు మిగలసాగాయి.

సైకిలు త్రొక్కడం అనేది శ్రమతో కూడుకున్న పనయినా శరీరం తేలిక పడసాగింది క్రమంగా! ఆరోగ్యం రెట్టింపవసాగింది!!

లాడ్జిలో దిగే కష్టమర్లు ఎవరో ఒకరు నాకు నా కేబిన్‌కే కాఫీనో, టీనో పంపుతుండేవారు కాబట్టి నా రెండ్రూపాయల ఆదా కూడా కష్టమైంది కాకపోయింది నిజానికి. నన్ను చూసి సౌజన్య కూడా చిన్నచిన్న పొదుపులు మొదలుపెట్టింది. బ్యాగుల అల్లకం నేర్చుకుని తనూ చిన్నచిన్న మొత్తాలను సంపాదించడం కూడా నేర్చుకుంది. అందువల్ల మా కుటుంబానికి కాస్త వెసులుబాటు కలిగింది.

మమ్మల్ని చూసి మా పిల్లలు సైతం శెలవులలో అగ్గిపెట్టెల ఫ్యాక్టరీకి పుల్లలు పేర్చడంలాంటి చిన్న చిన్న పనులు చెయ్యడం మొదలుపెట్టారు.

అలా పోగయ్యింది కొంత మొత్తం! దాంతో సౌజన్య కళ్ళలో కొత్తవెలుగు.

* * *

సౌజన్య కళ్ళలో ఆ కాంతి చూశాక ఇంకా అట్టే ఆలస్యం చెయ్యరాదనిపించింది.

మరునాడే జీవితభీమా సంస్థకు వెళ్ళాను.

నా పాలసీమీద అదివరకే ఒక పర్యాయం ఋణం పొంది వున్నాను. ఎక్కువకాలం గడవకపోయినా సెకండ్ లోన్‌గా రెండువేల రూపాయలు అందించారు ఆ కార్యాలయం వారు.

* * *

నా శ్రీమతి తాలూకు చిరకాల కోరిక నెరవేరింది.

అందమైన ఫ్రిజ్, కనులకింపైన కలర్‌తో, తలుపుమీద కళాత్మకమైన లతల చిత్రంతో రిక్షామీద మా ఇల్లుచేరి నట్టింట్లో ఠీవిగా నిలబడేసరికి మా చిన్న ఇంటికే ఒక అందమైన కళ వచ్చేసింది.

ఫ్రిజ్‌కు పూజచేసి, ఎన్నో సంవత్సరాలుగా సహకరించిన ఇరుగుపొరుగు ముత్తైదువలందరినీ పిలచి తాంబూళాలు ఇచ్చింది సౌజన్య.

నేనారాత్రి ఆనందంగా, తృప్తిగా నిద్రపోయాను.

* * *

ఇప్పుడు మా ఇంట్లో ఫ్రిజ్ వుంది.

ప్రతిరోజూ పక్క ఇండ్లకు వెళ్ళాల్సిన అవసరం సౌజన్యకు లేదిప్పుడు.

కాయగూరలు పాడవడంలేదు... ఆహారపదార్థాలు సరేసరి... ఎంతో కొంత పొదుపు జరుగుతూనే ఉంది ప్రతిరోజూ.

కానయితే ఇదివరకు ఈరోజు మిగిలిన కూరలను ఇరుగుపొరుగుల ఫ్రిజ్‌లలో ఉంచి రేపు మాత్రమే తినేవాళ్ళం... ఇప్పుడలా కాదు ఏ కాస్త ఎక్కువ మిగిలినా ఒక్కోసారి రెండుమూడురోజులు కూడా తింటున్నాం... రుచీపచీ లేకుండా.

చక్కగా చల్లగా కూల్‌వాటర్ త్రాగుతున్నాము ఇంటిల్లిపాదీ. పాలు మిగిలినప్పుడు ఐస్‌క్రీం, పాలు విరిగిపోయినప్పుడు ప్రిపేర్డ్ జున్ను కూడా రుచికరంగా తయారుచేసు కుంటున్నాము. స్వీట్స్ ఏదయినా చేసుకున్నప్పుడు, తెచ్చుకున్నప్పుడు... లేదా ఎవరైనా ఇచ్చినప్పుడు ఫ్రిజ్‌లో దాచుకుని ఇష్టంగా తింటున్నాం.

ఎటొచ్చీ పిల్లలిద్దరికీ గొంతులు బొంగురుపోవడం, నొప్పి రావడం జరుగుతోంది. అప్పుడప్పుడు టాన్సిల్స్ కన్పిస్తున్నాయి కొత్తగా. సౌజన్యకు కూడా తరచు జలుబు చేస్తోంది.

అయితే అన్నింటికన్నా పెద్ద విషాదం యేమిటంటే...

ఇంటియజమాని అద్దెకొంత పెంచేశాడు ఫ్రిజ్‌ను చూశాక!

కరంటు బిల్లు కూడా బాగానే పెరిగింది!!

ఇదివరకు లేని వైద్యఖర్చులు సైతం కొద్దికొద్దిగా తరచు ఎదురవుతున్నాయి...

చద్దిపెట్టెను చూసి ఆనందించాలో, బాధపడాలో తెలియని అయోమయ పరిస్థితి నాదిప్పుడు. ✪

*'జాగృతి' కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ – జాగృతి వారపత్రిక **21-5-2012***

# విలువ

**గు**ప్తా ఇంటి ముంగిట చెప్పులు వదుల్తూ, తనకన్నా ముందుగా వచ్చి కూర్చునివున్న శ్రీరాంకేసి చూసి నవ్వాడు రెడ్డి.

అయితే, ఎందుకో శ్రీరాం నవ్వలేదు. అతని ముఖంలో ఏదో నిరాశ కన్పించడమే కాదు, మనిషి కొంత ఆందోళన చెందుతున్నట్లుగా కూడా అన్పించింది రెడ్డికి. ఆ విషయాన్ని... అప్పుడే ప్రవేశించి, రెడ్డి చెప్పుల పక్కగా తన చెప్పులను వదుల్తున్న శాస్త్రి, ఇంట్లోంచి వరండాలోకి వచ్చిన గుప్తా కూడా గమించారు.

ఆ ఇంటికి అతి సమీపంలోనే, దాదాపు ఎదురుగా... వేల సంవత్సరాలనాటి ప్రాచీన దేవాలయం ఉంది. ఆలయంలోకి వెళ్ళేవారు స్టాండులో చెప్పులు వదిలితే, రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

ప్రాచీన భావాలు గలవారున్న ఊరది. పురాతన పద్ధతులు, సంప్రదాయాలతో నడిచే పెద్ద గ్రామం. పరమ ప్రశాంతంగా ఉండే ఆ ఆలయంలో కూర్చుని ప్రతి ఉదయమూ సాయంత్రమూ... రెండుపూటలా కొంత సమయం నిశ్చింతగా గడపడం ఆ నలుగురికీ అలవాటు. కానయితే ఆలయం తాలూకు పాదరక్షల గదిలో చెల్లించాల్సిన రుసుం తప్పించుకోడానికి శ్రీరాం, రెడ్డి, శాస్త్రి ముగ్గురూ... తమ తమ చెప్పులను గుప్తా ఇంటి వరండాలో వదలడం ఆనవాయితీ.

"ఏమిటలా ఉన్నావు? ఆరోగ్యం బాగులేదా?" ప్రశ్నించాడు గుప్తా... నలుగురూ కలసి ఆలయంకేసి బయల్దేరినప్పుడు.

"చెప్తా" క్లుప్తంగా అన్నాడు శ్రీరాం ముందుకు అడుగులేస్తూ...

అరవై ఏళ్ళ లోపున్న మిత్రులు వారు. ఆ నలుగురూ ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకుని వెలుపలికి వచ్చారు. కోనేటి ఒడ్డున వేపచెట్టు నీడన కూర్చున్నారు.

అప్పటికీ శ్రీరాం ముఖంలో ప్రశాంతత కన్పించలేదు. పైపెచ్చు మనిషి స్వల్పంగా కంపిస్తున్నట్లు కన్పించాడు.

"ఎందుకలా అశాంతిగా, కంగారుగా కనిపిస్తున్నావు?" ప్రశ్నించాడు శాస్త్రి.

రెడ్డి, గుప్తా కూడా ఆసక్తిగా చూశారు శ్రీరాంకేసి.

"చేసుకున్నవాళ్ళకు చేసుకున్నంత!" అంటూ భారంగా నిట్టూర్చాడతను.

"అసలేం జరిగింది? ఇప్పుడెందుకిలా ఉన్నావు? కొంచెం అర్థం అయ్యేలా చెప్పు" అన్నాడు రెడ్డి.

మరోమారు నిట్టూర్చి చెప్పడం మొదలు పెట్టాడు శ్రీరాం... "గత మూడేళ్ళలో ఎన్నోమార్లు మీరు నా గతం గురించి అడిగారు. ఏనాడూ నేనా విషయంగా నోరుమెదప లేదు. కానీ ఈ రోజు నేనున్న నిరాశలో అంతా చెప్పేయాలని అన్పిస్తోంది" అంటూ ఆగాడు ఓ అర నిమిషంపాటు.

మిత్రులు ముగ్గురూ ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు.

"ఒకప్పుడు దక్షిణాంధ్రదేశంలోని ఓ ఊళ్లో నేను 'బతకలేక బడిపంతులు' అన్నట్లుగా టీచరుపని చేస్తూ ఉండేవాడిని. చాలీచాలని జీతంతో నిరాశామయమైన మధ్య తరగతి జీవితాన్ని గడుపుతుండేవాడిని. నా భార్యాపిల్లలకు కడుపారా తిండీ, కంటికింపుగా దుస్తులు కూడా ఉండేవి కావు. 'బాగా బతకడానికి వీలుగా ఏదైనా చెయ్యాలి' అంటుండేవాడిని తరచుగా. చివరికి అప్పటి నా మిత్రులిద్దరు 'చీటీలు నడుపు' అంటూ సలహా ఇచ్చారు. వారిద్దరినీ కూడా భాగస్వాములుగా చేసుకుని నెలవారీ చీటీలు నడపడం మొదలుపెట్టాను.

ఈ దేశంలో బక్కవారికీ, బడుగువారికీ కరువా? వారి అవసరాలకు కరువా? అందువల్లే బడుగు, మధ్య తరగతులవారి పాలిట ఆశాజ్యోతి చీటీ! మా చీటీల వ్యాపారం క్రమంగా ఊపందుకుని, చిన్న చిట్‌ఫండ్ కంపెనీగా మారే దశ ఏర్పడింది. ఎప్పుడైతే అనుకున్న దానికన్నా రెట్టింపు వేగంతో అభివృద్ధి కన్పించిందో... అప్పుడే... నాలో స్వార్థం ప్రారంభమైంది! పొమ్మనకుండా పొగ పెట్టినట్లు చేసి, భాగస్వాములిద్దరినీ నా నుండి విడిపోయేలా చెయ్యగలిగాను. తర్వాత త్వరలోనే ఉద్యోగాన్ని వదిలిపెట్టి, సొంతంగా చిట్‌ఫండ్ కంపెనీ ప్రారంభించాను.

ప్రజలు గొర్రెలు. నన్ను నమ్మినంతగా ప్రభుత్వరంగ బ్యాంకుల్ని నమ్మలేదు! నేను ఆశపెట్టిన అధిక వడ్డీల కోసం అర్రులు చాస్తూ తమ సర్వస్వాన్నీ నా కంపెనీలో డిపాజిట్ చేస్తూ వచ్చారు. ఉద్యోగ విరమణ చెందిన వారంతా తమ జీవితకాలపు చివరి రాబడుల్ని నా కంపెనీలో దాచుకోడానికి ఆరాటపడ్డారు. ఒక్కరేమిటి... అందరికీ ఆదర్శంగా నిలిచిన నా కంపెనీ పాతికేళ్లపాటు కొనసాగుతూ వచ్చి కోట్లకు పడగెత్తింది. నాలో స్వార్థం సైతం పెచ్చుమీరిపోయింది.

నా పిల్లలు విదేశాలలో స్థిరపడ్డారు. నెమ్మదిగా నా కంపెనీలోని డిపాజిట్లన్నింటినీ నా పిల్లల పేరిట, నా పేరిట ఒక విదేశీ బ్యాంకు ఖాతాలలోకి బదిలీ చేస్తూ వచ్చాను నిశ్శబ్దంగా! నేననుకున్న పనంతా పూర్తయ్యాక, చిట్‌ఫండ్ కంపెనీ బోర్డు తిప్పేశాను. దివాలా తీసిందని ప్రకటిస్తూ పాపర్ సర్టిఫికెట్‌ని కోర్టులో దాఖలుపరచి, ఆ ఊరి నుండి అదృశ్యమైపోయాను. డబ్బుంటూ ఉండాలి కానీ, ఎప్పుడూ ఎక్కడా ఎవరికీ అందకుండా విలాసవంతమైన జీవితం గడపడం ఈ దేశంలో కష్టమైన పనికాదు! నేను ఆ పనే చేశాను!!

అయితే గొడవ సద్దుమణగడానికి చాలా కాలమే పట్టింది. ఆలోగా నేనూ నా భార్యా దేశంలోని అనేక రాష్ట్రాలలో పర్యటించి, చివరికి మారుమూలనున్న ఈ చిన్న ఊరికొచ్చాం. ప్రశాంతతను వెదుక్కుంటూ వచ్చిన మేం ఇక్కడే స్థిరపడ్డాం. నిజం చెప్పాలంటే, మూడు సంవత్సరాలుగా నేనూ నా భార్య చాలా ఆనందంగా జీవించామిక్కడ" అంటూ ఊపిరితీసుకోవడానికి ఆగాడు శ్రీరాం.

అతనెందుకో కొద్దిగా ఆయాసపడుతున్నట్టు కన్పించాడు మిత్రులకి. అతని నుదుటిమీద నుండి చెమట కారుతోంది.

మిత్రులు ముగ్గురికీ అతని పట్ల కొద్దిపాటి తేలికభావం కలిగింది మొట్టమొదటి సారిగా. కానీ మూడు సంవత్సరాలుగా తమ మధ్య నడచిన ఆత్మీయ స్నేహంవల్ల, అతడ్ని వెంటనే అసహ్యించుకోలేక పోతున్నారు. పైగా ప్రతిరోజూ ఉదయం, సాయం కాలం గుప్తా ఇంట్లో నలుగురూ కలుసుకుని ఆత్మీయంగా మాట్లాడుకుంటున్నారు.

ప్రాణానికి ప్రాణంగా ఉంటూ కలిసి ఆలయంలోకి వెళ్లి కూర్చుని గంటల తరబడి గడపడం వల్ల... మిగిలిన ముగ్గురూ శ్రీరాంని... వంచకుడిగా చూడలేక పోయారు ఆ నిమిషంలో!

"ప్రజల్ని ముంచి వస్తే వచ్చావు... నువ్వు ఇక్కడ ప్రశాంతంగానే ఉంటున్నావు కదా? మరి కోరి అశాంతిని ఎందుకు కొనితెచ్చుకుంటావు?" అన్నాడు రెడ్డి కాస్త అనునయంగా.

"నేను కొనితెచ్చుకోలేదు. ఆ ప్రజల ఉసురు తగిలింది!" అన్నాడు శ్రీరాం ఆయసపడుతూ. ఎందుకో అతని ముఖం ఎర్రబారుతోంది.

"ఎప్పుడు?"

"ఎక్కడ?"

"ఎలా? ఏం జరిగింది?"

ముగ్గురూ గబగబా ప్రశ్నించారు.

"ఆ చేత్తో పాపం చేస్తే, ఈ చేత్తో శిక్ష అనుభవించాలంటారు పెద్దలు! నిజం. నేను నా పేరిటా నా భార్యాపిల్లల పేరిటా కోట్లకొద్దీ డబ్బుని ఓ విదేశీ బ్యాంకులో దాచుకున్నాను కదా. ప్రస్తుతం కుప్పకూలిన ప్రపంచ ఆర్థిక పరిస్థితులవల్ల సంక్షోభం ఏర్పడింది. నేను డబ్బు దాచుకున్న విదేశీ బ్యాంకు కూడా పూర్తిగా అందులో కూరుకుపోయి దివాలా తీసింది. నేను దాచుకున్న డబ్బు మొత్తం పోయినట్లే! కుక్కకాటుకి చెప్పుదెబ్బ అన్నట్లుగా పెద్ద దెబ్బే కొట్టాడు దేవుడు!" అంటూ తను చెప్పదలచుకుంది అయిపోయినట్లుగా కళ్ళుమూసుకున్నాడు శ్రీరాం. ఆ వెంటనే కుడిచేత్తో గుండె పట్టుకున్నాడు! అతని శరీరమంతా చెమటలు పడుతున్నాయి.

"శ్రీరాం! శ్రీరాం!" అంటూ మిత్రులు కంగారుగా పిలిచారు.

అతను కళ్ళుతెరిచి నీరసంగా అన్నాడు "ఇది మరోసారి!"

"ఏది మరోసారి?" మరింత ఆశ్చర్యంగా ప్రశ్నించాడు రెడ్డి.

"ఇలా గుండెనొప్పి రావడం! మొదటిసారి వచ్చినపుడు డాక్టరు ప్రమాదం లేదన్నాడు. మొదటిసారి హార్ట్ఎటాక్ వచ్చిన వారిలో పలువురు తప్పక బతుకుతారన్నాడు. ఫస్ట్ ఎటాక్ 'జాగ్రత్త' అని హెచ్చరిస్తుందనీ చెప్పాడు. ఆయన అన్నట్లే బతికి బయటపడ్డాను. ఆ మధ్య కాలంలో మళ్ళీ వచ్చింది. అది రెండోసారి. రెండో అటాక్‌లో కూడా కొందరు గండం గడచిగట్టున పడతారన్నాడు డాక్టర్. అలాగే నేనూ ఒడ్డున పడ్డాను. 'బీ రెడీ' అంటుందట రెండో అటాక్. నేను విల్లు రాసి సిద్ధపడే అవకాశం లేదు. ఎందుకంటే గతంలో పాపర్ సర్టిఫికెట్ దాఖలు చేశాను కాబట్టి! అందుకే నా పేరిట ఉన్నది కూడా నా భార్యా పిల్లల పేరిట బదలాయించాలని అనుకున్నాను. కానీ ఇంతలోనే ఆ బ్యాంక్ కుప్పకూలిపోయింది. ఇక ఈ మూడో గుండెపోటుతో నేను వెళ్ళిపోతానేమో?'' అన్నాడు శ్రీరాం ఆయాసపడుతూ, మాటలు కూడబలుక్కుంటూ!

"అయ్యో, అలాగా. ఉండు. నేను వెళ్ళి తక్షణం జాట్కా బండి తీసుకువస్తాను... డాక్టర్ దగ్గరికి వెళ్దాం" అన్నాడు రెడ్డి కంగారుగా లేచి నిలబడి.

"ఒద్దు రెడ్డీ! మూడో పోటు తొంభై తొమ్మిది శాతం మందిని వెంటదీసుకు పోతుందట! డాక్టరు ఏనాడో చెప్పాడు. నన్ను ఇప్పుడు నా భార్య వద్దకు తీసుకువెళ్ళండి. చూసి... పోతాను!" అన్నాడు శ్రీరాం. అంటూనే కోనేటి మెట్టుమీదికి ఒరిగిపోయాడు!

అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయని తెలియడానికి ఐదారు నిమిషాలు పట్టింది... మిత్రులకి!

రెడ్డి ఎవరితోనో శ్రీరాం భార్యకు, వారి ఇరుగుపొరుగుకు కబురు పెట్టాడు.

కాస్సేపట్లోనే శ్రీరాం భార్య సుమతి, వారి ఇంటి తాలూకు యజమాని ప్రభు, మరికొందరు కోనేటి మెట్ల దగ్గరికి వచ్చేశారు.

సుమతి బిగ్గరగా శోకాలు పెట్టడం మొదలుపెట్టింది.

ఇరుగుపొరుగులు ఆమెను ఊరడించి, జరగాల్సింది చూడమన్నారు.

ఆలయ పూజారి సైతం... శవాన్ని త్వరగా తరలించాలనీ, ఆలయాన్ని శుద్ధి చేసుకోవాల్సి ఉంటుందనీ చెప్పాడు.

శరీరాన్ని జట్కా బండిలో ఇంటికి తరలించాలని సుమతి అనగానే ఇంటి యజమాని అభ్యంతరం చెప్పాడు... "కొత్తగా కట్టిన ఇల్లు తల్లీ అది! అందులోకి శవాన్ని తరలించడానికి మా పద్ధతులు, ఆచారాలు ఒప్పుకోవు" అనేశాడు నిర్దాక్షిణ్యంగా.

అప్పుడిక చేసేది లేక సుమతి... శ్రీరాం మిత్రులను అర్థించింది.

తమ పిల్లలు వెలుపలి దేశాల నుండి వచ్చేవరకూ, ఎవరింటి వరండాలోనైనా శవాన్ని ఉంచడానికి అనుమతించాలని వేడుకుంది.

"క్షమించండమ్మా! పరాయి శవాన్ని మా ఇంట ఉంచడానికి శాస్త్రం అంగీకరించదు" అన్నాడు శాస్త్రి.

"మాకైనా... అదే సమస్యమ్మా! మావాళ్ళూ అంగీకరించరు" అన్నాడు రెడ్డి బాధని అభినయిస్తూ.

"క్షమించాలి చెల్లెమ్మా! జీవం ఉన్నప్పుడే శ్రీరాం మా మిత్రుడు! ప్రాణంపోయి కట్టెగా మారిన తర్వాత, నేను ఈ నిర్జీవ శరీరాన్ని మా ఇంట్లోకి అనుమతించలేను! కావల్సివస్తే పంచాయితీవారి సహకారమో లేదా వైద్యుని సహాయమో తీసుకుందాం. శవం పాడవకుండా ఉండటానికి మేం ప్రయత్నిస్తాం" అన్నాడు గుప్తా.

ఆ ముగ్గురిలో ఎవరికీ కూడా... కొద్ది నిముషాల క్రితం వరకూ తమతో మాట్లాడుతూ గడిపిన మిత్రుడు అతనేనన్న విషయం స్ఫురణలో లేదా సమయంలో! శవం తమ ఇంటివైపు మళ్ళకూడదన్న ఆలోచన మాత్రమే ఉంది!!

"దేవుడా!" అంటూ కుప్పకూలిపోయి రోదించింది సుమతి.

"నా భర్త నిర్జీవమైన చెప్పుల్ని ప్రతి రోజూ రెండుపూటలా తమ ఇంట్లో ఉంచుకున్నారీ ఆప్తమిత్రులు! వీరు సైతం ఆయన శరీరాన్ని ఇప్పుడు తిరస్కరిస్తున్నారు. జీవం కోల్పోయిన మనిషి శరీరం సున్నాకు దిగజారడమంటే ఇదేనా? ఈయన చేసిన పనులకు ఇప్పుడీ దుస్థితి వచ్చింది కాబోలు. అందుకే ఈరోజు ఈయన శరీరం పాదరక్షలకన్నా హీనంగా తిరస్కారానికి గురవుతోంది! విలాసవంతమైన నక్షత్రాల హొటళ్లలో గడిపిన శరీరమిది. ఇప్పుడిలా కింద చాపముక్కయినా లేకుండా ఈ కోనేటి గట్టున బండలమీద పడి ఉంది... ఓ భగవంతుడా!"

అక్కడ...

ఆమె రోదనకు అంతమంటూ కన్పించడం లేదు! ✪

*– వియోగి (కోపల్లె విజయప్రసాద్) ఆంగ్లకథ 'వాల్యూస్'కు టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి అనువాదం.*

*విపుల మాసపత్రిక, జూలై 2012.*

# వెన్నెల వానలో...

**తూ**ర్పున ఒకే ఒక వెలుగురేఖ... తను మొట్టమొదటగా వెలుపల పడే ప్రయత్నంలో భాగంగా లీలగా, అస్పష్టంగా గోచరిస్తోంది. చెట్లమీది పక్షులలోంచీ అక్కడొకటి, ఇక్కడొకటి కిలకిలా రావాలకు శ్రీకారం చుట్టడానికి తమ కదలికలను ప్రారంభిస్తున్నాయి.

వరుసగా నాలుగు రోజుల పాటు వర్షం పడి ఆగడం వల్ల ఆగి ఆగి వీస్తున్న ఈదురుగాలి వెన్నులోంచి వణకు పుట్టిస్తోంది. పైగా కాలిదారిలో వర్షానికి తేలిన రాళ్ళు అడపాదడపా అరికాల్లలో, వేళ్ల మధ్యనా గుచ్చుకుంటున్నాయి. కష్టానికి అలవాటు పడిన పాదాలు వాటిని భరిస్తుండగా, తలచుట్టమీద గంపలో ఉన్న పెద్ద చెంబులలోని పాలు తొనకకుండా, జాగ్రత్తగా కాలిదారిన తూర్పు దిక్కుకేసి నడుస్తున్న రంగప్ప భారంగా నిట్టూర్చాడు.

"ఎద్దు లేటింటీ పోనీ, బండి బాటింటే బోనీ... ఈసారి కలికిరి సంతలో సెప్పుల జతదెచ్చుకోవాల! ఆ!!" అని అనుకున్నాడు ఆపై మనసులో.

సరిగ్గా అదే సమయంలో అతని వెనుక నుండీ సైకిలు గంట శబ్దం విన్పించింది. రంగప్ప కాస్త పక్కకు తప్పుకోగానే సైకిలు క్యారియర్ మీద పాలక్యాను కట్టుకున్న తిమ్మరాయప్ప జోరుగా ముందుకు దూసుకుపోయాడు.

"సీ... ఎదవ బతుకాయె... దరిద్దరం బతుకు! ఓటి సైకిలయినా వొగటిగొనే యోగితి, బగిసి లేకపాయె... సైకిలుంటే రోజూ ఐదు మైలీలూ సల్లో సత్తూ నడిసి పేటలో పాలుబోసి మళ్లీ నడిసొచ్చే బాదుండదు గదా?" అని అనుకున్నాడు రంగప్ప మనసులోనే... చెప్పుల కొనుగోలు మాట తాత్కాలికంగా మరచిపోయి.

* * *

రంగప్ప వెంకటస్వామి పాలడిపో చేరుకునే సరికి ఎండ ఎగబడే ప్రయత్నాల్లో ఉంది.

"రోజూ నీవిలా ఆలస్యంగా పాలుతెస్తే నేనేసుకోను!" కోపంగా అన్నాడు వెంకటస్వామి రంగప్పను చూసి.

వెంకటస్వామి కోపగించుకోవడం, కొలతపాత్ర తీయకపోవడం కాస్త బాధ కలిగించాయి రంగప్పకు. ఎప్పుడూ మన్నుదిన్న పాములా మౌనం వహించే అతనికి ఆరోజు ఎందుకో చిర్రెత్తుకొచ్చింది. దాంతో...

"పాలు పోసుకుంటావా? పోసుకోవా?" విసుగ్గా అడిగాడు గంపదించి.

'పోసుకోకపోతే ఏం చేస్తావ్?' పరిహాసంగా ప్రశ్నించాడు వెంకటస్వామి... "మెత్తనివాడ్ని చూస్తే మొత్తబుద్దవుతుంది" అన్నట్లు... అతనికి రంగప్ప మీదెప్పుడూ చిన్న చూపే!

"ఆ కాడికీవూల్లో నీ డిపో వోటే ఉన్నట్లు... కూసింత బేగీ నడిసి, కాసింత దూరం బోయి అంకమ్మ డిపోలో పాలుబోసి పోతా!" అనేశాడు రంగప్ప కొంచెం కోపంగా...

మనసులోనే గతుక్కుమన్నాడు వెంకటస్వామి. కానీ పైకినవ్వేశాడు.

"అరె... మన రంగప్పక్కూడా కోపం దెలుసే?" అంటూ గబగబా రెండు లీటర్ల కొలత అందుకున్నాడు.

"నేను మనిషిని గానా?... సూత్తూనే ఉన్నా... నీ డిపోలో రోజూ పాలికో మాటంటున్నారు. లెక్క ధరమానికిత్తున్నట్టు!" అన్నాడు పాలుపోస్తూ.

"కోప్పడకు రంగప్పా... మీ ఊరివాడే కద తిమ్మరాయప్ప... పొద్దుపుట్టక మునుపే వచ్చి పాలుపోసి పోతాడు కద!" అన్నాడు వెంకటస్వామి.

"ఆడేమో సైకిలున్న మారాజాయె! నాకాడ కాళ్లు దప్ప ఇంగోటి లేదు గద?" అన్నాడు రంగప్ప ఆ పాటికి కాస్త స్థిమిత పడి.

* * *

పల్లెకు కాస్త ఎడంగా మామిడి తోపు పక్కకు విసిరేసినట్లున్న ఆ గుడిసెలో బుడ్డిదీపం తక్కువ కాంతితో వెలుగుతోంది.

దుప్పటి కప్పుకుని ముడుచుకుని పడుకుని మాగన్నుగా నిద్రలోకి జారుకోబోతున్న రంగప్పకు... ప్రతిరోజూ సైకిలుమీద తనను దాటుకుని వెళ్లడమేగాక, తిరిగీ ఎదురుకూడా వచ్చేస్తున్న తిమ్మరాయప్ప జ్ఞాపకానికి వచ్చేశాడు. ఆ వెనువెంటనే తనకూ, పాలడిపో వెంకటస్వామికీ మధ్య ఉదయం నడిచిన వ్యవహారం కూడా గుర్తుకు వచ్చింది.

రెండు నిమిషాలు ఆలోచించి ఆపై తలతిప్పి భార్యవైపు చూశాడు.

అలసిపోయిన వనలక్ష్మిలా అటువైపు తిరిగి నిద్రపోతున్న అతని భార్య కనువిందైన ఓ మంచి భంగిమలో కన్పించింది.

అతని చూపులకు అందమైన ఆమె ఒంపుసొంపులు కానీ, ఆకర్షణీయమైన నిగారింపులు గానీ ఆనలేదా సమయంలో… తన కళ్ళముందు సరికొత్త సైకిలు ధగధగా మెరిసిపోతూ కన్పిస్తున్నట్టుండడం వల్ల.

“ఏమే!” అంటూ భార్యమీద చేయేస్తూ పిలిచాడు కాస్త గట్టిగా.

“ఆ!” అంటూ నిద్రమత్తులోంచే పలికింది లక్ష్మి.

“మన ఎర్రావు నమ్మేసి ఓ సైకిలు దెచ్చుకుంటానే!” అన్నాడు రంగప్ప.

బాంబులా పేలినట్లయింది అతని మాట ఆమె మస్తిష్కంలో. నిద్రమత్తు వదిలిపోవడంతో దిగ్గున అతనివైపు తిరుగుతూ “యేందే?” అంది.

“మన ఎర్రావునమ్మేసి ఓ సైకిలు దెచ్చుకుంటానే!” అన్నాడు రంగప్ప మళ్లీ.

అతని మాటలు వెంటనే ఆమె బుర్రకెక్కలేదు. ఎందుకంటే… అతని ముఖంలో మెరుస్తున్న తెల్లని పలువరసతో అతని నవ్వు ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా, అంతు లేనంత ఆకర్షణీయంగా కన్పిస్తుంటుందామెకు. తక్కువ వెలుగునిస్తున్న ఆ బుడ్డి దీపం వెలుగులో ఆ నవ్వు ఆ సమయంలో మరింత మనోహరంగా కన్పించిందామెకు.

అందువల్ల నిద్ర కళ్లతో కొన్ని క్షణాలపాటు తదేకంగా అతని నవ్వు ముఖాన్నే చూస్తుండిపోయిన ఆమె అంతలోనే చిన్నగా ఉలికిపడి దిగ్గున లేచి కూర్చుంది చాపమీద. ఆమె నిద్రమత్తూ, భర్త నవ్వు తాలూకు మైమరుపూ… రెండూ చప్పున వదిలిపోయాయి.

“నీకిదేం దురుబుద్ధి పుట్టింది?… లచ్చిమీకరమైన గొడ్డునొగ్గేద్దామంటావు? పెద్దంత కరువులో కూడా నీకీ పాడుబుద్ధి పుట్టలేదే?” అంది కళ్లు పెద్దవి చేసి మహాకోపంగా చూస్తూ.

కోపంగా విప్పార్చుకున్న ఆమె కళ్ళు ఆ స్వల్ప దీపపు కాంతిలో మనోహరంగా మెరుస్తూ కన్పించాయి. అయితే ఆ మెరుపునూ, తళుకునూ ఆస్వాదించే స్థితిలో లేడు రంగప్ప.

“రోజూ ఐదు మైలీలు సలిలో నడిసి పేటలో పాలుబోసి మళ్లీ ఐదు మైలీలు నడిసి రాలేకసత్తున్నానే! ఆ గొడ్డా… సానా ఈతలు ఈనేసింది గదా?” అన్నాడు తన వాదన అందుకుంటూ.

“ఈ సలెన్నాళ్లుండేను? సలికి బయపడి దేవీగొడ్డున్దారబోసుకొందామా?” ఈ మాటలంటూండగా అంత క్రితమే మనోహరంగా మెరిసిన ఆమె కాటుక కాళ్లలో విషాదపు మబ్బులు కమ్ముకుని రెండు కన్నీటి చుక్కలు నక్షత్రాల్లో మెరిశాయి.

ఆమె కంటతడిచూసి అవాక్కయి పోయాడు అతడు.

"ఎన్నీత లీన్తేనేమి? లచ్చిమీ గొడ్డును పంచెదాటనిత్తామా?" మళ్లీ తనే అంటూండగా ఓ కన్నీటి చుక్క రాలిపోయింది ఆమె కంటి నుండి.

" ఆ పాడు సైకిలు నాకొద్దులేయే. నీవు కంట తడెట్టకే!" అన్నాడు రంగప్ప క్షీణస్వరంతో అశాంతిగా.

"అట్టాగన్నావు బాగుంది... ఆ పాలూ తగ్గితే దినాలెట్టా గడిసేను? ఏళ్లకాడికి వానలు బడక కచ్చాకూ, బుచ్చాకూ దొరికే కాలమూ గాకపాయె!" అంటూ చాపమీద వాలింది ఆమె.

అంత దూరం ఆలోచించలేక పోయిన రంగప్ప భార్య ముందు చూపుకు మురిసిపోతూ... "లచ్చిమీ!" అని పిలిచాడు లాలనగా.

"ఊ!" అందామె అటు దిరిగి పడుకునే

"కలికిరి సంతలో సెప్పుల జతైనా తెచ్చుకుంటానే!"

"నీకిప్పుడు సెప్పులజతకు జరూరొచ్చిందా? సిన్నోడి పలక బగిలిపోయి ఎన్నాళ్లాయె? పెద్దదాని బుక్కుల్సంచి సినిగిపోయి ఎన్నాళ్ళాయే?... ఆల్లూ దిన్నమ్మూ రెండు మైలీలు నడిసి గుట్టపాళెం బడికి బోయి సందేలకు నడిసొత్తున్నారు గద? ఎండాకాలంలో దెచ్చుకుందువులే సెప్పుల జత!"

"సీ, ఎదవ బతుకాయె!" అనుకున్నాడు రంగప్ప బాధగా.

"బాదొద్దు మామా! నీకు తెలీన్దేముంది? ఈ పారి రాలిన రాగ్గింజలు ఆరేదు నెల్లకూ సాలేట్టు లేవుగదా? ఇల్లు జేరాల్సిన బైరొడ్లూ అంతంత మాత్తరమే కన్పిత్తున్నాయి కంకుల మీద! అమ్మోరి దయబట్టి అప్పూ, సప్పూ సేయకుండా, బడాయిలకుబోకుండా బతికేటోళ్లం గాబట్టి సరిపోయింది!" అంది లక్ష్మి లాలనగా.

రంగప్ప బదులు సెప్పకుండా ఆమె అందమైన ముఖంకేసి చూశాడు.

"దిగులొద్దు మామా, సిన్న కర్రావు ఈనినంక పాడి ఎగుత్తుందిగద... పిల్లోల్ల గ్గావాల్సినవీ, నీగ్గావాల్సినవీ అన్నీ గొనవచ్చుప్పుడు!" అంది ఆమె అతనివైపు తిరిగి మనోహరంగా నవ్వి, మీద చెయ్యి వేసి కొంచెం ధైర్యాన్నిస్తూ.

ఆమె నవ్వు అతనికి అంతులేని ఆనందాన్ని కలిగించింది.

అసలా నవ్వు చూసే పడిపోయాడతడు... ఆనాడు! తను తొట్టతొలిసారి ఆమెను చూసిన ఆ రోజు మననానికి వచ్చిందతనికి...

* * *

మంచి నాట్ల అదునులో నంబరు నారు తక్కువ పడేసరికి... దొరుకుతుందని తెలిసి మరువ పల్లెకు వెళ్లి వస్తున్నాడు రంగప్ప.

గళ్ల చీర కట్టుకుని, గంప నెత్తిమీద పెట్టుకుని మడి దగ్గరకు కాబోలు అన్నం తీసుకుపోతూ వనకన్యలా భీమగానిపల్లె చెరువు కట్టమీద ఎదురయింది లక్ష్మిదేవి.

నీరెండలో నిగనిగ మెరుస్తున్నట్లున్న ఆమె మేని రంగునూ, ముఖంలోని కళనూ చూస్తూ చూపులు తిప్పుకోలేక పోయాడు. ఆమెను దాటి ముందుకు వచ్చేశాక కూడా వెనక్కి తిరిగి ఆమె ఒంటి సొంపులనూ, నిగారింపులనూ, కంటికింపైన కదలికలనూ చూస్తూ నిలబడి పోయాడు.

అతని ప్రపంచం చాలా చిన్నదే కావచ్చు... కానీ... తమ ఇలాకాలో కానీ, కలికిరిలో కానీ, పీలేరులో కానీ, వాయల్పాడులో కానీ చివరకి మదనపల్లెలో కూడా ఎప్పుడూ, ఎక్కడా అంతగా ఆకట్టుకున్న చిన్నది కన్పించి ఉండలేదతనికి. అందువల్ల అప్రయత్నంగా వెనుదిరిగి ఆమె వెంబడే అడుగు లెయ్యడం మొదలు పెట్టాడు.

అసలంత ధైర్యం ఎలా వచ్చిందో అతనికే తెలియదు.

అందమైన ప్రకృతి మధ్యన, ఆహ్లాదకరమైన వాతావరణంలో ముందు ఆమె... వెనుక రంగప్ప... అతనికి ఏదో మైకం కమ్మినట్లుగా ఉంది.

రెండు మూడు నిముషాలలోనే ఆమెకు అనుమానం కలిగింది. నడక ఆపి వెనుదిరిగి అతనికేసి కోపంగా చూసింది.

"పిల్లా... ఊరికేనే... నేనెల్లిపోతా... నేనెల్లిపోతా!" తడబడ్తూ అన్నాడు రంగప్ప నిలబడిపోయి భయం భయంగా చూస్తూ.

కానీ వెనక్కి తిరిగి వెళ్లిపోయే ప్రయత్నం మాత్రం చెయ్యలేకపోయాడు.

అతని భయం చూసి ఆమెకు నవ్వు వచ్చేసింది.

"ఆడ, కడా మడిలో మా అయ్యున్నాడు. సూత్తే నీకు దుడ్డుకట్టి పూజ తప్పదు!" అంది. అయితే కోపంగా మాత్రం కాదు.

ఆమెకెందుకో అతనిమీద దురభిప్రాయం మాత్రం కలగడం లేదు.

రెండు నిముషాలపాటు ఒకర్నొకరు చూసుకుంటూ నిలబడిపోయారు అందమైన ప్రకృతి మధ్యన, చింతచెట్ల నీడన.

కాస్త ధైర్యం పుంజుకుని అతడు చిరునవ్వు నవ్వాడు.

ఆమెకెందుకో అతని ముఖంలో తెల్లని పలువరుసతో అందమైన చక్కటి చిరునవ్వు బాగా నచ్చింది. అందువల్ల అప్రయత్నంగా ఆమె కూడా చిరునవ్వు నవ్వేసింది.

మనోహరమైన ఆ నవ్వు చూసి కింద పడిపోయాడు రంగప్ప.

ఆమె కంగారుపడిపోయి గబగబా అతని వద్దకు వచ్చి తన తలమీదున్న గంపను క్రిందికి దింపింది.

ఆలోగా అతడు కాస్త తేరుకుని లేచి కూర్చుని మరింత మనోహరంగా కన్పిస్తున్న ఆమె వదనారావిందాన్ని పరికింప సాగాడు.

"మూర్ఛా?" అందామె కంగారుగా.

"కాదు... నీ నవ్వు చూసేసరికి మైకం కమ్మింది!" అన్నాడు నిజాయితీగా.

అప్రయత్నంగా అతనికి చేయి అందించింది ఆమె. ఆ ఆసరాతో పైకి లేచాడతడు.

ఆ కరస్పర్శలో గుండెలు జల్లుమంటూ అంతులేని హాయి ఇరువురికీ... అందుకే అతడా కోమల హస్తాన్ని వదిలిపెట్టలేకపోయాడు. ఆమె పరిస్థితీ అదే నిజానికి... కొన్ని నిమిషాలపాటు!

ఎట్టకేలకు అతని చేతిని సున్నితంగా విడిపించుకోగలిగింది ఆమె. అప్పటికే ఆమె గుండెలు బరువయి ఎగసిపడ్తున్నాయి.

గంప అందుకుని నెత్తిన ఉంచుకుని వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ వెళ్లిపోసాగింది ఆమె. అతడలాగే నిలబడిపోయాడు కనిపించినంతసేపూ ఆమెనే చూస్తూ.

తమ ఊరికి వచ్చేశాక కూడా మనసులోంచీ ఆమె ఆ చూపు, ఆ నవ్వు... అసలామె బొమ్మే చెక్కుచెదరలేదు.

తండ్రి, అన్నదమ్ములు ఒద్దన్నా వినకుండా నాలుగు గంపల నారుకోసం నాలుగుసార్లు తిరిగాడు మరువపల్లెకు. ఆ మధ్యలోనే దార్లోని భీమగానిపల్లెలో ఓ మిత్రుడ్ని సంపాదించుకోగలిగాడు ఎలాగో.

ఇక ఆపై పదేపదే పరిందపండ్లు, మామిడి కాయలు, మొక్కజొన్నలు... ఇలా ఏదో ఒకటి మోసుకుంటూ భీమగానిపల్లెకు వెళ్లి కొత్త మిత్రుడ్ని... ఆ సందులోనే ఎలాగో ఆమెనూ కళ్లతో చూసి రాసాగాడు. భీమగానిపల్లె మిత్రుడు కూడా స్నేహపాత్రుడే.

రంగప్ప వచ్చిన ప్రతిసారీ బెల్లంముద్దలో, చెరకులో, వేరుశనక్కాయలో, రాగులో, బైరొడ్లో... ఏదో ఒకటి ఇచ్చి పంపడమే కాదు... రంగప్ప మనసును గ్రహించాడు కూడా!

పని పాటలొదిలేసి తిప్పట్లెక్కువయ్యాయని అంటూ తల్లి దండ్రులూ, సోదరులూ వారిస్తున్నా వినలేకపోయాడు రంగప్ప.

చివరికి అతని విరహవేదన, బాధ చూడలేకపోయిన మిత్రుడు ఆంజనేయులు చేసిన సాయంతో లక్ష్మిదేవితో మాటామాటా కలగలిపి ఒకడుగు ముందుకు వేయగలిగాడు రంగప్ప.

పాండవుల గుట్టమీద, పల్లె గంగమ్మ తల్లి కనుమలో, పాడుబడ్డ బాట సత్రంలో... ఇలా ఎక్కడో ఒక చోట ఎలాగో ఒకలా కలుసుకోసాగారు... కానీ హద్దు దాటనివ్వలేదు లక్ష్మిదేవి కట్టుబాటుగా...

ఆ సరికే పల్లె పల్లెంతా ఓ కొట్టిపోయింది.

ఓ రోజు లక్ష్మిదేవి అన్న పెద్ద శివప్ప రంగప్పనూ, ఆంజనేయులునూ కూడా చితకబాదేశాడు. దాంతో లక్ష్మిదేవికి రంగప్పమీద సానుభూతితో కూడిన ప్రేమ అధికం అయిపోయింది.

పదహారెకరాల పొలం, పాతిక గొర్రెలు, పది ఆవులు, రెండెనుములు, కాడెద్దులు, బండి, మంచి డబ్బూ కలిగిన రైతు కుటుంబీకుడు శివప్ప తండ్రి రామప్ప. అయితే తనో పెద్ద భూస్వామినని ఆయన స్వంత భావన.

తన కుమారుడు రంగప్పనూ, ఆంజనేయులునూ చితకబాదేసి వచ్చిన తరువాత మిన్నకుండిపోకుండా పదిమందినీ పట్టుకుని రంగప్ప తల్లి దండ్రులకూ, సోదరులకూ కబుర్లు పెట్టించి మరీ పల్లెలో పంచాయతీ పెట్టించాడు. ఈ "కాకిముక్కుగాడు దొండపండు లాంటి నా కూతురు పేరు, మా ఇంటి పరువూ పాడుచేయవచ్చా?" అంటూ.

కథక్కడే కొత్త మలుపు తిరిగింది.

స్థితిగతులలో రంగప్ప తండ్రి రామప్పకేమీ తీసిపోయేవాడు కాదు. పంచాయతీకి లక్ష్మిదేవి కూడా రావాల్సిందేనని పట్టుబట్టాడు ఆయన తన బలగంతో.

న్యాయమే నన్నారు పల్లె పెద్దలు.

రంగప్పంటే తనకూ ప్రాణమేనని తెగేసి చెప్పేసింది లక్ష్మిదేవి పంచాయతీలో.

లక్ష్మిదేవి తనకు కాకపోతే రైలుకిందపడి చచ్చిపోతాననేశాడు రంగప్ప కూడా.

అంత జరిగాక ఇక చేసేదేంలేక అప్పటికప్పుడు భీమేశ్వరాలయం ముందర రాతి మంటపంలో రంగప్పకూ, లక్ష్మిదేవికి వివాహం జరిపించేశారు కట్నకానుకలూ, నగానట్రా ఏమీ లేకుండా!

ప్రేమించి పెళ్లి చేసుకోవడం ఒక పెద్ద నేరంగానూ, తమ కుటుంబాల పరువు తీయబడినట్లుగానూ ఇరుకుటుంబాల వారూ భావించడం వల్ల... లక్ష్మిదేవి తల్లిదండ్రులూ, తోబుట్టువులూ ఆనాటినుండే ఆమె ఉనికినే మరచిపోతే, రంగప్ప తల్లిదండ్రులూ సోదరులూ కూడా వారిని వెలేసినట్లుగా ప్రవర్తిస్తూ చవుడుమడికొంత, రాళ్లచేనుకొంత, ఊరి వెలుపలి పాత అడ్డపిల్లు, గుడిసె, నాలుగు ఆవులు అతని వాటాగా అంటగట్టి చేతులు దులుపుకుని ఆపై పట్టించుకోవడం మానేశారు.

పెద్దంత రాతిమిద్దెలో పెరిగిన లక్ష్మిదేవి అతనివెంట ఊరి చివరి గుడిసెలోకి ప్రవేశించి చిరునవ్వు చెదరకుండా అతని గుండెల్లో ఆనంద దీపాలు వెలిగించింది.

ఆ ఏకాంత వాసమే వారికి అనుక్షణం ఆనందదాయకమైన, ప్రేమమయమైన మధుర స్మృతులను అందించసాగింది.

అతనికామె... ఆమె కతడు... వారికి వెన్నెల రాత్రులు... కడిగి పెట్టిన ముత్యాల్లా, చిదిమిపెట్టిన దీపాల్లా కాలమిచ్చిన ఇద్దరు పిల్లలు!!

✶ ✶ ✶

గతం కళ్లముందు మెదలగానే హఠాత్తుగా అతని మనసులో ఓ ఆనందరేఖ తళుక్కున మెరిసింది. దాంతో గుండెలో ఉత్సాహం.

ఇహ అప్పుడు... ఆమె శరీరం తాలూకు వెచ్చదనం అతని శరీరానికీ, ఒంపు సొంపుల తాలూకు ఆకర్షణ కళ్లకూ, నిగారింపుల తాలూకు మధురిమ మనసుకూ తెలియడం మొదలయింది మళ్లీ కొత్తగా.

"లచ్చి మీ!" అంటూ ఆనందంగా ఆమెను తన కౌగిలిలోకి తీసుకోబోయాడు. మూతలు పడిపోతున్న కన్నులను బలవంతంగా తీసి విప్పార్చి చూస్తూ అతని కోరికను గ్రహించింది ఆమె.

ఆమె శరీరంలో వేగవంతమైన కదలిక... కానీ...

"బిడ్డల్లేత్తారు... ఇప్పుడొద్దు!" అంది వారింపుగా.

"లచ్చిమీ…" లాలనగా అంటూ కౌగిలి బిగించబోయాడు.

"సీకట్లో నీళ్ల బానకిందేయడానికి ఒట్టి పుల్లల్లేవు… ఈ చల్లో తెల్లార్జామున తడిసిన కట్టిలూత్తూ బచ్చుటి పొయ్యికాడ కూసోలేను. ఈ రోజొద్దు… రేపు ఎండుపుల్ల లేరుకువస్తా… పో… పోయి గొడ్లకు కాసింత గడ్డేసిరా! పో!!" అందామె అతన్ని విదిలించుకుని.

రంగప్ప చిన్న బుచ్చుకుంటూ లేచి వెలుపలికి నడిచాడు.

అతని ముఖం వాడిపోవడాన్ని గమనించిన ఆమె మనసు సానుభూతితో నిండిపోయింది.

నెమ్మదిగా లేచి పక్కనే నులక మంచం మీద పడుకుని నిద్రపోతున్న పిల్లలిద్దరికీ రగ్గు సరిచేసి కప్పి, దీపం మరికాస్త తగ్గించి గుడిసె వెలుపలకు వచ్చి తలుపు మూసి చిలుకు పెట్టింది.

వామిలోంచి గడ్డి తీసుకు వచ్చి పశువులకు వేస్తున్నాడు రంగప్ప. అతని దగ్గరగా వెళ్లి నిలబడి…

"వాన మోడం ఎల్లిపోయింది మామా!" అంది.

"ఊ!" అన్నాడు రంగప్ప ముక్తసరిగా

"సందమామ నడినెత్తిన ఇరగ్గాత్తున్నాడు!" అంది లలితంగా.

రంగప్ప తను చేస్తున్న పని ముగించుకువచ్చి… ఆకాశంలో శాంతి కాంతులీనుతున్న చందమామనూ, వెన్నెల వర్షంలో తడుస్తున్న లక్ష్మినీ, ఎక్కుపెట్టిన విల్లులా తయారవుతున్న ఆమె ఒంపు సొంపులనూ, వింత కాంతితో మెరుస్తున్న నిగారింపులను తదేకంగా చూశాడు.

అతనికామె చాల కొత్తగా కన్పించిందా నిమిషంలో… నిజానికామె నిత్య నూతనమే అతనికి!

"లచ్చిమీ!" అన్నాడు గాఢంగా… సరికొత్త ఉత్సాహంతో.

ఆమె మౌనంగా మెరుస్తున్న కళ్లతో ప్రక్కనే ఉన్న సగం కప్పు పడిపోయిన తమ పాత అడ్డపింటికేసి చూసింది భావగర్భితంగా.

ఒక్కదూకుతో గడ్డివామి దగ్గరకు చేరుకుని నిచ్చన ఎక్కి రెండు కట్ల వరికసుపు లాక్కుని క్రిందికి దిగి రెండంగల్లో రిపేరీలకూ, కప్పడానికి నోచుకోలేకపోతున్న

అడ్డపింట్లోకి దూసుకుపోయాడు రంగప్ప... అతని వెనుకగా ఆమె... ఉరుము వెంబడి మెరుపుగా.

మల్లె పందిరి మీదనుండీ వీస్తున్న గాలి తాలూకు సువాసన గొప్ప మత్తుగానూ, సగం కూలిన కప్పులోంచీ కురుస్తున్న వెన్నెలవాన గమ్మత్తుగానూ ఉంది.

ఐదు నిమిషాల్లో వరిగడ్డి పరుపుమీద కప్పబడ్డ అతని పంచ, పై పంచలతో హంసతూలికా తల్పం సిద్ధం అయిపోయింది.

ఎడంచేత్తో ఆమె నడుం పట్టుకుని ఒక్క విసురుతో తనకేసి లాక్కున్నాడు అతడు. అతడి కుడిచేతి స్పర్శతో వలువలూడ్తున్న ఆమె శరీరం వింత ప్రకంపనాలకు గురవుతోంది. పదునెక్కుతున్న శరీరాల తాలూకు స్పర్శసుఖం ఇరువురికీ మనోహరమైన పులకింతలనిస్తోంది.

క్రమానుగతంగా రతీ మన్మథులయి వరిగడ్డి తల్పంమీదికి చేరుకున్నారు ఏక శరీరులయి.. తనివితీరని కాంక్షలతో!

సాధారణమైన అబలను అపురూప లావణ్య రాశిలా, ప్రేమ సామ్రాజ్య దేవతగా, సామాన్యుని... అసమాన్యుడిగా, ఆనంద సామ్రాజ్యాధినేతగా మార్చి వెయ్యగలిగిన ఆ సగం కప్పు కూలిన అడ్డుగుడిసె అప్పటికప్పుడు ప్రపంచంలోకెల్లా అద్భుతమైన, అతిమనోహరమైన సుందర ప్రదేశం అయిపోయింది... వెన్నెల వెలుగులలో...

ప్రణయానికి మించిన దేముంది ప్రపంచంలో!?

గంట సమయం గడచిపోయాక... వెన్నెల మరింత కాంతివంతమవుతోండగా... "లచ్చిమీ!" అన్నాడు అతడు మరింత గాఢంగా.

"ఏం మామా?" అలసటతో తృప్తిగా, బరువుగా మూతలు పడి పోతున్న కనురెప్పల్ని విప్పార్చి నక్షత్రాల్లా మెరుస్తున్న కళ్లతో అతన్ని చూస్తూ ప్రశ్నించింది ఆమె.

"ఈ పెపంచంలో మనపైన అద్దుట్టమంతులుంటారా?"

"ఉండరు మామా!" అమె స్వరంలో అంతులేని ఆనందం, ఆత్మ విశ్వాసం. అతని శరీరం ఉప్పొంగింది... ఆమెను తనలో ఐక్యం చేసుకోవడానికి మరింత ఉత్సాహంగా ఆమెకేసి వాలాడు. ✪

*–'ఆశ' మాసపత్రిక – ఆగస్టు 2012*

# అణాకార్డు

"**స**ంసారం సాగరం దుఃఖం అన్నారు పెద్దలు" అంటూ నిట్టూర్చాడు రిటైర్డ్ మేజర్ చంగప్ప నిరుత్సాహంగా పైపులో టుబాకో దట్టించుకుంటూ.

"ఇప్పుడే కద... మటన్ బిరియానీ, చికెన్ కుర్మా, ఫిష్‌ఫ్రై, హాఫ్ బాయిల్డ్ ఎగ్, కర్డ్ కచ్చుమ్మర్లతో లంచ్ లాగించారు. చేతి తడి నాప్‌కిన్ కంటకముందే ఇల్లు కాస్తా దుఃఖ సముద్రమైపోయిందా" అంది ఆయన శ్రీమతి అరటిపండ్లు పట్టుకు వస్తూ.

"నీవు చేసి పెడ్తున్న వంటకాలను తప్పుపట్టడం లేదు మహాలక్ష్మీ, నేను ఎక్కడికైనా వెళ్తే మీకు ఇబ్బందవుతుందని ఎక్కడికీ వెళ్ళలేకపోతున్నాను. స్వేచ్ఛగా యుద్ధరంగాలలో వీర విహారం చేసిన వాడ్ని. ఇప్పుడేమో ఇల్లే నాకో బందిఖానా అయింది!"

"ఇంతకూ తమరెక్కడికి వెళ్ళాలని?" అంది ఆమె అరటిపళ్ళ పళ్ళెం అందించి.

"నా మిత్రుడు తంగప్ప తిరుపతి వెళ్తున్నాడు కద? నేనూ వెళ్ళలేక పోతున్నాను. రెండు పూటలా హాయగా వాక్ వెళ్ళే వాళ్లం కద!" అన్నాడు చంగప్ప అరటిపండ్ల పనిపడ్తూ.

"ఆహా! మూణ్ణాళ్ళ ముచ్చటకే అంత వైరాగ్యమా? ఏ ఇబ్బందీ లేకుండా పనులన్నీ చూసుకుంటాం కానీ మీరూ వారితోపాటు వెళ్ళిరండి! ఈ రెండు మూడు రోజులయినా సుబ్బరంగా సాంబార్లూ, ఆకుకూరలూ, పప్పు రసాలూ, పాయసాలూ వండుకుని మసాలా వాసనలు లేకుండా ఇంటిల్లిపాదీ హాయిగా తింటాం!" అంది మహాలక్ష్మి.

గతుక్కుమన్నాడు చంగప్ప జావగారి పోతూ.

"మిమ్మల్నవన్నీ వండుకు తినవద్దన్నానా?" అన్నాడు ఉడుక్కుంటూ.

"మీకిష్టమైన మాంసాహారాలు వండడానికే ఇరవయి నాలుగ్గంటలు చాలడం లేదు. ఇంకా మాకిష్టమైనవి ఎక్కడ వండుకోము? మీరు తంగప్పస్వామి గారితో తిరుపతి వెళ్ళిరండి. ఆ లోపు మాకిష్టమైన వంటకాలూ కొన్నయినా వండుకు తింటాము" అంది మహలక్ష్మి.

"తంగప్ప కుటుంబ సమేతంగా వెళ్తున్నాడు కద? వారి మధ్యన నేనెలా వెళ్ళేది?"

"అయితే ఏం? వారంతా మన కుటుంబ మిత్రులూ, ఆప్తులూ కదా?!" అందామె ఆశ్చర్యంగా.

"అబ్బ... అదికాదు లక్ష్మీ... వారేమో వారి బంధువుల నిశ్చితార్థానికి వెళ్తున్నారు. ఆ కార్యక్రమంలో తంగప్ప పాత్ర బాగా ఎక్కువగా ఉన్నట్లుంది. తనేమో నన్ను తన వెంటే ఉండాలన్నాడు. కానీ నేనే ఏదో చెప్పి తప్పించుకున్నాను!" అన్నాడు చంగప్ప.

"ఏం? ఎందుకని??" మరింత ఆశ్చర్యపోతూ ప్రశ్నించింది మహాలక్ష్మి.

"ఆ శాకాహార భోజనాలు నాకు సంతృప్తినివ్వవు కద? ముక్క లేనిదే ముద్ద ఎత్తలేని వాడ్నయితిని... వారితో వెళ్ళాక వెలుపలి హోటళ్లలో తింటే బావుండదు కద?"

"అదా కథ? అయినా మీ మిత్రుని ఎడబాటు కాస్తా మీకు మన సంసారాన్ని సాగరంగానూ, దుఃఖపూరితంగానూ భూతద్దంలో చూపుతోందా? బావుంది... మీరు సుబ్బరంగా ఆ మిగిలిన అరటిపండు తినేయండి! నేను తాంబూలం పట్టుకువస్తాను. వేసుకున్నాక తీరిగ్గా పైపు పీల్చుకుంటూ బాధ పడ్తురుగానీ!" అంటూ వెళ్ళింది ఆమె.

"తాతయ్యా, ఇకపై మీరెప్పుడూ 'సంసారం, సాగరం, దుఃఖం' అన్న వాక్యాన్ని వాడరు బహుశా!" అన్నాడు ఆయన మనవడు వెంకటముని నవ్వేస్తూ.

చంగప్ప కష్టం మీద తన నవ్వును దాచుకోగలిగాడు.

ఐదారు నిముషాల తరువాత... "మోకాలి నొప్పితో చాల బాధపడ్తున్నాను కద?" అంది మహాలక్ష్మి చంగప్పకు తాంబూలం అందిస్తూ.

"నిజమే!" అన్నాడు చంగప్ప సానుభూతిగా.

"నా మాత్రలయిపోయి ఎన్ని రోజులాయె?" అంది ఆమె కాస్త నిష్ఠూరంగా.

"ఆ ఆయుర్వేద మాత్రలు ఇక్కడెక్కడా దొరకడం లేదు కద లక్ష్మీ, కోటా కోసం బెంగుళూరు క్యాంటీనుకు వెళ్తాను కద? అప్పుడే అక్కడే ఆయుర్వేద మెడికల్ షాపుల్లో తెస్తానులే!"

"అంతవరకు ఆగడం ఎందుకు? తిరుపతిలో దొరుకుతాయి కద?" అందామె.

"అవునవును... నాకా ఆలోచనే రాలేదు!" అంటూ సోఫాలోంచి చప్పున లేచి ఫోను వద్దకు నడచి రిసీవర్ అందుకుని చకచకా నంబర్లు ప్రెస్ చేశాడు చంగప్ప.

అవతల ఫోను రింగవుతోంది కానీ ఎవరూ తీయడం లేదు. అందువల్ల ఫోను పెట్టేసి సెల్ అందుకుని తంగప్ప నెంబరు సెర్చ్ చేసి కాల్ చేశాడు.

"ఓ, చంగప్పా... ఏమిటి?" అన్నాడు తంగప్ప అర నిముషంలోనే అవతలి నుండీ.

"తంగప్పా ఎక్కడున్నావు? ల్యాండు ఫోను ఎవరూ తీయడం లేదు!"

"తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో... నీవు రానన్నావు కదా?... ఇప్పుడే పీలేరు దాటుతున్నాము!"

"వార్నీ... చాల ఫాస్టుగా ఉన్నావే! సరే ఓ పని చెయ్యి... తిరుపతిలో దిగగానే ఆయుర్వేద మందులషాపుకు వెళ్ళి డి.చైన్ కంపెనీ మాత్రలు "ఆర్మోప్రిన్" ఓ అరవయి కొని అర్జంటుగా కొరియర్‌లో పంపించాలి" అన్నాడు చంగప్ప.

"సరే, అలాగే పంపుతాను... ఇంతకూ మాత్రలెవరికి?"

"నా శ్రీమతి మోకాలి నొప్పికి... అవి మన ఘటోత్కచపురంలో దొరకవు. నా భార్య శరీరతత్వానికి ఆ మాత్రలు చాల బాగా పనిచేస్తున్నాయి" అన్నాడు చంగప్ప.

"అలాగా, అక్కడ దిగగానే ఆయుర్వేద ఫార్మసీలలో విచారించి, ఆ డి.చైన్ కంపెనీ మాత్రలు "ఆర్మోప్రిన్" తీసి పంపుతాను... సరా? అన్నాడు తంగప్ప అవతలి నుండి.

"గుడ్! విష్‌యూ ఎ హేపీ జర్నీ!" అంటూ సెల్ కట్ చేశాడు చంగప్ప.

* * *

వంటరిగా వాక్ వెళ్ళివచ్చిన చంగప్ప స్నానానికి వెళ్ళబోతూ తన శ్రీమతి మోకాలికి మద్దినూనె రాసుకుంటూండడం చూశాడు.

"రెండ్రోజులై పోయింది... తంగప్ప మాత్రలు పంపలేదే?" అని అనుకుంటూ వెనక్కి వచ్చి సెల్‌ఫోన్ అందుకుని తంగప్ప నెంబరు ప్రెస్ చేశాడు.

"చంగప్పా, ఎలా వున్నావు? ఏమిటి విశేషం??" అన్నాడు తంగప్ప అవతలి నుండి ఉత్సాహంగా.

"బావున్నాను తంగప్పా... సరే... నీవెక్కడున్నావు?"

"ఇప్పుడు తిరుపతి శ్రీనివాస కళ్యాణమంటపంలో ఉన్నాము. నిశ్చితార్థం జరగబోతోంది!"

"అలాగా! అదిసరే... నేను చెప్పిన మాత్రలు తిరుపతిలో దొరకలేదా?"

"ఎందుకు దొరకలేదు? మొన్ననే ఆ మాత్రలు తీసి కొరియర్‌లో పంపాను కద?"

"అరె, నాకేం అందలేదే?" ఆశ్చర్యంగా అన్నాడు చంగప్ప.

"అలాగా, అయితే రేపందుతుందేమో? బహుశా!"

"హైదరాబాదు, బెజవాడల నుండీ వచ్చే ఉత్తరాలు గట్రా మనకు ఒక్కరోజులోనే అంది పోతున్నాయే?! తిరుపతి నుండీ మన ఘటోత్కచపురానికి మధ్యనున్న నూటపదకొండు కిలోమీటర్ల దూరానికి నాలుగు రోజులా?" అన్నాడు చంగప్ప విసుగ్గా.

"బహుశా, అంతేనేమో?" అన్నాడు తంగప్ప.

✶ ✶ ✶

మునక్కాడల సాంబారు, కొబ్బరి పచ్చిడితో ఆరు ఇడ్లీలు, రెండు వడలు... బంగాళా దుంపల వేపుడుతో రెండు నెయ్యి దోశలు... మటన్ కర్రీతో ఆరు పూరీలు తిని టిఫను ముగించుకుని హాల్లోకి వచ్చి సోఫాలో కూర్చుని పైప్‌లో టుబాకో నింపుకోసాగాడు చంగప్ప.

"తంగప్పస్వామిగారు మాత్రలు పంపామన్నారు కద, మరేమిటి ఇంకా అందలేదు" అంది మహాలక్ష్మమ్మ టీ కప్పుల ట్రే పట్టుకు వస్తూ.

"అవును కద?" అంటూ సెల్‌ఫోన్ అందుకున్నాడు చంగప్ప.

"తంగప్పా, ఎలా వున్నావు? ఎక్కడున్నావు??" అన్నాడు అతడు లైన్‌లోకి రాగానే.

"మిత్రమా ప్రస్తుతం తిరుమలలో ఉన్నాము!"

"నిశ్చితార్థం అయిపోగానే తిరిగి రాకుండా తిరుమల కెందుకు వెళ్ళావు?"

"పనయ్యాక ఈ ఆడవాళ్ళు ఊరకే వుంటారా? తిరుమలన్నారు... ఇహ రాక తప్పలేదు!"

"అలాగా? మరి కొండ ఎప్పుడు దిగుతారు?" అన్నాడు చంగప్ప నీరసంగా.

"శీఘ్ర దర్శనం క్యూలోకి వెళ్ళబోతున్నాము అలా అయినా ఆరేడు గంటలు పడ్తున్నదట దర్శనానికి. దర్శనం అయ్యాక కొండ దిగడమే!"

"శీఘ్రదర్శనం అన్ని గంటలయితే సర్వ దర్శనం ఎన్ని గంటలట?"

"ఇరవయి గంటల వరకూ పడ్తున్నదట... ఇసుక వేస్తే నేల రాలనట్లున్నారు జనాలు కొండమీద! ఇంతకూ వాక్ వెళ్తున్నావా? లేదా??" అని ప్రశ్నించాడు తంగప్ప.

"నా వాక్ మీద బండపడా... నా భార్యకు మోకాలి నొప్పి మరీ ఎక్కువగా ఉన్నట్లుంది. గతమాసం క్యాంటీన్ పనిమీద బెంగుళూరు వెళ్ళినపుడు అక్కడ ఆ మాత్రలు తేవడం మరచి పోయాను. ఇప్పుడు నీవు పంపిన మాత్రలూ అందలేదు" అన్నాడు నిరుత్సాహంగా.

"మాత్రలింకా అందలేదా? అతి తక్కువ రేట్లతో యమవేగంగా అందజేసే కొరియర్ కంపెనీ తమదే అన్నాడే ఆ కొరియర్స్ అతను!" అన్నాడు తంగప్ప ఆశ్చర్యంగా.

"యమపురి కయితేనా? ఇంతకూ ఆ కొరియర్ కంపెనీ పేరేమిటి?"

"ఎస్.ఎఫ్.ఇ. కొరియర్స్... అంటే... సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కొరియర్స్ అట. ఓ పని చెయ్యి చంగప్పా... నీవే వెళ్ళి వాళ్ళ బ్రాంచిలో విచారించి మాత్రల కవరు తీసుకో!" అన్నాడు తంగప్ప.

"సరే, అలాగే చేస్తాను... నీవు తొందరగా వచ్చెయ్యి... నీవు లేనందున ఇక్కడ నాకు బొత్తిగా తోచడంలేదు!" అన్నాడు చంగప్ప.

"నాకూ ఇక్కడలాగే ఉంది మిత్రమా... దర్శనం కాగానే మా వాళ్ళని తిరుగు ప్రయాణానికి తొందర చేస్తానులే" అన్నాడు తంగప్ప నవ్వేస్తూ.

* * *

తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌ను పోర్టికోలో తమ కారు ప్రక్కనే ఆపి నిరుత్సాహంగా స్టాండువేసి నిట్టూరుస్తూ ఇంట్లోకి నడిచాడు చంగప్ప.

"ఇంత ఎర్రటి ఎండలో ఎక్కడికి వెళ్లారండీ?" అంది ఆయన శ్రీమతి చల్లటి నీళ్ళనందిస్తూ.

"ఆ కొరియర్ కంపెనీ కోసం ఊరంతా చుట్టి వచ్చాను లక్ష్మీ... కొత్త కంపెనీ కాబోలు దాని అడ్రసు తెలియడం లేదు!" అన్నాడు.

"తంగప్పస్వామి గారికి ఫోన్ చేసి అక్కడి బ్రాంచిలో కనుక్కోమని చెప్పండి!" అంది.

"తంగప్పకు ఫోను వెళ్ళడం లేదు... ప్రయాణంలో ఉన్నాడేమో?"

"అయితే మరి చేసేదేముంది? మీరు భోజనానికి రండి!"

"ఆ, అన్నట్లు ఏం వండావీపూట?" అన్నాడు చంగప్ప ఓ గుటక వేసి.

"ఎగ్ బిరియానీ, మటన్ కర్రీ, చికెన్ ఫ్రై, కర్డ్‌బాత్!...

"అంతేనా" అన్నాడు చంగప్ప నిరుత్సాహంగా.

"మాత్రలయిపోయినప్పట్నుండీ ఏ పనీ సరిగ్గా చేసుకోలేక పోతున్నానండీ! అక్కడికీ కోడలు, నేను, పనిమనిషి... ముగ్గురు కలసిచేస్తున్నా పనులు తెమలడంలేదు. ఈ పూటకిలా కానిచ్చెయ్యండి... రాత్రికి రొయ్యలపులుపు, చుక్కారొట్టె కూడా చేస్తాము!" అంది మహాలక్ష్మి.

✶ ✶ ✶

సాయంకాలం తంగప్ప దగ్గర్నుండీ ఫోను వచ్చింది.

"చంగప్పా... ఎస్.ఎఫ్.ఇ. కొరియర్సు వారిని విచారించాను. వారు ఆరోజే డిస్పాచ్ చేసేశారట. వాళ్ళ బ్రాంచి ఘటోత్కచపురం పడమటి కొత్తపేట వీధిలోనే ఉందట!"

"వార్నీ... మా వెనుక వీధిలోనేనా? ఊరంతా చెడ తిరిగినా తెలియకపోయింది. అంత గొప్ప పేరున్న కొరియర్స్‌లో పంపావన్న మాట!" అన్నాడు చంగప్ప నిష్టూరంగా.

"ఫర్లాంగు దూరంలో వున్న తూర్పు కొత్తపేటలో మందుల కవరు అందించడానికి ఐదు రోజులా? అని కేకలేశాను. వెంటనే డెలివరీ ఇవ్వమని ఇందాకా ఫోను చేశారు వీళ్ళు అక్కడికి. కాస్సేపట్లో మాత్రల ప్యాకెట్ మీ ఇంటికి వస్తుంది" అన్నాడు తంగప్ప ఉత్సాహంగా.

"కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లుంది... సరే నీవు త్వరగా తిరిగి వచ్చెయ్యి!" అన్నాడు చంగప్ప.

✶ ✶ ✶

మరునాడు మధ్యాహ్నం మహాకోపంగా కూర్చుని తంగప్పకు కాల్ చేశాడు చంగప్ప.

"తంగప్పా మంచి కొరియర్స్‌లో పంపావయ్యా మాత్రలు! వాళ్ళా తెచ్చి యివ్వరు! నేనే వెళ్ళినా ఎవరూ ఉండరు... వేసిన తాళం వేసినట్లే ఉంది నిన్నటి నుండీ!" అన్నాడు.

"హతవిధీ!" అన్నాడు అవతలి నుండీ తంగప్ప.

"నాబొందవిధి. ఇంతకూ ఇక ఇక్కడికి రావా? అక్కడే సెటిలయిపోతావా?"

"నేను తిరిగి వచ్చేసి కొన్ని యుగాలయింది. మీ ఇంటిముందు ఆటో దిగుతున్నాను మహాప్రభో".

"వార్నీ" అంటూ సెల్ ఆఫ్ చేసి వెలుపలికి నడిచాడు చంగప్ప ఉత్సాహంగా.

ఇంటిముందు ఆటో దిగిన తంగప్ప ఆటోబాడుగ చెల్లిస్తూ కన్పించాడు.

"తంగూ, మై ఫ్రెండ్, వెల్‌కం... వెల్‌కం!" అన్నాడు ఆనందంగా ఆహ్వానం పలుకుతూ.

"ఎప్రతివాసీ పరిపించి పూలు కూడా చల్లించేలా ఉన్నావే... పద పద ముందు ఆ కొరియర్స్ వాడి సంగతేమిటో చూద్దాం" అన్నాడు తంగప్ప ఆతృతగా.

"నేనిందాకే వెళ్ళి వచ్చాను తంగప్పా! ఎన్నిసార్లు వెళ్ళినా వేసిన తాళం వేసినట్లే ఉంది!"

"అయినా మళ్ళీ వెళ్దాం పద... వాళ్ళ సంగతేమిటో తేల్చేద్దాం!"

"ఎండ తంగప్పా..."

"ఏం మిలటరీ వాడివయ్యా? అందుకే కద ఈ దేశం ఇలా అఘోరిస్తోంది... పద పద... ఆ కవరు పట్టేదాకా నాకు తోచదు..." అన్నాడు తంగప్ప అట్నుంచీ అటే అడుగేస్తూ.

ఇద్దరూ వెళ్ళి వెనక వీధిలోనే వున్న ఆ కొరియర్సు షాపు వద్దకు చేరారు... వేసిన తాళం వేసినట్లే ఉంది.

"వీళ్ళనెలా పట్టుకోవడం?" అంటూ ప్రక్కషాపు వాళ్ళను ప్రశ్నించాడు తంగప్ప.

"ఆ బోర్డు కింద చిన్న అక్షరాలతో సెల్ నెంబరుంది కదా?" అన్నారు వాళ్ళు.

"ఇన్ని సార్లు చచ్చాను. ఈ నెంబరు గమనించలేకపోయాను!" అన్నాడు చెంగప్ప.

ఆపై... తన సెల్‌ఫోన్‌తో ఆ నెంబర్ను కాంటాక్టు చేశాడు... చప్పున వచ్చింది జవాబు...

"సారీ సర్, ఎస్.ఎఫ్.ఇ. కొరియర్సు ఇప్పుడు మేంకాదు... ఆ సర్వీసు వదులు కున్నాం!"

"అరె, అలాగా?! మరి ఇప్పుడెవరయ్యా?"

"ఎయిర్ ఎక్స్‌ప్రెస్ కొరియర్స్ వారు అటాచ్ చేసుకున్నారట."

"వాళ్ళెక్కడుంటారు నాయనా?"

"ఆర్టీసీ బస్టాండు దగ్గరగా స్టేటు బ్యాంకు ఎ.టి.ఎం. కుడిప్రక్కనున్న ఆఫీసే!" అంటూ సెల్ కట్ చేసేశాడు అవతలి వ్యక్తి.

మళ్ళీ ఇంటికి వెళ్ళి మోటారు సైకిలు తెచ్చుకునే ఓపిక లేక ఆటో ఎక్కేశారు...

"అవున్సార్, ఎస్.ఎఫ్.ఇ. కొరియర్స్ కూడా మేమే తీసుకున్నాం... మీకు వెంటనే కవరును డెలివరి చెయ్యమని తిరుపతి నుండీ ఫోను కూడా వచ్చింది. అయితే స్టాఫ్ కొరత వల్ల సకాలంలో అందించలేకపోయాం సారీ!" అంటూ షాపతను కవరు అందించి సంతకాలు తీసుకున్నాడు.

ఇల్లు చేరగానే – "మహాలక్ష్మీ, ఇంద నీ మాత్రలు... వెంటనే వేసుకో!" అన్నాడు చంగప్ప ఆనందంగా కవరు అందిస్తూ. అతని ఆనందం చూసి నవ్వుకున్నాడు తంగప్ప.

"ఇందాకా మాత్ర వేసుకున్నానండీ!" అంది మహాలక్ష్మి చిన్నగా నవ్వి.

"మాత్రలు లేవుకదా? ఎలా వేసుకున్నావు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు చంగప్ప.

"మొన్న మధ్యాహ్నం హైదరాబాదు నుండీ మా తమ్ముడు ఫోన్ చేస్తే మాత్రలు లేని విషయం, తంగప్పస్వామి గారు తిరుపతి నుండీ పంపించినా అందని విషయం చెప్పాను. వాడు వెంటనే కొని పోస్ట్‌లో పంపినట్లున్నాడు... ఇందాకా పోస్ట్‌మన్ ఇచ్చివెళ్ళాడు!"

"నేను మాత్రలు పంపిన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కొరియర్సు వారికన్నా, ఇప్పుడందించిన ఎయిర్ ఎక్స్‌ప్రెస్ కొరియర్స్ వారికన్నా, మన పోస్టలు శాఖ చాల వేగంగా కదిలి పనిచేస్తున్నట్లుంది" అన్నాడు తంగప్ప ఆశ్చర్యపోతూ.

"అనాదిగా అపారమైనవి కదన్నా పోస్టలు శాఖవారి సేవలు? ఆ రోజుల్లో కాశీ నుండీ మా బంధువులు కైవారంలో వున్న మా తాతగారికి అణాకార్డు వ్రాసి డబ్బాలో వేస్తే ఆరు రోజుల్లో అందిపోయేది. "తోకలేని పిట్టంటే ఏమనుకున్నారు? అణాకార్డు అరవయి వూర్లు తిరిగయినా స్వంతదారునికి చేరుతుంది!" అంటూండేది మా బామ్మ. ఇప్పటికీ వారి సేవలు కొనియాడదగినవే!" అంది మహాలక్ష్మి నిండుగా నవ్వి. ✪

***ఆలోచించండి మాసపత్రిక – డిసెంబరు 2012***

త్వరలో విడుదల ........

'ఆలోచించండి' మాసపత్రికలో

గత రెండున్నర సంవత్సరాలుగా ధారావాహికగా వెలువడుతున్న ... టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి రచన....

**'చిత్తూరు జిల్లాలో వందేళ్ళ కథాసారధులు'**

(మొదటి భాగం)